మార్చి 16-31, 2023
సంపుటి 03, సంచిక 11

తెలంగాణ జాగృతి

# తంగేడు

తెలుగు సాహిత్య పక్ష పత్రిక



సాహితీ మిత్రులకు,
తంగేడు పాఠకులందరికీ
శోభకృత్ నామ సంవత్సర
ఉగాది శుభాకాంక్షలు!!



ప్రసిద్ధ ప్రజా రచయిత

# సుంకర సత్యనారాయణ

జయంతి : 23-3-1909

*Printed, Published and Owned by :* ***KALVAKUNTLA KAVITHA***
Printed at : **HARSHITHA PRINTERS**, Khairatabad, Hyderabad - 500 004.
Published at : **TELANGANA JAGRUTHI,** Pasham Amruthaaram Residency, H.No. 1-2-234/13/46/4, 4th Floor, Near NTR Stadium Aravind Nagar, Domalguda, Hyderabad - 500 029. Telangana State.
Editor : **KALVAKUNTLA KAVITHA**

# విషయ సూచిక


40 ఎగిరితే పడిపోయేది కిందనే అంటున్న **కందుకూరి శ్రీరాములు** కవిత **"ఇంత బూడిద"**

35 కల్మషాన్ని నింపని కవి గురించి **వింజామర** విశ్లేషణ **"సాహిత్య కిరీటం"**

45 భూతం ముత్యాలు దళిత కథ సారం వివరించిన **మండల స్వామి** వ్యాసం **"దళితుల వెతలకు దర్పణం 'దగ్ధం' కథలు"**

20 మానససరసిలోని చెలిమిని తడిమిన **తుమ్మూరి** **"గజల్"**



21 నిసర్గ హృదయాలను చిత్రించిన **గడ్డం సతీశ్ కథ** **"రేకుల కింద రెక్కలు"** ...



05 కందిరీగలై కాటేసిన ఆనాటి దురాగతాలను చిత్రించిన నాటి కథ **బోయ జంగయ్య** **"కందిరీగలు"**



27 కొడుకే అపాత్రుడైన దుస్థితిని చిత్రించిన కథ **కటుకోజ్వల మనోహరాచారి** **"అపాత్ర దానం"**



17 అశోక్ తేజ పాటలోని ఆత్మను వివరించిన **కోయి కోటేశ్వరరావు** వ్యాసం **"ప్రాణం పాటైతే..."**



31 ఇటీవలి కథా పరిణామం వివరిస్తున్న మినుకూరి **శ్రీనివాస్ రెడ్డి** వ్యాసం **"కాలంతో స్త్రీ కథ"**



13 మానవ సంబంధాలలో వెన్నంటే విషాదాల చిత్రిస్తున్న **లక్ష్మీ కందిమళ్ల** కథ **"ఎప్పటికీ మరువలేము"**

41 నాటి శాసనాల్లో వికసించిన సమాజం వివరిస్తున్న **మామిడి హరికృష్ణ** వ్యాసం **"ముస్లిం పాలకులు - తెలుగు శాసనాలు"**

37 కరీంనగర్ సాహిత్య కీర్తి కిరీటం **వారాల ఆనంద్‌తో విజయ ప్రకాశ్ ముచ్చట** ఈ పక్షం **"ముఖాముఖి"**

ధన రూపం ఎత్తిన రంగు కాగితం రంగును చెబుతున్న **డా॥ ఐజక్** గుండె కవిత **"రంగు కాగితం"** ...పేజీ 33

వంటగదుల్లో మగధీరుల చెయ్యిలూ గిలగిలలాడాలి అంటున్న **అన్నవరం దేవేందర్** కవిత **"మగ ఘుమఘుమలు"** ...పేజీ 04

నిప్పుతో కాలితే ఇనుమే కాదు ఇగో కూడా ఒంగుద్దని నిరూపించే **రవీంద్ర సూరి** కవిత **"ఈరోజు గడిచేలోపు"**... పేజీ 24

భావి కాల పరిశోధనలకు భూమిక అందిస్తున్న విమర్శ పైన సాగర్ల సత్తయ్య వ్యాసం **"సూత్రీకరణలు చేసే సునిశిత విమర్శకుడు"** ...పేజీ 09

నేల కాళ్లకు నేనే తొట్ట తొలి త్రోవను అంటున్న **వనపట్ల సుబ్బయ్య కవిత** **"కోడిపందాలు ఎదురు చూడకు"** ...పేజీ 30

ప్రవాహాన్ని చూసే ధైర్యం లేదంటున్న జాదవ్ అంబదాస్ కవిత **'వీడని వేర్లు'** ...పేజీ 08

కులవృత్తిని కలం వృత్తిగా మార్చుకున్న కవిని గురించిన వ్యాసం **"తీరొక్క చేపల తిర్నాల"** ...పేజీ 25


**ఇంకా...** మరెన్నో కవితలు, సాహితీ శిఖరం, సమాజం, పుస్తక పరిచయం, స్వీకారం.. మొదలైనవి...

# బీద బాలిక

శ్రీమతి. యస్. భారతీరత్నాకరాంబ [ప్రిమెట్రిక్.]

చ॥ తిరుగుచు గ్రామమంతటను ♦ దిక్కఱి,—'యంబరవీథియందు భా
స్కరుఁడు ప్రచండుఁడౌట వెడఁ ♦ జల్లునొకో! ధరసగ్ని?' నంచుఁ జూ
పఱ కెడఁ దోఁచునట్టి దిన ♦ భాగమునందున-భిక్ష వేడుచున్
అరయఁగ నొక్కబాలిక కృ ♦ శాంగముతోఁ జరియించె, నక్కటా!

గీ॥ మిహిరునింగని పద్మభా ♦ మినులు మోద, మంది సుందరమందహా ♦ సాననములఁ
బరఁగి చెలువొంద, నాబీద ♦ బాలికాము, ఖారవిందము వాడె స్వే ♦ దాంకితమయి॥

గీ॥ ఒక్క గృహవాటికడ కేగి ♦ యువిద యిట్టు, లడిగె జాలైనఁ గరగెఁడి ♦ వదువుదోఁప
"ఆకలికిఁ దాళలేను మా ♦ యమ్మలార! పట్టెడన్నము పెట్టి కా ♦ పాఁడుఁడమ్మ!"

ఉ॥ "వేళయుఁ బాళలేక తిరి ♦ పెంప బడుగం జనుదెంతు వీవు! ఈ
వేళలయందు భిక్షమును ♦ వేయఁగలార లెవారు నీకు ? నో
కూళ!" యటం చొకర్తె కడుఁ ♦ గ్రోధముతోఁడులేఁ బల్కుచుండఁగా
బాలిక కండ్లనుండి యొక ♦ బాష్పకణాల బదిజాఱెఁ జెక్కులన్॥

ఆ॥ "చింతచచ్చి పులుసు ♦ చెదరని విధమున, నేల దురభిమాన ♦ మింత నీకు ?
ఇంతమాట యనక ♦ యేరొసంగద రోసి! ఇంత పేదరాలి ♦ కీ ధరిత్రి?"

కం॥ అను నామెపలుకు ములికిగఁ, గనలి మదింగ్రివ్వ, భావ ♦ గర్భిత దృష్టిం
గనుగొని యొకపరి, బాలిక, తనత్రోవం బోయె, దైవ ♦ తంత్రివివశయై॥

సేకరణ : సంగిశెట్టి శ్రీనివాస్

తంగేడు
తెలంగాణ జాగృతి
తెలుగు సాహిత్య పక్ష పత్రిక

16-31 మార్చి, 2023

సంపుటి 03 సంచిక 11



శ్రీమతి కల్వకుంట్ల కవిత
ఎడిటర్



డా॥ కాంచనపల్లి గోవర్ధన్ రాజు
అసోసియేట్ ఎడిటర్
9676096614

ఎడిటోరియల్ బోర్డ్ :
ఘనపురం దేవేందర్
రంగు నవీనాచారి

# జాతిపురోగమనంలో మాతృభాష...

మానవ జీవితంలో భాష అతి ముఖ్యమైనది. జంతుపక్ష్యాది ప్రపంచం నుండి బుద్ధి జీవులను వేరు చేసేది ప్రధానంగా భాషే. మనిషి పుట్టడంతోటే, ఒక ప్రాంతానికి, ఒక కుటుంబానికి ఎట్లా వారసుడు అవుతాడో భాషకు కూడా అట్లాగే వారసుడు అవుతాడు. అతనికి పుట్టడంతోనే సంక్రమించిన జాతి, మతం, దేశం, ప్రాంతం ఎలాగా అతనికి సొంతమో భాష కూడా అంతే. ఇట్లాగా తనకు పుట్టక ముందే నిర్దేశింపబడ్డది మాతృభాష. భాషతోటే మనిషికి సాంస్కృతీకరణ జరుగుతుంది. అది అతనికి అవిభాజ్యం. మాతృభాష ప్రాధాన్యాన్ని యునెస్కో కూడా గుర్తించింది. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 21న ప్రపంచవ్యాప్తంగా నిర్వహించాలని, 1999 నవంబర్ 17న యునెస్కో ప్రకటించింది. 2000 సంవత్సరం నుండి ప్రతి ఏటా మాతృభాషా పరిరక్షణ కార్యక్రమాన్ని యునెస్కో డైరెక్టర్ జనరల్ ప్రకటిస్తూ వస్తున్నారు. ప్రపంచంలోని ప్రతిభాషను రక్షించుకోవాలని, భాషా సాంస్కృతిక వైవిధ్య పరిరక్షణ జీవవైవిధ్య రక్షణ అని దీని తాత్పర్యం.

నిజానికి ఇది బంగ్లాదేశీయులు (నాటి తూర్పు పాకిస్తాన్) చేసిన భాష ఉద్యమానికి ప్రపంచ ప్రజల నివాళి. 1947లో భారతదేశ విభజన జరిగినప్పుడు పాకిస్తాన్ రెండు భౌగోళిక ప్రాంతాలుగా ఏర్పడింది. ఒకటి తూర్పు పాకిస్తాన్ (ఇప్పటి బాంగ్లాదేశ్) రెండవది పశ్చిమ పాకిస్తాన్ (ఇప్పటి పాకిస్తాన్). తూర్పు పాకిస్తాన్ పశ్చిమ పాకిస్తాన్ కలిపి మెజారిటీ ప్రజలు బెంగాలీ లేదా బంగ్లా భాషను ఎక్కువగా మాట్లాడేవారు. 1948లో నాటి పాకిస్తాన్ ప్రభుత్వం ఉర్దూను పాకిస్తాన్ జాతీయ భాషగా ప్రకటించింది. ఉర్దూతో పాటు బెంగాలీ కూడా జాతీయ భాషలలో ఒకటిగా ఉండాలని తూర్పు పాకిస్తాన్ డిమాండ్ చేసింది. ఈ ప్రతిపాదన తూర్పు పాకిస్తాన్‌కు చెందిన ధీరేంద్రనాథ్ దత్తా, 1948 ఫిబ్రవరి 23 నాడు పాకిస్తాన్ రాజ్యాంగ సభలో లేవనెత్తారు. అది క్రమంగా ఉద్యమ రూపం సంతరించుకుంది. 1952 ఫిబ్రవరి 21న ర్యాలీలో పాల్గొన్న వారిపై పోలీసులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో సలాం, బర్కాట్, రఫిక్, జబ్బర్, షఫీయుర్ మరణించారు. ఉద్యమం తీవ్రమైంది. పోలీసుల దాష్టికానికి నిరసనగా అదే రోజు ముస్లిం లీగ్ పార్లమెంటరీ పార్టీకి రాజీనామా చేసింది. చివరికి కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చింది. 1954 మే 8న పాకిస్తాన్ బెంగాలీని రాష్ట్రభాషల్లో ఒకటిగా స్వీకరించింది. 1971 బంగ్లాదేశ్ స్వతంత్ర రాజ్యంగా అవతరించాక బెంగాలీ ఏకైక రాష్ట్ర భాషగా ప్రకటించబడింది. బంగ్లా భాష ఉద్యమం, మానవ భాషా సాంస్కృతిక హక్కులను పురస్కరించుకొని, అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం అవతరించింది.

మాతృభాష పరిరక్షణకు భారతదేశం కూడా తగు చర్యలు తీసుకుంది. త్రిభాషా సూత్రాన్ని 1968లో ప్రవేశపెట్టింది. ఈ సూత్రం ప్రకారం భారతదేశంలో ఉన్న అన్ని రాష్ట్రాలు మూడు భాషలు ఉపయోగించాలి. హిందీలో మాట్లాడే రాష్ట్రాలలో హిందీ, ఆంగ్లం, మరియు ఆధునిక భారతీయ భాష అనగా ప్రధానంగా దక్షిణ భారతదేశ భాష. హిందీలో మాట్లాడిన రాష్ట్రాలలో హిందీ, ఆంగ్ల, మరియు ఏదైనా ప్రాంతీయ భాష ఉండాలని నిర్ణయించారు. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి అన్నాదురై ప్రయత్నం వల్ల ఈ త్రిభాషా సూత్రానికి కొన్ని అభ్యంతరాలు తలెత్తాయి.

ఇక తెలుగు భాషా విషయానికి వస్తే "ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్" అని ప్రశంసలు పొందిన భాష తెలుగును తొమ్మిది కోట్ల తెలుగు వాళ్ళు మాత్రమే కాకుండా ప్రపంచం నలుమూలల లక్షల మంది మాట్లాడతారు. భారతదేశ అతి ముఖ్యమైన భాషలుగా గుర్తించిన ఆరు భాషల్లో తెలుగు ఒకటి.

అచ్చులు సంపూర్ణంగా పలికే భాష ఇది. "దేశభాషలందు తెలుగు లెస్స" అనేది ప్రాచీన కవి వాక్యం. మహాకవులు, వాగ్గేయకారులు, ఆధునిక కవులు, తెలంగాణ కవులు, ఈ విధంగా అనేకమంది సృజనకారులు తెలుగును అజరామరం చేశారు. తెలంగాణ పదాలు అనేకం సాహిత్య ప్రయోగాలలో చేరి, ఈ భాషను మరింత సుసంపన్నం చేస్తున్నాయి.

మాతృభాష మరింత వికసించాలని, ఆ వికాసంలో జాతి పురోగమించాలని ఆకాంక్షిద్దాం.

జై తెలంగాణ! జై జాగృతి!!

కవిత కల్వకుంట్ల

కవిత



# మగ ఘుమఘుమలు



అన్నవరం దేవేందర్, 9440763479

వంటంటే ఒకానొక ప్రాణ జ్వలనం
సజీవంగా నిలిపి ఉంచే జీవ శాస్త్రం

రోజూ కొంత సేపైనా వంటింట్లో గడిపితేనే
కొంచెం కొంచెం పాకశాస్త్ర రుచీ పరిచయం

వంటశాల వనితల కార్యక్షేత్రమే కాదు
పురుషోత్తములు సైతం చెయ్యేస్తేనే ఘుమ ఘుమలు
వెంట ఉన్నా చాలు వంటకాలు వాటికవే సులువు

పొలంలో ఇరువాలు నాగలి దున్నినట్లే
కూర గిన్నెలో పోపు పెట్టి గంటె తిప్పడం

మునుం పట్టి వరుసగా వరినాట్లు వేసినట్లే
కూరగాయలు కోసి పొయ్యి మీద వేయడం

భూమిలోంచి ధాన్యం, పొయ్యి మీద అన్నం
రెండూ సమాన శ్రమ జీవన దృశ్యాలు

అన్నం తుకతుక ఉడుకుతుంటేనే వ్యాపించే ఆకలి
మసులుతున్న తేనీరు నుంచే మనసంతా చాయ

వంటింటి వస్తువులన్నీ బాసన్ల సరిగమలు
కడుపులోని ఆకలి కేకలే కుక్కర్ కూతలు
బువ్వ గిన్నె మీద ఎగిరే మూతకు కడుపు నింపే తపన
ప్రోటీనుల పోహలింపులకే ఈలపీట పదును
పోపుల పెట్టెనైతే సుగంధ ద్రవ్యాల ఔషధ శాల

వంట గదుల్లో గాజుల గలగలలే కాదు
మగధీరుల చెయ్యిలూ గిలగిల లాడాలి

ఆహారం ఉడుకుతున్నప్పుడే ఆకలి తీరిన అనుభూతి
ఇంటింటికీ వంటిల్లు కడుపు చూసే కన్నతల్లి

నాటి కథ

# కందిరీగలు

అరాచక వాదుల్ని ఎదిరించిన యుద్ధ వీరులు...



**బోయ జంగయ్య**

ఊరు మధ్య నుండి రోడ్డు, అందువల్ల అక్కడ బస్సు ఆగింది. ఓ నడి వయసు వ్యక్తి దిగగా, ఓ యువకుడు ఎక్కడం కోసం పరిగెడుతున్నాడు. కానీ అతను చేరేలోగా బస్సు కదిలింది.

ఎప్పుడో గాని వచ్చే ఈ చిన్న బస్సు తప్పినందుకు మనసు ఉసూరు మంది. 'అరేయ్ ఇటు రారా' అరుపులాంటి పిలుపుకు ఇద్దరూ వెనక్కి చూశారు. ఆ ఇద్దరిదీ ఆ ఊరు కాదు. అరేయ్ ఆ, మళ్లీ అలాంటి పిలుపే. మొదట పిలిచిన అతనే.

బస్సు దిగిన వ్యక్తి ఆ ఊరి గురించి పట్టణంలోనే విన్నాడు. గుండ్రాంపల్లిలో రజాకార్లు జనాలని నానా బాధలు పెడుతున్నారని, అతను విన్నట్టే రోడ్డు పక్క రజాకార్లు, వాళ్ళ చేతుల్లో తుపాకులు, కనబడితే కాల్చేస్తారట. అని గుర్తుకు రాగానే కడుపులో భయం, కళ్ళలో బెరుకు, ఇక పరుగే పరుగు. "అబ్బే బాగ్తా హై" అంటూ తుపాకిని గురి పెట్టాడు. తుపాకీ పేలింది. "అమ్మా" ఆర్తనాదం.

అది చూసిన యువకుడు నిర్ఘాంత పోయి, పరుగెత్తితే తనకు అదేగతి పడుతుందేమోనని కదలకుండా నిలుచున్నాడు. ఎదురుగా రక్తపుమడుగులో గిలగిలా కొట్టుకుంటున్న మనిషి, అతని చేతిలోని చేతి సంచి పక్కకు పడిపోయి అందులో నుండి అరటి పండ్లు, జిలేబి పొట్లం, చిన్నపిల్లల కొత్త బట్టలు బయటకి చిందరవందరలుగా దొర్లినాయి. చుట్టు పక్కల ఉన్న ఏ ఊరు వెళ్లడానికి దిగాడో? ఈయన రాక కోసం భార్యా పిల్లలు ఎంత ఎదురు చూస్తున్నారో!

తుపాకీ చప్పుడుకు చుట్టుపట్ల ఇళ్ల తలుపులు మూసుకున్నాయి. అరే, ఆ... మళ్లీ తుపాకీ వాని పిలుపు. మరికొందరు తుపాకులు ధరించి అక్కడ కందిరీగల్లాగా కదులుతూనే ఉన్నారు. యువకుడు చదువుకున్నవాడు, చంకలో సంచి, చేతులు జోడించి అతని వైపు చూస్తూ వెళ్లి ఎదురుగా నిలుచున్నాడే కానీ భయం వల్ల వెన్నులో ఏదో తన్నినట్టుగా ఉంది.

"ఎవర్రా నీవు" గుడ్లగూబ చూపు.

భయంతో నోరు పెగలలేదు.

"ఏ ఊరు?" ఎడమచేతి చూపుడు వేలును తుపాకి గొట్టంలా కదిలిస్తూ అడిగాడు.

"మల్లారెడ్డి గూడెం" ఊపిరి బిగబట్టి చెప్పాడు.

"చీకటోనివా కాంగ్రెస్ వోనివా?" చూపులో కసి, మాటలో వెటకారం.

రెండూ కాదనట్టు తల అడ్డంగా ఊపాడు.

"మీటింగుకు పోతున్నావు రా" ఆరా తీసినట్టు అడిగాడు. లేదు అన్నట్టు తల అడ్డంగా ఆడించాడు.

"ఆ తైలిలో ఏమున్నది?"

"బట్టలు కాగితాలు" బిక్కు బిక్కు మంటూ చూస్తూ అన్నాడు.

"అంటే నీవు కవివారా?" తలను కింది నుంచి పైకి ఊపుతూ అన్నాడు.

"కాదు టీచర్ను" అన్నాడు వినయపు చూపులతో.

"హ్వా.. హ్వా.. టీచర్ వా" అని తుపాకీ నీ తన ఎదురుగా నిలబెట్టుకొని దాని మీద రెండు చేతులు ఉంచి నవ్వాడు. అతని ఎద మీద బుల్లెట్ల రౌండ్ ఉన్న బెల్టు, కళ్ళ మీదికి వస్తున్న వెంట్రుకలు, చెయ్యెత్తు నిండైన విగ్రహం, పేరు సయ్యద్ మక్బూల్. గ్రామీణుల నాలికపై ఆ పేరు సయ్యద్ మొగులుగా మారింది. 40 పైనే ఉన్న చుట్టుపట్టు జనాలను నీళ్ల తాగనివ్వడం లేదు. నిద్దుర పోనివ్వడం లేదు. పగలు ముదురు ఎండ, రాత్రి ఈదురుగాలి లాంటి మక్బూల్‌కు సర్కారు అండదండలు, పోలీసుల తాన తందాన, చీమలు పెట్టిన పుట్టలో పాములు చేరినట్లు సాధుజనుల సరాయిలో మగ్బూల్ మకాం. చుట్టూరా ఉన్న గ్రామాల దళితులు వంతుల వారీగా వచ్చి చాకిరి చేస్తూ ఉంటారు. చుట్టమై ఈ ఊరొచ్చి దయ్యమై కూర్చుండు.

"నీకు ఉర్దూ వస్తది రా "కను బొమ్మలను ముడి వేస్తూ అడిగాడు.

"ఏదో కొద్ది కొద్దిగా" అన్నాడు నీళ్లను నములుతూ.

నాటి కథ

"నీకే కొద్దికొద్దిగా వస్తే పిల్లలకు ఏం చెప్తావ్" ఎగతాళిగా చూస్తూ.

"తెలుగు" కొంచెం నిబ్బరంగా అన్నాడు.

"అబే తెలంగి, భేడంగి, నీ తీరంగి ఎవరికి కావాలి?" అంటూ సంచిలో చేయి పెట్టి కాగితాలను లాక్కున్నాడు. అప్పుడు చేతిలోని సంచి జారి కిందపడగా అందులో నుంచి సజ్జ రొట్టెల మడత పక్కకు పడ్డది. వాటిని అందుకోవడానికి వంగిన యువకుని వెన్ను మీద పడ్డ తుపాకీ మడమ దెబ్బకు అట్లనే భూమి మీద బోర్లా పడిపోయాడు.

"లే, భే.. లే ఈ ఫర్మాణ నిజాం సర్కారుదే" అవును అన్నట్టు తలాడిస్తూ సంచిని సర్దుకుంటూ లేచాడు.

"మాదేమో హుకుమత్, మీకేమో నౌకర్లు" కను బొమ్మలు ఎగరేస్తూ అన్నాడు. బిత్తర పోయి చూస్తున్నాడు టీచర్.

"తనఖా నిజాం సర్కార్ ది, చెప్పేది తెలంగి" పెదాలని బిగబట్టి వదులుతూ అన్నాడు.

"ఇక ఊరికి పో" ఎడమ చేతితో సైగ చేశాడు.

"నా ఆర్డర్ కాగితం"

"రైనేదేరే".

"ఈరోజు జాయిన్ కాకపోతే నౌకరిపోతది" ఆతురత....

"పోనీ నీ బదులు ఇంకొకరు చేస్తరు" నింపాదిగా.

"అట్ల వీలుండదు. ఎవరికి ఉద్యోగం వస్తే వాళ్లే..." అనే లోపే...

"గదంతా మేము చూసుకుంటాం పో" తానే నిజామ్ తరపు అధికారిలా అన్నాడు.

"మేం పేదోళ్లం, పదేళ్లు చదివితే ఈ నౌకరి వచ్చింది. నా కాగితం నాకు ఇచ్చేయండి" భయం భయంగా అన్నాడు.

"ఇయ్యకుంటే" కళ్ళను ఒకసారి మూసి తెరుస్తూ అన్నాడు.

"నీ కాళ్ల పట్టుకుంటా ఇచ్చేయండి" అంటూ కాళ్ళ మీద పడ్డాడు నహీ అంటూ కారణం లేకుండా తన్నాడు కందిరీగ కాటేసినట్టు.

కందిరీగ మనిషిని ఎందుకు కాటేస్తుందో ఇంతవరకు తెలియదు.



## కాపలాదారులు

**నాలుగువైపులా పరిగెత్తారు. వాళ్లతో పాటు అక్కడున్న మిగతా వాళ్ళు పరిగెత్తారు. గాలికి కందిలీలు ఆరిపోతుంటే మళ్ళీ మళ్ళీ వెలిగించుకుంటున్నారు. కందిళ్ల వెలుగులో కందిళ్లు పట్టుకున్న వాళ్లు కనిపించినట్టు, అరుగెత్తే వాళ్లు కనిపించరు. ఊరంతా వెతికారు. ఊరి బయట చూశారు. అందరూ తిరిగి వచ్చి తిట్లను భరిస్తూ నిలబడ్డారు.**

చేతులు జోడించి... "నా కాగితం నాకు ఇచ్చేయండి" అంటూ బతిమాలాడు.

"ఫుట్ సాలె" అంటూ కాగితాన్ని మడచి పెట్టుకున్నాడు. ఆత్రుతగా దోసిలి పట్టి నిలుచున్నాడు టీచర్.

"పో...బే" అంటూ కాగితాన్ని తిరిగి ఇచ్చేశాడు యువకుడు కొంత దూరం వెనక్కు వెనక్కు నడిచి ఆ తర్వాత రోడ్డు వైపు మళ్ళీ చావు తప్పినందుకు సంకలోని సంచి నీ చేతిలోనికి మార్పు చేసుకుని భయాన్ని వదులుతూ ఓ నిట్టూర్పు విడిచాడు.

ధన్ మన్న శబ్దం. వీపులోంచి దూసుకొచ్చిన తూటా కడుపులో నుంచి బయటకు వెళ్ళిపోయింది. రెప్పపాటుతూ తన రక్తంతో తానే తడిసినట్టు గ్రహించి నేల మీద వంగుతూ సంచిని కడుపుకు అదిమి పట్టుకున్నాడు మరోసారి తుపాకీ పేలింది. "అమ్మా" అంటూ నేలకొరిగాడు. చిన్నగా ఉన్నప్పుడే భర్త పోగా కొడుకుని పెంచి పెద్ద చేస్తే ఈరోజు నలుగురికి పాఠాలు చెప్పే బడిపంతులు అయ్యాడు. కష్టం ఫలించిందని కంటనీటితో తెల్లవారు జామున సాగనంపిన తల్లికి 'అమ్మా' అన్న ఆఖరి పిలుపు వినబడుతుందా?

★ ★ ★

పట్టపగలు రోడ్డు నుండి ఊళ్లోకి వచ్చే బండ్ల బాటన ఓ లారీ పరిగెత్తు కొచ్చింది. లారీ నిండా రజాకార్లు మిడతల

నాటి కథ

గుంపు పంట చేను మీద వాలి నట్టు ఊరు మీద పడ్డారు. ఊరు ఉలిక్కిపడి అతలా కుతలం అయింది. కుక్కల అరుపులు.. పందుల పరుగులు.... ఎందుకో పందులను చూడగానే తుపాకులను పేల్చగా, ఎక్కడిది అక్కడే ప్రాణాలు వదులుతుంటే, చూసిన కుక్కలు బెదిరి వెనక్కు పరిగెత్తి సందుల్లో గొందుల్లో నక్కినై.

"హూ... మారో" మక్బూల్ అరుపు. అది విని ఇల్లు వదిలి చంకన చంటి పిల్లలతో ఆడపిల్లలను ఈడ్చుకుంటూ ఆడవాళ్లు పరిగెత్తుతుంటే, వెనకాల మగవాళ్ళు, స్త్రీల నగలు గుంజుకోగా చెవులు తెగి కొందరు, చేతులు తెగి కొందరు.. ఏడుపులు పెడబొబ్బలు, చివరికి పుస్తెలను కూడా వదలలేదు.

ఈ బీభత్సాన్ని చూసిన జనం చెట్టుకొకడు, పుట్టకొకడు పారిపోతున్నాడే తప్ప ఎవరు ఎదురు తిరగడం లేదు. పొగ పెడితే తేనె తీగలు తెట్టెను వదిలి పోయినట్టు తుపాకులు పేలుతుంటే జనం ఊరు వదిలి పారిపోయారు.

"బాగయే సాలె, షురూ గరోంకో లూటో" తలుపులు ఇరగ తన్నుతే గొళ్ళాలు ఊడిపోయాయి. పెట్టెలను బయటకు పడేశారు. బట్టలను పారవేశారు. పప్పు ధాన్యాన్ని దంపుడు బియ్యాన్ని మూటలు కట్టి లారీలో వేసుకున్నారు. పారిపోలేని ముసలి వాళ్లను బాటిమ్మటి మేస్తున్న పశువులు బెదిరి చూస్తున్నాయి. ఆవులు, వెనక తోకలను లేపుకొని అరుస్తూ పరిగెత్తుతున్న దూడలు.

మక్బూల్ దృష్టి వాటి మీద పడగానే లారీనియాపి బలిసిన లేగ దూడను అందుకొని లారీలో వేసుకున్నాడు. అటు ఇటు తారాడుతూ అంబా అని అరుస్తూ ఆవులు. ఊళ్లో ఇంకా మంటలు లేస్తూనే ఉన్నాయి. ఆర్పుకోవలసిన వారంతా అడవిపాలు అయినారు.

★ ★ ★

మధ్య రాత్రి చిమ్మ చీకటి, అందరూ ఆదమరచి నిద్రిస్తున్న వేళ ఒక్కసారి తుపాకీ పేలింది.

"అమ్మా" అంటూ ఓ స్త్రీ అరుపు. పక్కమ్మటే పడుకున్న మనిషి కిందికి దొరిలాడు. కాపలా వాళ్ళు తుపాకుల ట్రిగ్గర్లపై వ్రేళ్ళుంచి లేచి నిలుచున్నారు. పడుకున్న వాళ్లు లేచి కందిలీల బత్తీలను పెంచారు. వెనుక ఏదో పడిపోయిన శబ్దం.. ఆ తరువాత మనుషులు పరిగెత్తుతున్న అలికిడి. మంచం మీద స్త్రీ రెండుసార్లు మాత్రమే మూలిగింది. అది గమనించిన మంచం కింది మనిషి లేచి బయటకి పరిగెత్తుకొచ్చి "భాగో.. భాగో..." ఆందోళనతో కూడిన అరుపు. ప్రహరీ గేటు తెరుచుకుంది.

"చోడ్నా నహీ పకుడో" అని అరుపు లాంటి శబ్దం.

కాపలాదారులు నాలుగువైపులా పరిగెత్తారు. వాళ్లతో పాటు అక్కడున్న మిగతా వాళ్ళు పరిగెత్తారు. గాలికి కందిలీలు ఆరిపోతుంటే మళ్ళీ మళ్ళీ వెలిగించుకుంటున్నారు. కందిళ్ల వెలుగులో కందిళ్లు పట్టుకున్న వాళ్లు కనిపించినట్టు, పరుగెత్తే వాళ్లు కనిపించరు. ఊరంతా వెతికారు. ఊరి బయట చూశారు. అందరూ తిరిగి వచ్చి తిట్లను భరిస్తూ నిలబడ్డారు.

పొద్దున్నే చుట్టూ ఉన్న ఊర్ల మీద పడి అనుమానము వచ్చిన ప్రతివాన్ని పట్టుక రమ్మన్నారు. పోలీసులు రజాకార్లు కలిసి మధ్యాహ్నం వరకు 30 మందిని ఈడ్చుకొచ్చారు. రోడ్డుపక్కమ్మటే పెద్ద బావి దగ్గర అందరిని వరుసగా నిలబెట్టారు. తన భార్యను పొట్టన పెట్టుకున్న వారెవరో చెప్పమన్నాడు. తన మీద ఈ హత్యా ప్రయత్నం ఎవరు తల పెట్టారో చెప్పమన్నాడు. తమకు ఏం తెలియదు అన్నట్టు చూస్తూ నిలుచున్నారు.

**వీపులోంచి**

**దూసుకొచ్చిన తూటా కడుపులో నుంచి బయటకు వెళ్ళి పోయింది. రెప్పపాటులో తన రక్తం తానే తడిమినట్టు గ్రహించి నేల మీద వంగుతూ సంచిని కడుపుకు అదిమి పట్టుకున్నాడు మరోసారి తుపాకీ పేలింది. "అమ్మా" అంటూ నేలకొరిగాడు. చిన్నగా ఉన్నప్పుడే భర్త పోగా కొడుకుని పెంచి పెద్ద చేస్తే ఈరోజు నలుగురికి పాఠాలు చెప్పే బడిపంతులు అయ్యాడు.**

"చెప్పకుంటే చావు తప్పదు" గద్దించాడు.

ఎవరు నోరు విప్పలేదు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఏ తుపాకీ ఎప్పుడు పేలుతుందో అని మధ్య మధ్యన వాటి వైపే చూస్తున్నారు. వాళ్లంతా కాయకష్టం చేసుకుని బ్రతికే కూలీ నాలి జనం. "బోల్ సాలె బోల్" వాళ్ల వంక గుడ్లురిమి చూశాడు. పళ్లు పటపట కొరికాడు. అసలు సంగతే తెలియని అమాయకులు. అడిగేది అర్థంగాక చెప్పేందుకు జవాబు లేక ప్రాణాల్ని బిగబట్టుకుని చూస్తూ ఉన్నారు. అందరి గొంతులో తడారిపోయింది.

"నహీ బోల్తా"

"చెప్పండి రా లేకపోతే కుక్క చావు చస్తారు" అన్నాడు పోలీస్ ఆఫీసర్ రెడ్డి.

"ఈ సబ్ ఖాతిల్ హై" అంటూ అరిచాడు.

"అంతే" అని ఆమోదముద్ర వేశాడు తాలూకుదారు రావు గారు.

"జలావో సబుకో" గన్ నిప్పులు కక్కింది.

"అమ్మా, అయ్యా" అన్న ఆర్తనాదాలే దిక్కులు పెక్కటిల్లే అరుపులు! తెరచి ఉన్న కళ్లు చూస్తున్నట్టుగా ఉండి శరీరాలు నెత్తురు చిమ్మగా అక్కడంతా రక్తపు మడగయ్యింది. వరుసగా ఒక్కొక్కరు బావి బొందలో వెల్లకిలా పడిపోగా, కొందరు పక్కన పడి కాళ్లు చేతులు కొట్టుకుంటూ మూలుగుతూ ఉంటే రజాకార్లు వెళ్లి బావిలోకి పడతన్ను తున్నారు. బావిలో తుది శ్వాస చప్పుడు ఎవరు వింటారు? ఆ తరువాత కట్టెలను కాలిబండ్లను పడవేసి నిప్పు పెట్టారు.

ఊరు ఊరంతా శ్మశానవాటిక!

దశ దిశలా మనిషి కాలుతున్న

నాటి కథ

కమురువాసన!

మైళ్ళకొలది విషాదపు పొగలు, కన్నీటి కాలువలు!!

★ ★ ★

తెల్ల తెల్లవారంగ...... కాలు కొద్ది పరుగెత్తిన దళం ఓ గుట్టకు చేరారు. వాడి బతికిపోయిండు మనలను వదలడని అంగలార్చుతున్నప్పుడు....

రాత్రి జరిగిన సంఘటన కళ్ళ ముందుకు వచ్చింది.

ఇద్దరూ రెండు నిచ్చెనలను ప్రహరీ గోడకుంచి కదలకుండా పట్టుకున్నారు. మరో ఇద్దరూ నిచ్చెన పైమెట్టుకు తాడు కట్టి ఆపద వస్తే మనిషితో ఉన్న నిచ్చెనను వెనక్కు గుంజడానికి నిలుచున్నారు. నిచ్చెనలను ఎక్కి నిలుచున్న వ్యక్తులకు తూటాలను నింపిన తుపాకు లను అందివ్వడానికి మరో ఇద్దరు నిలుచు న్నారు. కాపలా వాళ్లను కనిపెడుతూ మరో ఇద్దరూ. అందరూ కలిసి పదిమంది. అదే గుండ్రాంపల్లికి చెందిన బక్కయ్య వాళ్లలో ఒకడు. ఏం చేయాలో ఎలా చేయాలో ఎవరెవరు ఏ పని చేయాలో ముందు అనుకున్నట్టుగా పలివెల గ్రామవాసి గురునాథరెడ్డి నాయకత్వంలో చాలా కట్టుదిట్టంగానే అమలుపరిచారు. అయినా గురి తప్పింది. పొద్దుగూకే వరకు గుట్టమీద ఉండి చుట్టూ కనిపెడుతూ కూర్చున్నారు. ఆకలి దూపను ఆపుకున్నారు. పొద్దు బారెడు ఉంది. చీకటి పడక ముందే ఏదన్నా ఊరు చేరాలని గుట్టను దిగి గుండ్ల చాటున నిలుచున్నారు.

ఎక్కడి నుండో సన్నగా ఒక పాట, అటువైపు చెవులు రిక్కించి వింటున్నారు.. అడవి నుంచి ఊళ్లోకి వెళుతున్న పశు వులు, వాటిని కాసే పిల్లగాళ్ళు, ఒకడు దున్నపోతు మీద కూర్చొని, గొంతెత్తి పాట పాడుతూ, దానికనుగుణంగా తాను తినే రాతెండి గిన్నెపై దరువేస్తున్నాడు. దగ్గరవుతున్న కొద్ది పాటలోని పదాలు వినబడుతున్నాయి

"బండెనక బండి గట్టీ
పదహారు బండ్లు గట్టి
ఏ బండ్లె వస్తవు కొడుకో నైజాము
సర్కరోడా"

ఆ పాట పాడితే పట్టుకుపోతారు అన్న విషయం ఆ పాడే బాలునికి తెలియదు. అది నిషేధింపబడిన పాట అయినా ఆ పాట తెలంగాణ గాలి తరంగాలలో ప్రతిధ్వనిస్తూ, వాగుల్లో వరదల్లో పారుతుంది. ఈ పాటే జనం చేత తుపాకులను పట్టించింది. ఈ పాటే నడికట్టున ఉన్న కొడవళ్లను, పిడికిలిలోకి తెచ్చింది. పూర్తి పాట విని ఆ పాట అల్లిన "యాదగిరి" గుర్తుకు రాగానే తమ కర్తవ్యం గుర్తుకొచ్చింది. అందరూ అక్కడ నుండి కదలుతూ కనుసైగలు చేసుకుని ఒకరు వెళ్లిన వైపు మరొకరు వెళ్లకుండా తలోవైపు ఎవరికి అనుమానం రాకుండా సహజ రీతుల్లో మౌనంగా నడిచారు.

ఆ తరువాత ఊరూరా నిప్పు రాజుకుంది! ఆయుధాలు పదునెక్కు తున్నాయి! తెలంగాణ అంతటా పోరాటం ముమ్మరమైంది. ఎవరి చేతిలో చూసినా ఏదో ఒక ఆయుధమే.

"దెబ్బకు దెబ్బ!"

రాజుకుంటున్న పొగకు ఊపిరాడక కందిరీగల తెట్టె కదిలిపోయింది.

కవిత

# వీడని వేర్లు



జాధవ్ అంబదాస్, 94902 31380

సాహసించలేను
ఉప్పెనలై దూసుకొచ్చే
ఆ ప్రవాహాన్ని
చూడటానికి...
సాహసించలేను
పూర్తిగా నిండి ఉప్పొంగే
ఆ బావుల్లోకి
కళ్ళను కలపడానికి...
అయినా ఎందుకో?
ఉండలేను

ఏదో కుతూహలం
మళ్ళెప్పుడు చూస్తానో?
ఆ ప్రేమమూర్తిని
చూసిన మరుక్షణంలోనే
సగం కన్నీళ్ళను పంచుతుంది
ఆ త్యాగమూర్తి!
ఆమె పంచకుండా
నేను స్వీకరించకుండా
ఎలా ఉండగలం?
ఎంతైనా పేగుబంధం కదా!

వ్యాసం

# సూత్రీకరణలు చేసే సునిశిత విమర్శకుడు

**విమర్శలో ప్రామాణికత వివరించిన వ్యాసం....**



సాగర్ల సత్తయ్య
79891 17415

ఒక కవిత గాని కథ గాని నవల గాని చదివినప్పుడు పాఠకుడు రసానుభూతికి లోనవుతాడు. పాఠకులు ఇంతవరకే పరిమితమవుతారు కానీ విమర్శకుడు ఒక లోచూపును కలిగి ఆ రచనలో రచయిత దృక్పథం ఏమిటో, ఆ రచన పూర్వాపరాలేమిటో, రచనలోని విశిష్ట గుణాలు ఏమిటో చూడడానికి ప్రయత్నిస్తాడు. ఈ కోణంలో ఆ రచనను సూక్ష్మ పరిశీలన చేసి తాను కనుగొన్న అంశాలను విమర్శగా ప్రకటిస్తాడు. ఇటువంటి విమర్శ ఆ రచనలోని ఉచితా నుచితాలను పాఠకుల ముందుంచి రచన పట్ల పాఠకులు ఒక అభిప్రాయాన్ని ఏర్పాటు చేసుకోవడానికి దారిదీపంలా దోహదకారి అవుతుంది. అంటే పాఠకుడికి సాహిత్య అధ్యయనంలో దీపస్తంభంలా నిలిచేవాడే విమర్శకుడు. అటువంటి నికార్సైన విమర్శకుడు రాపోలు సీతారామరాజు. దక్షిణాఫ్రికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తుండడం సీతారామ రాజును తెలుగు సాహిత్యానికి దూరం చేయలేకపోయింది. పైగా మరింత శ్రద్ధతో అధ్యయనం చేయడం ద్వారా అటు కవిగా ఇటు విమర్శకుడిగా అనతి కాలంలోనే తెలుగు సాహిత్యంలో తనదైన ముద్రవేస్తున్నాడు. విమర్శకుడిగా సీతారామరాజు ప్రస్థానాన్ని పట్టి చూపే గ్రంథం 'పరావర్తనం'.




సృజనను విశ్లేషించడం మాత్రమే విమర్శ కాదు. ఆ సృజన పట్ల విమర్శకారుడి ప్రత్యేకమైన సూత్రీకరణలు ఉన్నప్పుడే అది విమర్శ అనిపించు కుంటుంది. సీతారామరాజు ఏ అంశంపై రాసినా ఆ విమర్శలో తనదైన ముద్ర ఉంటుంది. ఆచార్య ఎన్. గోపి వృద్ధో పనిషత్ గురించి రాస్తూ "ఒంటరితనానికి లోనయ్యే వృద్ధులకు అక్షర చేయూతనిచ్చే కవితా ఊతమే 'వృద్ధోపనిషత్' అని, ఇది గోపి గారి కవిత్వ ప్రయాణంలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని" స్పష్టం చేశారు. తీగల చింత కవి యాకూబ్ గురించి రాస్తూ "అస్తిత్వ సంక్షోభం అభద్రత సామాజిక సంక్లిష్టతలను కవిత్వీకరించే ఒక సంవేదనాభరితుడైన కవి" అంటూ ఆయనను నిర్వచించారు. తీగల చింత కవిత్వాన్ని ప్రస్తావిస్తూ "ఈ తీగలచింత లోపల ప్రపంచాల కలబారిన తీగ. ఆధిపత్యాలు, అన్యాయాలు, మతవివక్షలు ఇలా సమస్త జాడ్యపు కొమ్మలను ఒక్కొక్కటిగా నరికాక కొత్తచిగుళ్ళేస్తున్న చెట్టులాంటి మనిషికి అల్లుకుంటున్న తీగ. శతాబ్దాలుగా ఆత్మగౌరవం కోసం తపిస్తున్న మనిషి లోతుల్లోకి సునాయసంగా ప్రవేశించి మనిషిలో కలిసిపోయిన తీగ. అక్షరాలలో అక్షరాలుగా కలగలిసి అల్లుకున్న చోటల్లా కవిత్వమైన తీగ. ఈ తీగ కవిత్వాన్ని పూలుగా పూస్తుంది. మానవత్వాన్ని పరిమళింప చేస్తుంది" అని తనదైన శైలిలో కవితాత్మకంగా సూత్రీకరణ చేస్తాడు. 'నీడల దృశ్యం' కవిత్వాన్ని పరామర్శిస్తూ కవిగా ఏనుగు నరసింహారెడ్డి గురించి తనదైన ప్రత్యేక అభిప్రాయాలను వ్యక్తం చేశాడు. "ప్రశ్నించే తత్వాన్ని అన్యాయాన్ని ఎత్తిచూపడానికి వెనుకాడనితనాన్ని నరసింహారెడ్డి కవిత్వంలో గమనించవచ్చు" అన్నాడు. నరసింహారెడ్డి స్వతహాగా ప్రయోగశీలి అని, అభివృద్ధి నవ్యతకు నిరంతరం తపిస్తుంటాడని పేర్కొన్నాడు. కవిత్వం పట్ల కవిత్వ నిర్మాణం పట్ల

నరసింహారెడ్డికి ప్రత్యేకమైన శ్రద్ధ లోచూపు ఉన్నాయన్నాడు. ఎక్కడా వస్తువు గురించి చెప్పే ఒక్క పదమైనా వాడకుండా మార్మికంగా ధ్వని పూర్వకంగా కవిత్వాన్ని చెప్పగల విద్యను నరసింహారెడ్డి ఒడిసి పట్టుకున్నాడన్నాడు. మనసుల్ని మెలిపెట్టగలిగే కవిత్వ హృదయమే నరసింహారెడ్డిది అని తేల్చి చెప్పాడు. కొమ్మవరపు విల్సన్ రావు రాసిన 'దేవుడు తప్పిపోయాడు' గురించి ప్రస్తావిస్తూ "మనిషికి మనిషికి మధ్య అల్లుకు పోవలసిన అనుబంధాల్ని మాటలుగా వల్లే వేస్తాడు. ప్రపంచీకరణ ప్రభావంతో పెరుగుతున్న ఆర్థిక అంతరాలు, ఆకలి బాధలు, సమాజంలో హెచ్చుతగ్గుల వల్ల కలిగే సంఘర్షణ ఇత్యాది విషయాలకు చలించి కవిత్వంతో విల్సన్ రావు సాంత్వన పొందుతున్నాడని" అభిప్రాయపడ్డాడు. కవిత్వం పట్ల తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా చెప్పే నైజం సీతారామరాజుది. బుర్రా లక్ష్మీనారాయణ 'ఇదీ వరస' కవిత్వాన్ని విశ్లేషిస్తూ ఈ కవిత్వంలో పునరుక్తులు చాలా ఎక్కువగా ఉన్నాయన్నాడు. శైలి శిల్పం భాష అంటూ ప్రణాళికలు వేసుకోని భావావేశంతో రాశాడన్నాడు. కొన్నిసార్లు భాష ప్రౌఢంగా గంభీర సంస్కృత సమాస భూయిష్టంగా మరికొన్నిసార్లు అలతి అలతి తేట తెలుగు పదాలతో సరళంగా సాగుతుం దన్నాడు. ఏదేమైనా లక్ష్మీనారాయణ మార్మికత తాత్వికత భావుకత ముప్పేట అల్లుకున్న కవిత్వ సృజన చేశాడని ప్రశంసించాడు. అలాగే గులాబీల మల్లారెడ్డి కవిత్వంలో కూడా కొన్ని పదాలను పదేపదే వాడకుండా ఉండి ఉంటే ఆ కవితలు మరింత బిగువుగా ఉండేవని అభిప్రాయపడ్డాడు.

తెలుగు సాహిత్యంలో కొత్తగా అడుగుపెడుతున్న యువకుల్లో కవిత్వం పట్ల వారికున్న దృక్పథాన్ని సీతారామరాజు చక్కగా అంచనా వేశాడు. "ఎక్కువమంది యువకులు జీవితాన్ని కవిత్వమయం చేయడానికో కవిత్వంలో జీవితాన్ని నింపడానికో ప్రయత్నిస్తున్న తీరు సంతోషాన్ని కలిగిస్తున్నది. కవిత్వాన్ని ఇంకో తరానికి భద్రంగా అందిస్తారన్న భరోసా కలుగుతున్నది. కేవలం వైయక్తికమైన ప్రేమనే కాకుండా కౌటుంబిక ప్రేమను దాటి సమాజం మీద ప్రేమను కురిపిస్తున్నారు. అయితే ఆచరణకు ఎంత దగ్గరవుతున్నారనే ప్రశ్న పక్కకు పెడితే ఆ రకమైన ఆలోచన వారిలో సంస్కార బీజాలు నాటుతుంది. కవ్వించే కవితలు కాదు కదిలించే కవిత్వం రాద్దామనుకుంటున్నారు. రాస్తున్నారు. ఇది అవసరమైన పరిణామం" (పరావర్తనం పుట 44) అంటూ భావి తెలుగు కవిత్వంపై ఆశావహ దృక్పథాన్ని ప్రకటించాడు. వర్ధమాన కవయిత్రి నాగజ్యోతిశేఖర్ రాసిన 'రెప్పవాల్చని స్వప్నం' కవిత్వాన్ని గురించి తెలియజేస్తూ ఏ వస్తువును తీసుకున్నా మానవ జీవన స్పర్శను ఆ వస్తువుకు అద్దడం, అందులో తన జీవితాన్ని చూసుకోవడం నాగజ్యోతి కవిత్వ లక్షణంగా సూత్రీకరించాడు.

కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత తగుళ్ల గోపాల్ కవిత్వం 'దండకడియం'. ఆ కవిత్వాన్ని విశ్లేషిస్తూ గోపాల్ కవిత్వ నేపథ్యాన్ని, కవిత్వ లక్షణాలను స్పష్టంగా ఆవిష్కరించాడు సీతారామరాజు. "గోపాల్ కవిత్వాన్ని చదువుతుంటే జీవిత చిత్రాలని సజీవంగా ప్రతిఫలింపజేసే, సమాజ స్పందనలను అంతే సహజంగా ఆవిష్కరించే ఒక సహజ కవిలా అనిపిస్తున్నాడు" అంటాడు. తెలంగాణలోని విలక్షణమైన మట్టి వాసన, కష్టాల చరిత్ర, సాంస్కృతిక వారసత్వం గోపాల్ కవిత్వానికి మూలధాతువులని విస్పష్టంగా చెప్పాడు. గోపాల్ కవిత్వం నిండా మానవీయ స్పర్శ ఉందన్నాడు. అనుభవాలను అక్షరాలుగా మలిచే విద్య ఉందన్నాడు. మానవ సంబంధాల సున్నితత్వం దుఃఖానికి సంబంధించిన గాఢమైన వ్యక్తీకరణ గోపాల్ కవిత్వంలో అడుగడుగునా కనిపిస్తుందన్నాడు. ఆర్ద్రత అనుభవాల అక్షరాకృతి గోపాల్ కవిత్వం అని నిర్వచిస్తాడు. ఇవన్నీ రాపోలు సీతారామరాజు విమర్శాదృక్పథాన్ని ప్రకటిస్తాయి. పద్మావతి రాంభక్త కవితల్లో అడుగడుగునా వ్యక్తిత్వ వికాసం తొణికిసలాడుతుందని సోదాహరణంగా నిరూపించాడు. బాధామయ నిస్తేజ హృదయానికి సాంత్వనకూర్చే కవిత్వమని పద్మావతి రాంభక్త 'కొత్త వేకువ' కవిత్వాన్ని ప్రశంసించాడు. కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత మెర్సీ మార్గరెట్ 'కాలం వాలిపోతున్న' వైపు కవిత్వాన్ని సమీక్షిస్తూ కవిత్వం మీద, తన కవిత్వం మీద, స్పష్టమైన అవగాహన, దృక్పథం, ఉన్న కవయిత్రి మెర్సీ అని తీర్మానించాడు. మెర్సీ కవిత్వ తత్వాన్ని విశ్లేషిస్తూ ఆమె కవిత్వం తీయని బంధాల్ని గానం చేసిందన్నాడు. కష్టజీవుల చెమట చుక్కల్ని ఒడిసి పట్టిన కవిత్వంగా అభివర్ణించాడు. మానవత్వాన్ని కాంక్షించిన కవిత్వంగా, సమ సమాజాన్ని కోరుకునే కవిత్వంగా విపులీకరించాడు.

అరుణ నారదభట్ల కవిత్వ నిర్మాణ శైలిలో భేదాలను పట్టి చూపాడు సీతారామ రాజు. కథనాత్మక, నైరూప్య శైలి భేదాలతో రాసిన అరుణ నారదభట్ల కవిత్వాన్ని ఉదాహరణలతో చూపించాడు. వీరి కవిత్వంలోని నూతన అభివ్యక్తి, జీవన వాస్తవికత, చరిత్ర పట్ల అవగాహన, ఆశావహ దృక్పథాన్ని ఎత్తిచూపాడు. మైనారిటీ స్త్రీల అస్తిత్వవాద కవిత్వంగా నస్రీన్ ఖాన్ రాసిన 'జఖ్మి' అని రూఢీ చేశాడు. స్థానికత, తాత్వికత అనే రెండు పార్శ్వాలు నస్రీన్ ఖాన్ కవిత్వంలో ఉన్నాయంటాడు. కేవలం వస్తు వైవిధ్యంతో మాత్రమే కవిని కవిత్వాన్ని అంచనా

**ఆచార్య ఎన్. గోపి వృద్ధోపనిషత్ గురించి రాస్తూ "ఒంటరితనానికి లోనయ్యే వృద్ధులకు అక్షర చేయూతనిచ్చే కవితా ఊతమే 'వృద్ధోపనిషత్' అని, ఇది గోపి గారి కవిత్వ ప్రయాణంలో ఒక మైలురాయిగా నిలిచి పోతుందని" స్పష్టం చేశారు.**

వేయలేమంటాడు. భావుకత కవికి ప్రథమ లక్షణం కావాలంటాడు. "అనుభవాల అనుభూతుల అందమైన అక్షరీకరణే కవిత్వం" (పరావర్తనం పుట 83) అని కవిత్వాన్ని నిర్వచించాడు సీతారామరాజు.

"కవిత్వాన్ని చదువుతుంటే పాఠకుడికి ఆ పరిమళాల ఆస్వాదన మాత్రమే కాకుండా ఆ కవి భావుకత, ఊహాశాలిత, భాషా సౌందర్యం స్ఫురణకి రావాలి. కవి వెనుక ఉన్న భావాలు అనుభూతులు మనసుని తాకాలి. అప్పుడే అసలైన రసాస్వాదన పొందగలుగుతాడు పాఠకుడు. అంతటి ఆర్ద్రతను సాంద్రతను కవి అక్షరాల్లోకి ఎలా అనువదించగలిగాడా అన్న ఆలోచన కూడా చేసినప్పుడు కవిత్వం అందమైన అనుభవం అవుతుంది. ఆ అనుభవం పాఠకుడిని కట్టిపడేసి అతనిలోని భావుకున్ని కూడా నిద్ర లేపుతుంది. కవిత్వ శక్తి అలాంటిది" మెట్టా నాగేశ్వరరావు కవిత్వాన్ని అంచనావేసే క్రమంలో సీతారామరాజు కవిత్వంపై వ్యక్తపరిచిన అభిప్రాయాలు ఇవి. భావి విమర్శకులకు పరిశోధకులకు ఉటంకించదగిన వాక్యాలుగా నిలుస్తాయి. ఒకే వస్తువుపై ఎక్కువ కవితలు ఉన్నప్పుడు కవిత్వం కొంత వాచ్యంగా మారినప్పుడు నిర్మొహమాటంగా చెప్పగల విమర్శకుడు సీతారామరాజు. మానవీయ స్పృహ నైతిక భావనలు, విప్లవ దళిత ప్రాంతీయ భావనల సైదాంతిక భూమికపై కవిత్వం రాసిన దామెర రాములు దృక్పథాన్ని చక్కగా ఆవిష్కరించాడు. అభ్యుదయ దృక్పథంతో ఆర్ద్రత, మానవీయత, ప్రాదేశికత, తాత్వికత సౌందర్యారాధన తదితర లక్షణాలను మేళవించుకున్న వెన్నెల సత్యం 'బతుకు చెట్టు'ను గొప్పగా విశ్లేషించాడు. వెన్నెల సత్యంకు వృత్తుల పట్ల ఉన్న గౌరవం, అమ్మా, నాన్న మొదలైన మానవీయ బంధాలపై ఉన్న మమకారం సమాజంలోని అపసవ్యాలపై కవి తిరుగుబాటు తత్వం ' కవితాకాశంలో వెన్నెల సంతకం' వ్యాసంలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. తెలుగు సాహిత్యంపై యువ కవిత్వ సంతకం నందకిషోర్ ను ఒక విలక్షణ స్వరంగా నిరూపించాడు. నిగూఢమైన భావన, తెలంగాణ నుడికారపు సొగసు, మానసిక వివేచనా వికాసం జీవన తాత్వికత, నిశిత పరిశీలనా దృష్టి, మొదలైనవి ఉప్పల పద్మ కవిత్వ లక్షణాలుగా నిర్ధారిస్తూ అభ్యాసం వల్ల చిక్కదనం పెరిగి కవిత్వం సాంద్రతమవుతుందని చక్కని సూచనలు చేశాడు. తాత్విక మార్మిక భావనలను కవిత్వం చేసే లింగా గౌతమ్ 'అనర్ఘ్య'ను విపులంగా విశ్లేషించాడు. డాక్టర్ ఎస్ రఘు విమర్శ'సమన్వయ' పై అధి విమర్శ చేశాడు సీతారామరాజు. రఘు పరిశోధన పరిశీలనా శక్తిని చక్కగా అంచనా వేశాడు. సాగర్ల సత్తయ్య కుందెన వ్యాసాలపై తనదైన శైలిలో వ్యాఖ్యానం చేశారు. ప్రాదేశిక జ్ఞానం ప్రాంతీయ అభిమానం నిండుగా కలిగి ఉన్నప్పుడే మనసు మెల్లమెల్లగా ప్రపంచం వైపు మళ్లుతుందని, ప్రాంతీయ అభిమానంతో పాటు కవి సామాజిక నేపథ్యాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయడం ద్వారా విమర్శకులుగా రాణించవచ్చని ఈ వ్యాసాల ఆధారంగా సీతారామరాజు వ్యాఖ్యానించాడు. సీవీ శ్రీనివాస్ జీవధార నానీలను వర్తమాన కవితా దృశ్యాలుగా అభివర్ణించాడు. సీవీ శ్రీనివాస్ ఒక సమస్యను అన్నీ కోణాల్లో దర్శించే అవగాహనను కలిగి ఉన్నారన్నాడు. కరోనా మీద కవిత్వం పుంఖానుపుంఖలాలుగా వచ్చినప్పటికీ సమాజంలోని జీవితంలోని భిన్న పార్శ్వాలను కవిత్వమయం చేసినవిగా హర్షవర్ధన్ 'కోవిడ్ నానీ'లను ప్రస్తుతించాడు. వస్తు నవ్యతతో కూడిన కుడికాల వంశీధర్ సాఫ్ట్వేర్ నానీలను అభినందిస్తూ "మానవీయతను తాత్వికతను కోడింగ్ చేసి నానీల ప్రోగ్రాం రాశాడు వంశీ" అని అంటాడు. కవి, విమర్శకుడు ఇరువురు సాఫ్ట్వేర్ ఇంజనీర్లు కావడం వల్ల ఈ చమత్కారం సాధించబడింది. నగేష్ బీరెడ్డి రాసిన 'ఒక నజియా కోసం' నవల అరుదైన చారిత్రాత్మక నవల అని, తెలంగాణ చరిత్రను రికార్డు చేసిందని అభిప్రాయ పడ్డాడు. మన చరిత్ర మూలాలను అన్వేషించిన నగేష్ రెడ్డి మరొక రచన 'రాచకొండ' ఔన్నత్యాన్ని నగేష్ శైలిని ప్రశంసించాడు. దేశపతి శ్రీనివాస్ జయ జయోస్తు తెలంగాణ గేయాన్ని క్షుణ్ణంగా విడమరిచి చెప్పాడు.

ఆధునిక సాహిత్య ప్రక్రియల పైనే కాకుండా సీతారామరాజు ప్రాచీన సాహిత్య అధ్యయనానికి నిదర్శనంగా నిలుస్తున్న వ్యాసం 'చాటుపద్య చమత్కారి వేములవాడ భీమకవి'. భీమ కవి గురించి తెలుగు సమాజానికి తెలిసింది కొంత తక్కువ అని చెప్పవచ్చు. అటువంటి వేములవాడ భీమనపై సాధికారికమైన పరిశోధన చేసి ఈ వ్యాసాన్ని వెలువరించినట్లు అవగతం అవుతున్నది.

సీతారామరాజుకు సునిశితమైన పరిశీలనా దృష్టి ఉంది. ఒక పుస్తకాన్ని విశ్లేషించవలసి వచ్చినప్పుడు లోతుగా అధ్యయనం చేస్తాడు అనడానికి పరావర్తనం గ్రంథంలో అనేక వ్యాసాలు ఉదాహరణలుగా నిలుస్తాయి. ఒక కవి ఒక పదాన్ని మొత్తం పుస్తకంలో ఎన్ని సార్లు ఉపయోగించాడో కూడా గమనించి దాని నేపథ్యాన్ని వివరిస్తాడు. ఉదాహరణకు ఏనుగు నరసింహారెడ్డి నీడల దృశ్యం కవిత్వంలో పిట్ట అనే పదాన్ని ఎన్నిసార్లు ప్రయోగించారు, ఏఏ సందర్భాల్లో ప్రయోగించారు, ఏ ఏ సందర్భాల్లో పిట్టను ఏ ఏ వస్తువులకు ప్రతీకగా ఉపయోగించారు మొదలైన అంశాలు చదివే పాఠకుడికి ఆసక్తిని రేకెత్తిస్తాయి. పరావర్తనంలో ఎం నారాయణ శర్మ రాసిన ముందుమాట, గుడిపాటి రాసిన వెనుకమాట పుస్తకానికి మరింత గౌరవాన్ని పెంచేవిగా ఉన్నాయి. సమీక్షలు ముందు మాటల స్థాయి నుండి భవిష్యత్తులో సాహిత్య గమనం, ధోరణులు, సాహిత్య ఉద్యమాలు సీతారామరాజు దృష్టి పథంలో కొత్త రూపును సంతరించుకొని సాధికారికమైన విమర్శ వ్యాసాలుగా తెలుగు సాహిత్యానికి అందుతాయని ఆశించడం అతిశయోక్తి కాదు.



# తెలంగాణ దీప స్తంభం
# సురవరం ప్రతాపరెడ్డి

**1955లో** తెలుగు భాషకు గాను కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని అందుకున్న ఘనుడు, తెలంగాణ ముద్దుబిడ్డ సురవరం ప్రతాపరెడ్డి. మహబూబ్‌గర్ జిల్లాలోని ఇటిక్యాల పాడు గ్రామంలో1896 మే 28న జన్మించిన సురవరం ప్రతాపరెడ్డి పత్రికా సంపాదకుడిగా, పరిశోధకునిగా, రచయితగా, ఉద్యమ కార్యకర్తగా బహుముఖాలుగా తెలుగు సాహిత్యానికి సేవ చేసిన ఆదర్శ పురుషుడు.

తెలంగాణ దీప స్తంభాలలో సురవరం ప్రతాపరెడ్డి అగ్రగణ్యుడు. తన రచనల్లో, వ్యక్తిత్వంలో తెలంగాణ ఆత్మను నింపుకున్న వ్యక్తి సురవరం ప్రతాపరెడ్డి. తెలంగాణ వైతాళికుడిగా ఖ్యాతిగాంచిన సురవరం ప్రతాపరెడ్డి తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం, పారసీ, ఆంగ్ల భాషలలో అసాధారణ నైపుణ్యం కలిగిన వ్యక్తి. గోల్కొండ పత్రిక, భారతి సాహిత్య పత్రిక, ప్రజావాణి పత్రికలను నెలకొల్పి పత్రికా సంపాదకుడిగా కొత్త ప్రమాణాలను స్థాపించాడు. తెలంగాణ భాష సంస్కృతుల వికాసానికి, అణిచివేతకు గురవుతున్న ప్రజల్లో ఆత్మవిశ్వాసం నింపడానికి ఎంతో కృషి చేశాడు ఆయన. రాజకీయ ఉద్యమాలకు ఊపిరిలూదిన ఆంధ్ర మహాసభకు తొలి అధ్యక్షుడిగా సురవరం ప్రతాపరెడ్డి గట్టి పునాదిని వేశాడు. 1955లో ఆయన రచించిన "ఆంధ్రుల సాంఘిక చరిత్ర'' గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. ముడుంబ వెంకట రాఘవాచార్యులు దురహంకారంతో రాసిన లేఖలో తెలంగాణలో కవులే లేరు అనే నిందను సవాలుగా తీసుకొని 354 మంది కవుల రచనలు విశేషాలతో కూడిన గ్రంథం'' గోల్కొండ కవుల సంచికను తీసుకువచ్చి ఆ అపప్రదను తొలగించిన ఉద్యమ భాస్కరుడు సురవరం ప్రతాపరెడ్డి. సురవరం ప్రతాపరెడ్డి జీవితాన్ని, వారి సర్వతోముఖ సాంఘిక సాహిత్యోద్యమ కృషిని, రాజకీయ, సాంఘిక, సాహిత్య సేవ, గ్రంథాలయోద్యమం, ఆంధ్ర మహాసభ సామాజికోద్యమాలను, వంశచరిత్రనూ, వారి జీవిత సంగ్రహాన్ని, అంతరంగాన్నీ, విద్యాభ్యాసం, బహుభాషా పాండిత్యం, కవితా నైపుణి, పత్రికా రచన వ్యాసంగం, కవి పండిత మైత్రి, పత్రికా సంపాదకునిగా, వివిధ వ్యాసరచయితగా, గోలకొండ పత్రిక ఆవిర్భావం, తెలంగాణా ప్రాంత సాంస్కృతిక పునరుజ్జీవనాన్ని డా॥ ఇందుర్తి ప్రభాకర్ రావు గారు పరిశోధించి, పరిశ్రమించి "శ్రీ సురవరం ప్రతాపరెడ్డి గారి జీవితం రచనలపై సమగ్ర పరిశీలన'' అనే గ్రంథం రచించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ సంవత్సరం 2014 లో తెలంగాణా వైతాళికులు శ్రీ సురవరం ప్రతాప రెడ్డి స్మారకార్థం నిర్వహించిన సభలో ఈ గ్రంథం ఆవిష్కృతమైంది. సురవరం ప్రతాప రెడ్డి జీవితం - సాహిత్యాలపై ఎల్లూరి శివారెడ్డి, ముద్దసాని రామిరెడ్డి గారలు రచించిన గ్రంథాలు చాలా విలువైనవి.

1952లో హైదరాబాద్ రాష్ట్ర శాసనసభకు జరిగిన ఎన్నికలలో ఆయన వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి శాసనసభ్యులు ప్రజల గొంతుకగా ప్రతిధ్వనించాడు. ఈనాడు తెలంగాణ సార్వస్వత పరిషత్తుగా పిలువబడుతున్న నాటి ఆంధ్ర సారస్వత పరిషత్తుకు 1944లో అధ్యక్షుడిగా వ్యవహరించాడు. "ఆంధ్రుల సాంఘిక చరిత్రకు విధాత- అమూల్య గ్రంథ సూక్ష్మ వ్యాఖ్యాత'' అనే నినాదంతో ట్యాంక్ బండ్ పై సురవరం ప్రతాపరెడ్డి విగ్రహం మనకు కనిపిస్తుంది. తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నది. హైందవ ధర్మ వీరులు, హిందువుల పండుగలు, రామాయణ కాలం నాటి విశేషాలు మొదలైన పుస్తకాలను, భక్తతుకారం, ఉచ్ఛల విషాదము మొదలైన నాటకాలను, మొగలాయి కథలు అనే పేరుతో కథా సంపుటాలను ఆయన రాశాడు. 1972లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం కూడా సురవరం ప్రతాపరెడ్డిని వరించింది. గ్రంథాలయ ఉద్యమంలో కూడా కీలకపాత్ర వహించిన సురవరం ప్రతాపరెడ్డి తెలంగాణ వ్యాప్తంగా గ్రంథాలయాల వ్యాప్తికి కృషి చేశాడు. 25 ఆగష్టు 1953న ఆయన మరణించాడు. సురవరం ప్రతాపరెడ్డి 126వ జయంతి సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో 2022 మే 28న హైదరాబాదులోని రవీంద్రభారతిలో సురవరం ప్రతాపరెడ్డి జయంతి ఉత్సవాలు నిర్వహించబడ్డాయి. వివిధ రంగాలకు చెందిన పద్మభూషణ్ డాక్టర్ కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి, డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి, డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి, డాక్టర్ ఆర్. శేషశాస్త్రి, డాక్టర్ జుర్రు చెన్నయ్యలకు సురవరం ప్రతాపరెడ్డి పురస్కారాలు, నగదు అందజేయబడ్డాయి. ప్రతాపరెడ్డి రాసిన కథల ఆధారంగా రూపొందించిన లఘుచిత్రాల విజేతలకు కూడా బహుమతులు అందజేయబడ్డాయి. తెలంగాణ భాష సాంస్కృతిక మండలి సారథ్యంలో జాతీయ సదస్సు నిర్వహించి సురవరం రచనలను, ఆయన జీవితంపై వ్యాస సంపుటిని ప్రచురించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ జాగృతి సంస్థ "గోల్కొండ కవుల సంచిక''ను పునర్ ముద్రించినది.

కథ

# ఎప్పటికీ మరువలేము

వెన్నంటే విషాద జ్ఞాపకాలు...



లక్ష్మీ కందిమళ్ళ
89196 99815

మా అమమ్మ ఇంటి పక్కన ఒక ఇల్లు ఉండేది. ఆ ఇంట్లో ఇద్దరు భార్య, భర్తలు ఉండేవారు. ఆ ఇద్దరు చాలా చూడ ముచ్చటగా ఉండే వాళ్ళు. వాళ్ళ మనసు కూడా వాళ్ళంత అందంగా నిర్మలంగా ఉండేది. వాళ్ళను మేము మామ, మామి అని పిలిచే వాళ్ళం. మామి మమ్మల్ని ఎంతో ప్రేమగా చూసేది.

మేము మామి ఇంట్లోకి వెళితే ఏదో ఒకటి పెట్టి తినే వరకు వదిలేది కాదు. మామకు, మామికి పిల్లలు లేరు. అందుకని పిల్లలు అంటే వాళ్ళకు ప్రాణం. మా మామయ్య కొడుకును వాళ్ళు దత్తపుత్రుడులా చూసుకునేవాళ్ళు. వాడి ఆలనా పాలనా అంతా వాళ్ళే చూసే వాళ్ళు. మామ అయితే వాడిని భుజాల మీద కూర్చోబెట్టుకొని దించేవాడు కాదు. వాళ్ళ ఇంట్లో ఏ వస్తువు పైన అయినా వాడి పేరే రాసుకునే వాళ్ళు.

వాళ్ళకు వాళ్ళ ఇంటి పక్కనే ఒక పిండి మిషన్ ఉండేది. కారంపొడి పట్టే మిషన్, వడ్లు పట్టే మిషన్, ఇంకా జొన్నలు, గోధుమలు పిండి పట్టే మిషన్ ఆ మిషన్ల మీద అంతా వాడి పేరేవాళ్ళు ముద్దుగా పిలుచుకునే పేరు 'బెక్కు' అని.

వాడి అసలు పేరు మరచి పోయి మేము కూడా వాళ్ళతో పాటు బెక్కు అనే పిలిచే వాళ్ళం వాడిని.

అమ్మమ్మ ఇల్లు లంకంత ఉన్నా.. బొమ్మరిల్లు లాంటి ఆ ఇల్లు భలే నచ్చేది మాకు. నాలుగు గదులతో చుట్టూ అద్దాలతో అచ్చు మామిలాగే చాలా అందంగా కనిపించేది. వాళ్ళకు మా పైన ఉన్న ప్రేమ వల్ల నేమో మామ,మామి చాలా నచ్చేవాళ్ళు మాకు. ఒక సినిమా హీరో, హీరోయిన్ లాగా..

ఎందుకో మరి తెలీదు. ఉన్నట్టుండి మామి, మామ ఆ ఇల్లును, వాళ్ళ పిండి మిషన్ ను మామయ్య వాళ్ళకు అమ్మేసి. ఎన్నో సంవత్సరాలుగా వాళ్ళ దగ్గర పనిచేస్తున్న లక్ష్మన్నను కూడా అక్కడే పని చేసుకునేలా అంతా మామయ్య వాళ్ళకు అప్పచెప్పి ఊరు వదిలి వెళ్ళిపోయారు.

మేము మామి ఇంట్లోకి వెళితే ఏదో ఒకటి పెట్టి తినే వరకు వదిలేది కాదు. మామకు, మామికి పిల్లలు లేరు. అందుకని పిల్లలు అంటే వాళ్ళకు ప్రాణం. మా మామయ్య కొడుకును వాళ్ళు దత్తపుత్రుడులా చూసుకునేవాళ్ళు. వాడి ఆలనా పాలనా అంతా వాళ్ళే చూసే వాళ్ళు. మామ అయితే వాడిని భుజాల మీద కూర్చోబెట్టుకొని దించేవాడు కాదు. వాళ్ళ ఇంట్లో ఏ వస్తువు పైన అయినా వాడి పేరే రాసుకునే వాళ్ళు.

మామ, మామి అలా వెళ్ళిపోయాక చాలా రోజుల వరకు ఎంతో గుర్తుకు వచ్చేవాళ్ళు. చాలా బాధనిపించేది. వాళ్ళతో గడిపిన ఆ రోజులన్నీ మాకు ఎప్పటికీ మధుర జ్ఞాపకాలు.

★ ★ ★

పిండి మిషన్ లో పనిచేసే లక్ష్మన్న అచ్చు బ్రిటిష్ వాళ్ళలా వుండేవాడు. గోదుమ రంగు జుట్టుతో, చర్మం ఎంతో ఎరుపు రంగుతో.. అందుకే మా తాతయ్య లక్ష్మన్నను ఎప్పుడూ ఎర్రోడా అని పిలిచే వాడు.

లక్ష్మన్న భార్య పేరు లక్ష్మీదేవి. ఏమైనా మాట్లాడాలంటే తొందరగా నోరు తిరిగేది కాదు ఆమెకు. అమాయకురాలు. మాకు ఊహ తెలిసినప్పటినుంచి లక్ష్మన్న ఆ పిండి మిషన్ లోనే పని చేస్తున్నాడు. అతని భార్య మామి వాళ్ళ ఇంట్లో పనిచేసేది. మామి వాళ్ళు వెళ్ళి పోయాక మామయ్య వాళ్ళ ఇంట్లో పనిచేసేది.

★ ★ ★

పల్లె నుండి వచ్చిన నాకు సిటీలో తెలియని వ్యక్తుల మధ్య ఉండటం ఎందుకో బాగా అనిపించక అమ్మమ్మ ఊరిలోనే ఒక ఇల్లు అద్దెకు తీసుకొని వెళ్ళాము. సిటీకి పది నిమిషాల దూరం అంతే అమ్మమ్మ ఊరు. పేరుకు సిటీకి పక్కగా ఉన్నట్టే కానీ సిటీ వసతి అంతా అక్కడ కూడా ఉంది. అదీకాక అమ్మమ్మ

క
థ

ఊరంటే చిన్నప్పటి నుంచి ప్రాణం. ఇంకా పల్లె వాసన వదలని ఆ వాతావరణంలో అందరితో ఉండవచ్చని ఇష్టంగా అక్కడికి వెళ్ళాము. అక్కడ చేరాక మామయ్య వాళ్ళ ఇంట్లోనే కాక మా ఇంట్లోనూ పని చేసేది లక్ష్మీదేవి.

మామయ్య వాళ్ళ ఇంటి పక్కన వీదిలో లక్ష్మన్న సొంత ఇల్లు ఉండేది, ఒక చిన్న గదితో.. లక్ష్మన్నకు ఒక కొడుకు. పిండి మిషన్ లో పనిచేస్తున్నందుకు లక్ష్మన్నకు మామయ్య నెలకు ఇంత జీతం ఇచ్చేవాడు. ఆ డబ్బును తాగుడుకే ఖర్చు చేసేవాడు లక్ష్మన్న. మామయ్య ఎంత తిట్టి భయపెట్టినా లక్ష్మన్న తన వ్యసనాన్ని వదిలేవాడు కాదు. భార్యకు కొడుకుకు కడుపునిండా తిండికూడా పెట్టేవాడు కాదు.

★ ★ ★

ఒకరోజు గిన్నెలు కడుగుతున్న లక్ష్మీదేవి కింద పడిన అన్నం మెతుకులు ఏరుకొని తినడం చూసి నా మనసు చివుక్కుమనిపించి కంట్లో నీళ్ళు వచ్చాయి. చాలా గట్టిగా అరిచేశాను, ఏంటి లక్ష్మీదేవి ఆ పని అని. నేను అలా అరవగానే ఉలిక్కిపడిన లక్ష్మీదేవి ఏమ్మా.. అంది మెల్లగా.. పాపం. తొందరగా నోరు తిరగని తను, బిత్తరపోయి నన్నే చూస్తూ కూర్చుంది ఇక, అలాగే కళ్ళు ఆర్పకుండా నేనే మళ్ళీ కింద పడిన ఆ గలీజు అన్నం ఎందుకు తింటున్నావు రోగాలు వచ్చి

**నేను అలా అరవగానే ఉలిక్కిపడిన లక్ష్మీదేవి ఏమ్మా.. అంది మెల్లగా.. పాపం. తొందరగా నోరు తిరగని తను, బిత్తరపోయి నన్నే చూస్తూ కూర్చుంది ఇక, అలాగే కళ్ళు ఆర్పకుండా నేనే మళ్ళీ కింద పడిన ఆ గలీజు అన్నం ఎందుకు తింటున్నావు రోగాలు వచ్చి చస్తావు తెలుసా?.. ఇంకోసారి అలా చేయకు ఏమీ. ఆకలిగా ఉంటే నన్ను అడుగు అని చెప్పి లోపలికి వెళ్ళిపోయాను.**



చస్తావు తెలుసా?.. ఇంకోసారి అలా చేయకు ఏమీ. ఆకలిగా ఉంటే నన్ను అడుగు అని చెప్పి లోపలికి వెళ్ళిపోయాను.

ఇక, అప్పటి నుంచి రోజూ కొంచెం ఎక్కువగా వండి తనకు పెట్టేదాన్ని.

★ ★ ★

లక్ష్మన్నకు కొడుకు అంటే చాలా ప్రాణం చాలా గోము చేసేవాడు వాడిని. వాడికి చదువు అబ్బలేదు. చిల్లరగా తిరిగేవాడు. అప్పుడప్పుడు ఇల్లు కట్టే గౌండల వద్ద పని చేసేవాడు. వాడిని ఎవరు ఎందుకు బెదిరించారో ఏమో.. వాడు బయపడి ఒకరోజు ఇంట్లో ఎవరు లేని సమయంలో కిరోసిన్ పోసుకొని కాల్చుకుని చనిపోయాడు.

కొడుకు చనిపోయిన దుఃఖాన్ని తట్టుకోలేక, ఇక ఆ ఇంట్లో ఉండలేక, ఊరు వదిలి వెళ్ళిపోయాడు లక్ష్మన్న భార్యను తీసుకొని. ఆ తర్వాత కూడా కొడుకును మరచిపోలేని లక్ష్మన్న దిగులుతో మంచం పట్టి కొద్ది రోజులకు చనిపోయాడు. ఒంటరి అయిన లక్ష్మీదేవి అన్న, తమ్ముళ్ళ దగ్గరికి వెళ్ళింది. ఆమెను వాళ్ళు వొద్దు అన్నారు. ఆ తర్వాత చెల్లెలు దగ్గరకు వెళ్ళి ఉంది లక్ష్మీదేవి.

ఒకరోజు లక్ష్మీదేవి చెల్లెలు ఆ ఊరికి వచ్చి లక్ష్మన్న ఇల్లు అమ్మి పెట్టమని మామయ్యను అడిగింది. ఆ వచ్చిన డబ్బులు లక్ష్మీదేవికి ఆసరా అవుతాయని లక్ష్మన్న ఇంటిని పక్కన ఇంటి వాళ్ళే 80 వేలకు కొన్నారు.

ఆ డబ్బును లక్ష్మీదేవి చెల్లెలుకు అందచేశాడు మామయ్య. ఆ ఇల్లు అమ్మడంతో ఇక లక్ష్మన్న కథ ముగిసి పోయింది ఆ ఊరిలో..

★ ★ ★

ఎన్నో సంవత్సరాలుగా మా ముందు మాతో బ్రతికిన ఆ కుటుంబం అలా కనుమరుగవటం, గుర్తుకు వచ్చినప్పుడు అంతా ఎంతో బాధనిపిస్తుంది. ఎవరు శాశ్వతం కాదు అని తెలిసినా.. కొన్ని బంధాలను ఎప్పటికీ మరవలేము కదా.

కవిత

# నది ఎండిపోయాక



ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్, 98 49 082693

చీకటి నుండి వెలుగులోకి
రహస్యం పరుగుతీసింది
తప్పు నా దగ్గరే తలదాచుకుంది
నీ ఎడారి శ్వాసలను తడుపాల్సిన నేను
కురవని మేఘమై తిరిగిపోయాను
నీ దేహ స్పందనల చుట్టూ
పూల పుప్పొడియై కమ్ముకోవాల్సిన నేను
పుకార్ల కింద నలిగి పోయాను
వెన్నెల జల్లులో ముద్దైన నీ మనసు
దుఃఖం నుండి దుఃఖంలోకి
సుడులు తిరుగుతుంటే
నాలోకి నేను ఇంకిపోయి
నీలోకి ఒంపుకోలేక పోయాను
రెక్కలు తెగిన నిశబ్దం
రక్తం మరిగిన చప్పుడు
మాటలు మౌనమైన సందర్భం -
ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే
నీరు లేని నదిలా యవ్వనం
వెక్కిరిస్తుంది నిన్ను నన్ను.



# య్యావ్!

హెచ్.ఆర్.కె.

ఏదో ఉంది, కనుక్కోవాల్సింది
కొత్తగా చెప్పుకోడానికి తగినది
లేకుంటే ఎందుకొస్తానిక్కడికి
ఎందుకని ఉంటాను, ఎందుకు నడుస్తానిలా
కాసేపు దుమ్ములో కాసేపు బురదలో
దప్పికతో నాల్కను పిడచకట్టించే ఇసుకలో

చాల మాట్లాడాలనుంది
వినడానికి ఎవరూ లేరని కాదు
చెప్పడానికి ఏదీ లేదని!

ఒక రోజు వండుకుని
ఫ్రిజ్ లో పెట్టి తీసి పెట్టి తీసి
చాల రోజులు తినే కూరలు మాటలు,
చెప్పు, నిన్నెలా విందుకు పిలవను?

వందల ఏండ్ల కిందట పుట్టిన మాటలు
ఎన్నో సార్లు నాలుకలచే విసరికొట్టబడి
ముక్కలుగా పగిలిపోయి, అతుక్కుని,
పేలిపోయి, పాదరసం ముద్దల్లా కలిసిపోయి
చాల చనిపోయి, కొంచెం బతికున్న మాటలు

ఐనా, మాట్లాడుతూ మాట్లాడుతూనే మరణించాలి
లేదా, ఎండిపోయిన బావిలోని లోతైన చీకటిలో
గుడ్డి పాముల్లా ఎవరిలో వాళ్లం మెలికలు తిరగాలి

చనుబాలతో పాటు పీల్చుకుంటాం మాటల్ని
మాట ఊరుతుంది అంతస్సు లోతుల నుంచి
వేపచెట్టు గాయం నుంచి జిగురు ఊరినట్లు

పొయ్యి పక్కన పొంతకుండ లాంటి ఈ భూమి
ఇంకాసేపుంటే వేడెక్కి గుండెలు పొర్లిపోతాయి
వేడికి మట్టి కూడా కరిగిపోతుంది
చెప్పుకోవాలి ఈ లోగానే, చెప్పుకోగలిగిన వన్నీ
ఇంతా చేసి, కొత్తది ఏమైనా చెప్పగలిగానా... ?

వ్యాసం

# ప్రాణం పాటైతే...

విశ్వజనీయమైన పాటను వివరించిన వ్యాసం...



డా॥ కోయి కోటేశ్వర రావు
94404 80274

"అగ్ని తుఫాను ఆలపించిన ఆత్మగౌరవ గీతం
సముద్రం ఒకడి కాళ్ల దగ్గర కూర్చొని మొరగదు
తుఫాను ఒకడికి చిత్తం అనటం ఎరుగదు
పర్వతం ఎవ్వడికి వంగి సలాము చేయదు"
- గుంటూరు శేషేంద్రశర్మ

ఆత్మగౌరవమే మనిషికి అసలైన ప్రాణం. ఆత్మగౌరవం లేనిజాతి ఒక్క అడుగుకూడా ముందుకు వేయలేదు. సమున్నత లక్ష్య సాధనకు ఆత్మగౌరవమే ఆదిప్రేరణ. తోకతొక్కినప్పుడు నాగు పాము బుసలు కొట్టినట్లు, దెబ్బ కొట్టినప్పుడు పెద్దపులి పంజావిసిరినట్లు, ఆత్మగౌరవానికి భంగం కలిగినప్పుడు వీరోచితమైన పోరాటం పోటెత్తుతుంది. నాటి జాతీయోద్యమం నుండి నేటి అస్తిత్వఉద్యమాల వరకు వెల్లువెత్తిన మహత్తర చైతన్యానికి నాంది ఆత్మ గౌరవతత్త్వమే. ప్రపంచనాయకుడు డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్ ఉద్యమ ప్రస్థానానికి ఊపిరి ఆత్మగౌరవమే. ఈ ఆత్మగౌరవ తత్త్వాకి నవీన భాష్యం చెప్పిన పాట 'కొమురం భీముడో'. ఈ పాటవింటే అగ్నితుఫాను గర్జించినట్లు, ప్రళయ సాగరం ఘోషించినట్లు, నెత్తురొలికే పిల్లనగ్రోవి ఆత్మగౌరవ గీతం ఆలపించి నట్లుంటుంది. 'త్యాగం మన పేరు, పోరాటం మన ఊరు' అన్న మావో రణనినాదం ఈ పాటనిండా ప్రతిధ్వనిస్తుంది. 'అనంత జగత్తు మొత్తమై నాకెదురైన గెల్తును' అన్న నవయుగ కవిచక్రవర్తి జాషువా పద్యస్ఫూర్తి ఈ అక్షరాల్లో నిక్షిప్తమైంది. 'కొమురం భీముడో' పాటలో సందేశాన్ని పరిశీలిస్తే, పారుతున్న నెత్తురును, కారుతున్న కన్నీరును, రగులుతున్న గాయాలను తట్టుకొని, ఆశయసాధన కోసం కట్టుబడి ఉండాలనే అసమాన సంకల్పం కలుగుతుంది. అసువులు జారిపోతున్నా తన జాతికోసం నీతికోసం నిలబడాలనే కొండంత గుండె నిబ్బరం కలుగుతుంది. జాత్యహంకారానికి వ్యతిరేకంగా ఉక్కు పిడికిలి బిగించాలనే 'ఇంక్విలాబ్' శక్తి, యుక్తి సమకూరుతుంది. ఇలాంటి సాటిలేని భావోత్తేజాన్ని, పట్టరాని భావోద్వేగాన్ని తన పాట ద్వారా కోట్లాది ప్రేక్షకుల గుండెల్లో రగిలించాడు సుద్దాల అశోక్ తేజ. అందుకే ఈ పాట వెండి తెర మీదే మాత్రమే కాకుండా, డిజిటల్ గుండె తెర మీద కూడా చరిత్ర సృష్టించింది. కొమురం భీముడో' పాటద్వారా సాహిత్యం యొక్క పరమ ప్రయోజనాన్ని అశోక్ తేజ అద్భుతంగా చాటిచెప్పాడు.

*"ఒక గానంలో ప్రాణం కలిస్తే అది సుద్దాల అశోక్ తేజ*
*ఒక జానపదంలో జ్ఞానపదం కలిస్తే అది అశోక్ తేజ*
*ఒక కవనంలో కదనం కలిస్తే అది అశోక్ తేజ*
*ఒక అరుణోదయంలో కరుణా హృదయం కలిస్తే అది అశోక్ తేజ"*

అని అశోక్ తేజ కవన వ్యక్తిత్వాన్ని పాపినేని శివశంకర్ విశ్లేషణాత్మకంగా సూత్రీకరించాడు. తెలుగు సాహిత్యం కనీ వినీ ఎరుగని యుద్ధగీతాలు ఆలపించిన సుద్దాలహనుమంతు రక్త సంతకం అశోక్ తేజ. తెలుగు పాటకు కళాతత్త్వగౌరవాన్ని, జాతీయ ఖ్యాతిని అందించిన ఉత్తమకవి. 'టప టప మని', 'నేలమ్మ నేలమ్మ', 'ఆకుపచ్చచందమామ', 'మాతృదేవోభవ' తదితర పాటల్లోమహాకావ్యస్ఫూర్తిని పలికించిన గొప్పకవి. నిసర్గసుందరమైన తెలంగాణ జానపదాల నుడికారపు ఒంపుసొంపులతో అశోక్ తేజ సినిమా పాటను చైతన్యశోభితంగాతీర్చిదిద్దాడు. సామాజిక చైతన్య గీతాలతో, ఉద్యమ పాటలతో ప్రజాస్వామ్యవాదులకు అభిమానపాత్రుడయ్యాడు. శ్రమకావ్యం 'నేను అడవిని మాట్లాడుతున్నాను' వంటి

దీర్ఘ కవితలతో కవి పండితుల మన్ననలం దుకున్నాడు. దాసరి నుండి రాజమౌళి వరకు ఎంతోమంది దర్శకుల సినిమాలకు తన పాటలతో అశోక్ తేజ కొత్త ఉత్తేజాన్ని అందించాడు. 'పీపుల్స్ స్టార్'ను ఫిదా చేసే రచనానిబద్ధత తోపాటు, మెగాస్టార్‌ను కూడా మెప్పించే కవన నైపుణ్యం అశోక్ తేజాకే సొంతం. అన్నింటికీ మించి ప్రభావశీలమైన పాటల రచయితగా ప్రజా హృదయాల్లో సుస్థిరస్థానం సంపాదించు కున్నాడు అశోక్ తేజ. 'ధగధగ లాడే ఓ జెండా/వినవే పేదలగాథ' అంటూ పదేళ్ళప్రాయంలోనే కలమెత్తి గర్జించిన అశోక్ తేజ ఈనాటికీ దిగ్విజయంగా ఆ పాటల జెండా ఎగురవేస్తూనే ఉన్నాడు. 'గరం గరం పోరి/ నా గజ్జల సవ్వారి' అనే సినిమాపాటతో తెరంగేట్రం చేసిన అశోక్ తేజ ఆరుపదులు దాటినా గరం గరంగా, ఘనంగా సృజన చేస్తున్నాడు. పాటల సవ్వారితో అప్రతిహతంగా జైత్రయాత్ర చేస్తున్నాడు.ఈ జైత్రయాత్రలో మహామలుపు మరో గెలుపు కొమురం భీముడో పాట.

సినిమా కర్తృత్వం అత్యంత సంక్లిష్ట భరితమైనది. ఎల్లవేళలా సినిమా కవి నిరంకుశుడు కాదు. అతని చుట్టూ సమయ, సందర్భ, సంగీత, సాంకేతికాది నిర్బంధాలు పొంచి ఉంటాయి. కొండొకచో దర్శక నిర్మాతలు నిర్దాక్షిణ్యంగా గీసే లక్ష్మణ రేఖలుంటాయి. నిర్బంధాలను సమర్థ వంతంగా అధిగమించి, సినిమాకవి ఆశు సృజన గావించాలి. స్వీయ సాహిత్య, భాషాభిరు చులను కవచ కుండలాల్లాగా ఒలిచి మరీ రచన చేయాలి. ఇందుకోసం తనను తాను దగ్ధం చేసుకొని, పాత్ర స్వభావాన్ని కవి ఆవహన చేసుకోవాలి. పాత్రలో పరకాయ ప్రవేశం చేయాలి. కథానుకూలమైన చరిత్ర, సంస్కృతి లోకి మేధోపరమైన ప్రయాణం సాగించాలి. ప్రసవ వేదనను మించిన సృజనవేదన అనుభవిస్తూ పాట రాసి దర్శకుడిని ఒప్పించాలి. మాస్, క్లాస్ ప్రేక్షకులతో పాటు ఆబాలగోపాలాన్ని మెప్పించాలి. ఈ విధమైన అసాధారణ కళాప్రతిభా సంపన్నుడు సుద్దాల అశోక్ తేజ. సమకాలీన చలనచిత్ర ప్రపంచంలో పెనుసంచలనం సృష్టిస్తున్న 'త్రిబులార్' లో అశోక్ తేజ రాసిన 'కొమురం భీముడో' పాట ఆయన కవన తేజస్సుని ద్విగుణీకృతం చేసింది. త్రిబులార్ సినిమా విజయానికి కీలకంగా నిలిచింది. త్రిబులార్ సినిమాసారాంశాన్ని, సన్నివేశ ప్రాధాన్యతను ,దర్శకుడు ఆశించిన అవుట్‌పుట్‌ను అశోక్ తేజ సూక్ష్మంగా అర్థం చేసుకొని, భీమ్ పాత్ర తాలూకు వ్యక్తిత్వ మహత్వాన్ని ఇనుమడింపజేసే

**దాసరి నుండి రాజమౌళి వరకు ఎంతోమంది దర్శకుల సినిమాలకు తన పాటలతో అశోక్ తేజ కొత్త ఉత్తేజాన్ని అందించాడు. 'పీపుల్స్ స్టార్'ను ఫిదా చేసే రచనానిబద్ధత తోపాటు, మెగాస్టార్‌ను కూడా మెప్పించే కవన నైపుణ్యం అశోక్ తేజాకే సొంతం.**

విధంగా కొమురం భీముడో పాటను రచించాడు. పాటలో ప్రాథమికంగా సందర్భోచితమైన పదునైన కవితావిలువలు ఉండాలి. అప్పుడే ఆ విలువలు మిగతా విభాగాల్లోకి బట్వాడా అవుతాయి. కొమురం భీముడో పాటలోని భావనైశిత్యం స్వరకల్పన, గానం, చిత్రీకరణ, నటన తదితర అంశాలను తీవ్రంగా ప్రభావితం చేయడం వల్లనే ఈ పాట ప్రజారంజకంగా రూపొందింది. అశోక్ తేజ కవన గరిమకు తార్కాణంగా నిలిచే ఈపాట సినిమాకు ప్రాణ చైతన్యాన్ని అందించింది. సినిమాప్రతిష్ఠను సమున్నతంగా నిలబెట్టింది. సన్నివేశ గతమైన 'మూడ్'ను మరింతగా విస్తృత పరిచింది. ప్రగాఢమైన సెంటిమెంట్ ను పండించింది.

కొమురం భీముడో పాట ప్రారంభం లో హోరుగాలి తాకిడికి చెట్ల ఆకులు రాలిపడుతుంటాయి.ఈ క్రమంలో ఒకపచ్చని ఆకు, భీమ్ పాత్రధారి జూనియర్ యన్ టి ఆర్ చెంపను తాకి, అతనికి సమీపాన వున్న నీటిలో పడుతుంది. కొరడాదెబ్బలతో చిత్రహింసలు అనుభవిస్తున్న భీమ్ నీటి లోకి తొంగిచూస్తాడు. నీటిలో భీమ్‌కు తన ప్రతిబింబం కనబడుతుంది. "భీమా నినుగన్న నేలతల్లి /ఊపిరిపోసిన చెట్టూ చేమా/ పేరుపెట్టిన గొండుజాతి/ నీతో మాట్లాడుతుంది" ఈ మాటలతో పాట ప్రారంభమవుతుంది. నేలతల్లి, ప్రకృతి, గోండుజాతి కలిసి భీమ్‌తో మాట్లాడుతున్నట్లుగా, అతనికి కర్తవ్యోపదేశం చేసినట్లుగా పాటను ప్రారంభించటం అశోక్ తేజ దార్శనిక





దృష్టికి నిదర్శనం. అత్యంత ప్రభావవంతమైన నేలతల్లి, ప్రకృతి, గొండుజాతి కలిసి ఉపదేశం చేస్తే ఆ సందేశం ఎంత తాత్త్విక భరితంగా ఉంటుందో, ఎంత విశ్వజనీన దృష్టిని వాగ్దానం చేస్తుందో కొమురం భీముడో పాటతో అశోక్ తేజ తేటతెల్లంచేశాడు. నేలతల్లి త్యాగం, ప్రకృతి అనురాగం, గోండుజాతి పౌరుషం తోకూడిన త్రిముఖీన స్ఫూర్తి ఈ పాటలో అద్భుతంగా నిబిడీకృతమైంది. ఆ మాట కొస్తే ఈ పాట కవి రాసినట్లుగా ఉండదు. ఈ పాట నేలతల్లి తన బిడ్డకు బోధించే ఆశయ వేదంలా ఉంటుంది. ప్రకృతి చెప్పిన జీవనపాఠంలా స్ఫురిస్తుంది. గొండుజాతి 'సమర గీత'లా వినిపిస్తుంది.

ఈ పాటలో పల్లవి నుండి ముగింపు వరకు మూడు చరణాలు ఉత్తరోత్తర బలీయంగా ఉంటాయి. "కొమురం భీముడో కొమురం భీముడో"/ కొర్రాసు నెగడోలే మండాలి కొడుకో / రగరాగ సూర్యుడిలా రగలాలి కొడుకో" అంటూ వినూతన అభివ్యక్తితో ప్రేక్షకులల్లో కవి అగ్నిప్రేరణ కలిగిస్తాడు. చుట్టూ కారు చీకట్లు ముసురుకున్నా, మనిషి నిరంతర చైతన్య మూర్తిలా ప్రభాసించాలని, పాట సారాంశాన్ని పల్లవిలోనే అశోక్‌తేజ రసాత్మకంగా ఆవిష్కరించాడు. 'కొర్రాసు నెగడోలే మండాలి' అనేది అసాధారణమైన, స్థానీయ సంబంధమైన (Native conceit) సాదృశ్యం. 'రగ రగ సూర్యుడిలా రగలాలి' అంటూ మరింత ఉత్తేజం కలిగిస్తాడు కవి. 'రగ రగ' అనేది అశోక్ తేజ చేసిన కొత్త ప్రయోగం. భావానుకూలమైన సరికొత్త ధ్వన్యనుకరణ శబ్దం. అశోక్ తేజ నవ్యభావనా పటిమ ఇందులో ప్రత్యక్షరంలో ప్రతిఫలిస్తుంది 'కాల్మొక్తా బాంచన్' అని సామ్రాజ్యవాదానికి సాగిలబడితే అడవితల్లికి పుట్టినట్టు కాదని, జులుము గద్దెకు తలవంచితే తుడుం తల్లి పేగున పెరిగినట్టు కాదని మొదటి చరణంలో భీమ్ పాత్రతో పలికిస్తాడు కవి. తీవ్రమైన కొరడాదెబ్బలకు తనువంతా ఛిద్రమవుతున్నా, శరీరం నుండి ధారాపాతంగా చిందే రక్తాన్ని చూసి భయపడినా, కన్నీళ్లను చూసి చలించినా భూతల్లి చనుబాలు తాగినట్టుకాదని కఠోర శాసనం విధించినట్లుగా అశోక్ తేజ రెండవ చరణం రచించాడు. 'ఇలా చేస్తే నా మీద ఒట్టు' అని తల్లి బిడ్డను ఆత్మీయంగా హెచ్చరించడం నిత్యజీవన వ్యవహారంలో సహజం. ఈ అనురాగ పూరితమైన ఆనతో ఆత్మగౌరవచేతనను ఆర్ద్రంగా అభివ్యక్తీకరించాడు కవి 'ఎలాంటి దుర్భర పరిస్థితుల్లోనూ రాజ్యహింస ముందు తలవంచ కూడదనే సందేశాన్ని కమనీయ కళాతత్త్వశోభితంగా అశోక్ తేజ అక్షరబద్ధం చేశాడు. అడవి తల్లి, తుడుంతల్లి, భూతల్లి వంటి పవిత్ర పదాలతో సార్వజనీన మాతారాధన ఆవశ్యకతను, జన్మభూమి ఎరుకను అశోక్ తేజ ఈ పాటలో మనోహరంగా చాటి చెప్పాడు. శత్రువు పెట్టే ఘోరహింసను ఎదిరించి నిలబడాలి కానీ కన్నీరు పెట్టకూడదు. ఒకవేళ అలా కన్నీరు పెట్టినవాడు భూతల్లి చనుబాలు తాగనట్టేనని నిర్ధారించడంలో ఉదాత్త ఉపదేశం సువ్యక్తమయింది. జాతితో, జన్మభూమితో ఉండవలసిన మమేకతను, అనుబంధాన్ని కూడా కవి తన పాటలో అద్వితీయంగా పొందుపరిచాడు. క్కాల్మొతా బాంచన్, జులుము గద్దె, తుడుం, ఒగాల (ఒకవేళ) లాంటి పదప్రయోగాలతో కవి పాత్రోచిత భాషకు ప్రతిభావంతంగా పట్టంకట్టాడు. గోండు జాతి భాషా, సాంస్కృతిక వాతావరణాన్ని సూక్ష్మంగా చిత్రించాడు.

మొదటి రెండు చరణాల్లో జ్వలించిన ఉద్వేగం మూడో చరణంలో మరింత తీవ్రమవుతుంది. కాలువై పారే భీమ్ గుండె నెత్తురు నేలమ్మకు నుదిటి బొట్టవుతుందని, అమ్మ కాళ్ళకుపారాణిగా అలరారుతుందని, తల్లి పెదవులపై చిరునవ్వుగా విరబూస్తుందని లోకోత్తరమైన వర్ణనా నైపుణ్యంతో కవి సంభావించాడు. తద్వారా భీమ్ త్యాగానికి సార్థకతను చేకూర్చాడు. ఆ పాత్రకు ఉదాత్తమైన ఓదార్పును, తాత్త్విక బంధురమైన భరోసాను అందించాడు అశోక్ తేజ. "కొమురం భీముడో పుడమితల్లికి జన్మ అరణం ఇస్తివిరో" అంటూ బతుకును పుడమితల్లికి బహుమతిగా అర్పించిన భీమ్ త్యాగోన్నతిని అసాధారణ అభివ్యక్తితో కవి చిత్రించాడు. అనంత వేదనా భరితమైన చివరి పాదంతో, ఈ అపురూపమైన ముక్తాయింపుతో అశోక్ తేజ ప్రేక్షకులను మంత్రముగ్ధులను గావించాడు. నిజాయితీగా, నమ్మిన ఆశయానికి నిబద్ధుడై, జాతి అభ్యున్నతి కోసం సదా మనిషి జీవించాలనే Emotional Philosophical discourseతో ఈపాటను ఫలవంతం చేశాడు కవి. నిర్దిష్టమైన సందర్భ దృష్టి తో రాసినప్పటికీ, అశోక్ తేజ సృజన చాతుర్యం వల్ల 'కొమురం భీముడో' పాట విశ్వజనీన భావ విలసితమై, సార్వకాలికమైన ప్రాధాన్యతతో చిరకాలం అలరారుతుంది.

# గజల్



తుమ్మూరి రామ్మోహన్ రావు, 97015 22234

మనసు నీదు గూటిపైన
వాలును  ఒక పిచ్చుకై
నీ వెన్నెల మనసు తలచి
విచ్చును ఎద కలువయై

నీ తలపే ఒక ఉషస్సు
నా కెపుడది ఒక తపస్సు
ప్రతి వేకువ నీ రూపము
తోచును ఇన బింబమై

పనిలో పడినంత సేపె
వెనుక వైపు నిలుచుందువు
తెరపిన పడగానె ఎదుట
ఉందువు వర వీణవై

నా మానస సరసి లోన
చెలిమి చెలిమెవీవు కదా
దోసిలొగ్గి స్నేహ మధువు
గ్రోలుదు కలహంసనై

మోహన ప్రణయాహ్లాదము
సాహిత్యము నుడువలేదు
అనుభవైకవేద్యము మది
తెలియును భ్రమరమై

కథ

# రేకుల కింద రెక్కలు...

అలవాటులో పొరపాటు...



గడ్డం సతీశ్
99590 59041

గుంజ, గుంజకు నడుమ మూడు గజాల ఇటుక గోడలు. ఇసుక, సిమెంటు గల్వని ఆ గోడలు పాకురువట్టి పచ్చగా రంగేసినట్టు గొడ్తున్నయి. వానకాలం అచ్చిందంటే సాలు ఆ గోడలకెల్లి పచ్చగడ్డి ఇగురెల్తది. అదిగురెల్లినా కొద్దీ బరుకుడే మా (నేను చెల్లె) పని. రేకులకంటకుండా, అందినకాడికి సూట్బూరా ఇటుకలు వేర్శిండు బాపు.

ఎండకాలం అయిపోయినంక రేకుల పైకెల్లి గోడల మీదికి వరుకు సంచులను జారిడిసి, ఆ సంచుల మీద బండలు వెడ్తుండె బాపు. ఇగ ఎంత గాలిసిరినా ఆ వరుకులు కొట్టుకవోకపోతుండె. ఇర్గ సలివెట్టినప్పుడు ఆ సంచులే అనుకు తుండె గని సలిని మాత్రం మా దగ్గరికి రానియ్యకవోతుండె. తుంపుర్ల వాన వడ్డప్పుడేం గాకవోతుండె గని, వాన ఇర్గ ఇసిరి సంపినప్పుడే శీకు వట్టిన సంచులు శిన్గిపొయి ఆ ఇటుక గోడల్ల పొంటి సల్లు గొడ్తుండె. ఆ వానకు యూరియా సంచులు రప రప సప్పుడుజేత్తుండె. సంచులు శిన్గుతేం గాదు గని ఆ సంచుల మీదున్న కట్రౌతులే కిందవడితే పరేషాన్. అందుకే వానగొట్టినప్పుడో, గాలిసిరిన ప్పుడో.. 'ఆ గోడల మొకాన వోకుర్రా' అని జెప్తుండె బాపు.

'ఔనే బాపు... వాన గొట్టినప్పుడల్లా ఈ రపరప సప్పుడేందే... సక్కగా రేకులకంటేదాన్క ఇటుకలు పేరిస్తయి పోతది గదా?' అనడగిన బాపును. 'నీ ఇగురం మంచిగనే ఉందిగని బిడ్డా.. మొత్తం ఇటుకలే పేరిస్తే లోపలంత శీకటి ఉంటది గదరా' అన్నడు. ఔను, బాపన్నది నిజమేనని మన్సులనుకొని.. 'నువ్వద్దేనే బాపు...' అని మారు జవాబియ్యలే.. వానకాలం బాయె, సలికాలం సల్లవడె, ఎండకాలం మళ్లొచ్చే... శీకువట్టిన యూరియా సంచుల దగ్గర కొత్త సంచుల త్తున్నయి గని ఎండకాలం గూడ ఆ సంచులను దీత్తలేడు బాపు.

'ఇది ఎండకాలమే గదా? ఆ సంచుల సప్పుడుకు మన్సున వడ్తలేదు, తీసేద్దామా..' అని మళ్లోపారి అడిగిన బాపును. 'అరే.. ఆ సంచులు నిన్నేమం టున్నయిరా... ఎమో సంచుల మీద వడ్డవ్' అని గట్టిగన్నడు బాపు. ఆ మాటిన్న నాకు శీకువట్టిన సంచుల జాగల కొత్త సంచులే అస్తయి గని, ఆ యూరియా సంచులను మాత్రం తీసేయ్యడని అర్థమైంది. ఇగ నేనే అప్పుడప్పుడు ఆ రేకులెక్కి అటీటు జరిగిన కట్రౌతులను సక్కగ వెట్టేటోన్ని. కట్రౌతుల బరువుకు కిందికి జారే రేకులను అమ్మా... బాపే తాపకోసారి సగవెట్టేటోళ్లు. అజ్జిరవ్వ నవారు మంచమ్మీద నిలవడి రెక్కలతోని రేకులు లేవడ్తే... బాపు రేకుల కొస్సకుండి ఆయన రెక్కలతోని మీదికొత్తుతుండె. సందొచ్చిన రేకులు వాళ్లు జేయవట్టి మళ్లా సక్కగైతుండె. ఆ పనయిపోయేదాన్క నాకు పరేషానే అమ్మా-బాపుకు ఆ రేకులెక్కడ కోసుకవోతయోనని.

★ ★ ★

ఏసంగి పంట చేతికొచ్చింది. కల్లం కాడికొచ్చి కిట్టయ్య సేటు వడ్లు జోక్కవొయి బగ్గనే రోజులైతున్నది గని ఇంక పైసలియ్యలే. నెత్తికి రుమాల్, క్యారల్‌కు కట్టెల మోపు.. హైండిల్‌కు చెయ్ సంచి, నొట్లె సుట్ట వెట్టుకొని బంజరికెల్లి అప్పుడే అచ్చిన బాపును 'ఆ కిట్టయ్య సేటు వడ్ల పైసలియ్యడట్నా ఇగ?' అజ్జిరవ్వ అడుగుతున్నది.

'ఇయ్యాల్లిస్తా అన్నడు గని'

'మరె పొయి తీస్కరారాదు...'

'సరే నేను వొయి తీసుకొస్త తీ..'

'ఆ గౌండ్లోళ్లకు తర్వాత గడ్తవుగని అవి వట్టుకొని ముందుగాళ్లనే అటువోకు..' అని అజ్జిరవ్వ అనేసరికి బాపుకు సర్రున కాలుకచ్చింది.

'తాళ్లపెల్లి నర్సిగాడు ఆర్నెల్ల వట్టి వాడ్క సీస వోత్తండు, అడ్ల పైసలొచ్చినంక గూడ ఇయ్యకుంటే రేపట్నుంచి ఆడు మళ్లవోత్తడా?, ఫస్టు ఆనియిచ్చినంకనే తతిమయి లెక్క..? అయినా, ఆ కిట్టయ్య సేటు పాత బాకీలన్నీ ఆపుకొని చేతులెన్ని వెడ్తడో ఏమో పో...' అనుకుంటా సైకిలేస్కొని బజారుకు పోనే వోయిండు

బాపు.

‘ఈ ఎవుసం సల్లగుండా.. నార్వోకుడు కాన్నుంచి మొదలు... నాటేసుడు, వరి గల్సుడు, వరి కోసుడు, వరి మోసుడు, అల్గం బెట్టుడు, అల్గం దుల్పుడు, వడ్ల వట్టేదాన్క కైకిలోల్లేనాయె.. ఏం మిగుల్త యో ఏమో పో. ఆడికి నేను అదల్‌కు బదల్ వొయి కైకిళ్లన్నీ తేర్పుకుంటనే అస్తున్న గని.. అయినా ఈ కైకిల్లు పాడు గాను ఇంక బాగనే ఉన్నయి ఎంకటక్కా..’ అని బాపటువోంగనే ఇంటికొచ్చిన మామిడి ఎంకటవ్వ పెద్దమ్మకు జెప్తున్నది అజ్జిరవ్వ. ముచ్చట్లకు మూతి జాప్తది ఎంకటవ్వ పెద్దమ్మ.

**సైకిల్ ఇంటిదాన్క దొక్కుకుంటా అచ్చే బాపు ఎందుకో ఎత్తిరాజం తాతోల్లింటికాన్నే దిగి నడ్సుకుంటొస్తున్నడు. సైకిల్ పయ్య ఒకసారి అటువోతున్నది, ఒకసారి ఇటువోతున్నది. బాపు తాగేది ఒక్కటే వాడ్కం సీస. ఎప్పుడన్నొక్కసారి ఇంకోటి ఎక్కువ వోత్తడు. అది వోసిన్నాడు ఉత్తగనే ఏర్పడుతది. అంతే దప్పా, తాగి ఒర్రేది లేదు, ఒగని జోలికి వొయ్యేది లేదు. లొల్లి వెట్టుకుంటే ఒక్క అజ్జిరవ్వతోని దప్ప.**

మాదో బంగ్లా గాదు, భవంతి కాదు గనీ... నాత్రి ఏడయిందంటే సాలు, సిన్నమ్మలు, పెద్దమ్మలు, అత్తమ్మలం దరూ ఒక్కకాడ గూడి మా ఇంటి ముందట్నే మీటింగ్ వెడ్తరు.

కిట్టయ్య సేటు దగ్గర్కి వొయి దగ్గర దగ్గర రెండు, మూడు గంటలయితున్నది గని ఇంకా ఇంటికి రాలె బాపు. ఆ గుంపు లున్నట్లే గని అజ్జిరవ్వ జీవునమంతా బాపు మీదనే ఉన్నది. పైసలియ్యాల్లనన్న తెత్తడో తేడోనని.

నాకు ‘కీస్ కీస్’మనే బాపు సైకిల్ సప్పుడినవడ్తున్నది. అంటే బాపొస్తున్న డన్నమాట. అదే మాట అమ్మకు జెప్పిన. అట్ల జెప్పిన్నో లేదో బాపు సైకిల్ సప్పుడాగింది. ఏమైందా అని వాడ ముందటికి ఉర్కి వొయి జూసిన. సైకిల్ ఇంటిదాన్క దొక్కుకుంటా అచ్చే బాపు ఎందుకో ఎత్తిరాజం తాతోల్లింటికాన్నే దిగి నడ్సుకుంటొస్తున్నడు. సైకిల్ పయ్య ఒకసారి అటువోతున్నది, ఒకసారి ఇటువోతున్నది. బాపు తాగేది ఒక్కటే వాడ్కం సీస. ఎప్పుడన్నొక్కసారి ఇంకోటి ఎక్కువ వోత్తడు. అది వోసిన్నాడు ఉత్తగనే ఏర్పడుతది. అంతే దప్పా, తాగి ఒర్రేది లేదు, ఒగని జోలికి వొయ్యేది లేదు. లొల్లి వెట్టుకుంటే ఒక్క అజ్జిరవ్వతోని దప్ప. బాపు నా దగ్గరిదాన్క అచ్చేదాన్క కనవల్లే ఆయన జేబు ఉబ్బి ఉన్నట్టు. బాపు వాడ మల్లిండు. ‘ఆ కిట్టయ్య సేటు పైసలిచ్చినట్టున్నడు. బాపొక్క సీస ఎక్కువనే వోసిండియ్యాళ్ల’ అని మనసుల నుకుంటా బాపెంబడి ఇంటికి నడుస్తున్న.

‘అజ్జిరీ... అడ్ల పైసల్ అచ్చినట్టున్నయే... పిలగాని సైకిల్ అటీటూగుతున్నద’ని పర్కాష్కమాడు తున్నది ఎంకటవ్వ. మేం ఇంటిదాన్క వొంగనే అందరూ లేసిపోతనే ఉన్నరు ఎవ్వలింటికాళ్లు.

‘ఏ ఆగుర్రాగుర్రి.. కైకిళ్ల పైసలిత్తా’ అని లేసిపోయేటోల్లను ఆపుతున్నది అజ్జిరవ్వ.

‘ఛల్... గీ నాత్రిపూటొచ్చిన లచ్చుక్కల(పైసలు)ను ఎల్లగొడ్తావె వద్దని. రేప్పొద్దునిద్దాం తీ...’ అజ్జిరవ్వను గద్రాయించుండు బాపు.

‘ఓ... ఓ ఎంకటవ్వ వదినె... ఇప్పుడు కైకిళ్ల పైసలిస్తనే ఎల్తదా నీకు, లేకుంటే ఎల్లదా..?’ అని ముసిముసి నవ్వుతున్న ఎంకటవ్వనడిగిండు బాపు.

‘ఓ పిలగా రేపిత్తువ్ తీయి..



కథ

ఇప్పుడేమన్న గుంజుకుంటున్ననా ఎగవడి. ఈ నాత్రిపూట మీ అన్న కంట్లే వడ్డా అవి లెక్కకురావు.'

'ఆ.. ఇగ నువ్విత్తనే తాగుతండా మా అన్న కల్లు..?'

'లేకుంటే నువ్వు సంసారివే.. మీ అన్న సంసారే తీయి' అని నవ్వుకుంట ఆవలవడ్డది ఎంకటవ్వ. ఆమెనుక అందరెక్కడోళ్లక్కడ వోయిర్రు.

ఫస్టు బాపు, బాపెనుక అజ్జిరవ్వ... ఇద్దరు వొయి ఇంట్ల గూసున్నరు. నేన్గూడ వాళ్లెంబడే వొయి మంచంలొర్గిన. పైసల కట్టదీసి అమ్మచేతిల వెట్టిండు బాపు. అప్పుడప్పుడే నా కన్లు మూతలు వడ్తున్నయి...

* * *

నాత్రి మూతలు వడ్డ నా కన్లు ఎగిలివారంగనే ఇనవడ్తున్న ఏడ్పులతోని మళ్లా తెర్సుకున్నయి. ఆళ్లూ.. ఈళ్లూ... అందరొచ్చి ఇంటిముందల నిల్సున్నరు.

'ఛ్... మళ్లేమైందో'నని మన్సులనుకుంటున్న...

'ఏ గవ్వేడవోతయి.. అజ్జిరి ఏడవెట్టినవో మంచిగ యాజ్జేస్కోయే..'

'ఎంకటక్కా... నేను ఈ ఇటుకల కిందనే వెట్టిన. ఈ పిసమొకపోడే వాటిని దీసి నాల్గయిదు సార్ల లెక్కవెట్టిండు.' అజ్జిరవ్వ ఏడ్సుకుంట జెప్పవట్టింది ఎంకటవ్వకు. నాత్రి బాపిచ్చిన పైసల్ అమ్మ వోగొట్టిందని అప్పుడర్థమైంది నాకు.

'ఓ పిసమొకం దాన లెక్కవెడ్తే మాయమైతాయె పైసల్, మంచిగాజ్జేసుకో ఏడ వెట్టినవో...' వాళ్ల లొల్లింటున్న నాకు వానకాలం అడ్ల పైసల్ గుర్తుకొచ్చినయి.

* * *

ఎప్పుడు అడ్లమ్మినా లాగోడి కర్సులు, కైకిలోళ్ల కర్సులు అన్నివోను మిగిలేటియి రెండు వేలో, మూడు వేలో.. అవిదెచ్చి అజ్జిరవ్వకిస్తే వాటిని ఒరకు వెట్టేది అమ్మ. ఒరకు వెట్టుడంటే బ్యాంకు లాకర్లనో, అల్మార్లనో గాదు. ఇటుకపెల్లల కిందనో, బియ్యం సంచిల్నో... సందుగుల్నో దాసివెట్టేది.

ఇగ ఇంట్ల పైసలుంటే బాపు చేతులుతుత్తగుండయి. వాటిని నాల్గయిదు సార్ల లెక్కవెడ్తడు.

'అట్లెందుకు, అన్నిసార్ల లెక్కవెడ్తవే బాపు' అని నేనోసారి అడిగిన..

'మీ అయ్య ఊకే లెక్కవెడ్తే పైసలు డబులైతయిరా' అని అజ్జిరవ్వ పరాష్కమాడుకుంట ఇళ్లూడుస్తున్నది.

'నిజమేనానే బాపు'...

'దాని మొకం.. అదట్లనే ఒర్రుతది బిడ్డా... మనజేతుల గిన్నిగనం పైసలెప్పు డుంటయిరా, అడ్ల పైసలొచ్చి నప్పుడేనాయె! రెండు మూర్డోలైతె ఎక్కడయక్కడ గడ్తం. అట్లా గట్టినంక మనకేం ఉంటయి. ఐదార్నెళ్లు కట్టవడ్తే అచ్చిన పైసల్ని నాలుగైదు సార్లనన్న లెక్కవెట్టుకోవద్దారా? కట్టాన్ని కండ్ల నిండా సూసుకోవద్దారా కొడుకా?' అని ఉల్టా నన్నే అడిగిండు.

తలుపూ, తాళం లేని ఇల్లాయె. బైరంగంగ వెడ్తే ఎవ్వడన్నా మాయంజేత్తడని బాపు ఉపాయం. అందుకే ఉన్నంతల నాలుగైదు అల్మారాలను తయారు జేసిండు. వందో, రెండు వందలో, మూడు వందలో... ఎన్నయితే అన్ని అమ్మ వెట్టిన కాడ ఉంచకవోతుండె. ఓసారి బియ్యం డబ్బల వెట్టేటోడు, ఓ సారి వరుకుల వెట్టి రేకుల కింద ఉన్న వాసం మీద వెట్టేటోడు... ఓసారి ప్లాస్టిక్ డబ్బాల వెట్టి ఎవ్వలికి కనవడకుండా వడ్ల కొట్టెల గుచ్చేటోడు.

* * *

ఎగిలివారంగ లేసిన నేను పన్లు తొముకొని, తానం జేసి వాళ్ల లొల్లినే సూత్తున్న ఎప్పుడాగుతదోనని. తాపకొగలు జమయితర్రు, ఇంటిముందల మంది పెరుగుతుర్రు గని పైసల్ మాత్రం దొర్కుతలెవ్వు. మజ్జాన్నం పన్నెండయి తంది. రేకుల సుట్టున్న ఇటుకలన్ని దీసిండు బాపు. అన్లకెళ్లి జెర్లు, కప్పలు, ఎర్రలెల్లుతున్నయి గని పైసలు మాత్రం ఎల్లలెవ్వు. రేకులవుతల ఉన్న ఇసుకను కిందిమీద బొర్రిచ్చుర్రు, కొట్టెలున్న వడ్లు గుమ్మరిచ్చిళ్లు గని కొత్తలెల్త లెవ్వు. దబ్బన కొట్టెల వెట్టంగ గినా కింద వడ్డయా

**తలుపూ,** తాళం లేని ఇల్లాయె. బైరంగంగ వెడ్తే ఎవ్వడన్నా మాయంజేత్తడని బాపు ఉపాయం. అందుకే ఉన్నంతల నాలుగైదు అల్మారాలను తయారు జేసిండు. వందో, రెండు వందలో, మూడు వందలో... ఎన్నయితే అన్ని అమ్మ వెట్టిన కాడ ఉంచక వోతుండె. ఓసారి బియ్యం డబ్బల వెట్టేటోడు, ఓ సారి వరుకుల వెట్టి రేకుల కింద ఉన్న వాసం మీద వెట్టేటోడు...

ఏందని కొట్టె జరిపి జూత్తే పందికొక్కు లెల్తున్నయి గని పైసలస్తలెవ్వు. సంచిలున్న బియ్యం మొత్తం ఎన్కులాడిర్రు గని ఏడ దొర్కుతలెవ్వు పైసలు.

'రాత్రి గినా దొంగలు వడ్డరో మన్నే... పోలీసోళ్లకైతే జెప్పుర్రి ఎందుకైనా మంచిదని' ఒగలంటున్నరు..

'దొంగలకెవలిల్లు దొర్కలేదా, వీళ్లదే దొర్కిందా..? అన్ని బొందలేనాయె ఇంట్ల పందికొక్కులు గుంజుకపోయి ఏ బొందల గుచ్చినయో తీ మీకు బాకీ లెవ్వు ఆ పైసల'ని ఒగలంటున్నరు. ఇగ నాకు వశపడుతలే. ఆ పోయిన పైసల కన్న పక్కకున్నోళ్లు 'ఛ్..ఛ్ అయ్యో పాపం..' అని సూపిత్తున్న జాలి, దయనే నాకిర్ర కోపాన్ని దెప్పిత్తున్నయి.

'నీయవ్వ పోతే పోనీ తియ్యిర్రె దండి పైసల్... నేన్ పెద్దవెర్గినంక మస్తుగ మా సంపాయిత్త తీయిర్ర'ని ఇంట్లున్న పిడ్కల సంచిని పిడికిలితోని గుద్దిన. దెబ్బకు కిందవడ్డది పిడ్కల సంచి కిందవడ్డదో లేదో అందరు పకపకా నవ్విర్రు. వాళ్ల నవ్వులను జూసి అమ్మాబాపు గూడ నవ్వవట్టిర్రు. ఎందుకు నవ్వుతున్నరా అని కిందవడ్డ పిడ్కలను జూసిన. పిడ్కల మజ్జెన తళతళా మెరుస్తున్నయి పైసల కట్టలు...

'అవ్... అవ్... ఆయిల్ల ఓ సీస కల్లువొట్టు ఎక్కువైండే. పైసల్ లెక్కవెట్టి పిడ్కల సంచిల వెట్టిన సంగతిని యాదిమర్శిన' అని బాపు నెత్తి గోక్కున్నడు.

కవిత



# ఈరోజు గడిచేలోపు



రవీంద్రసూరి నామాల, 98483 21079

నిన్నటిని తీసుకొస్తవా
రేపు జరగబోయేదాన్ని ఆపుతవా..!
నువ్వు ఏం చేయాలన్న ఈరోజే

ఇలా జరిగిందేంటని వెతుకులాటొద్దు అయ్యో..!
అలా జరగబోతోందాని బెంగపడొద్దు

పట్టింపులు, పంతాలకు స్వస్తి పలకాలి
తెలిసో, తెలియకో గతంలో చేసిన పాపాల పరిశుభ్రతకు,
పశ్చాత్తాపాలకు సరైన సమయం నేడు..

ఈరోజు గడిచేలోపు
మనిషిగా మారే అవకాశం ఉంది నీకు

నువ్వు ఆడిన అబద్దాలునిజం చేయడానికి ఓ గంట
మరో గంట గడిచేలోపు ఎదుటి వాడిపై
నీ కడుపు మంటను అణిచేయొచ్చు
నీ బంధువులను దూరం చేసుకుని
నిన్ను నువ్వు అమ్ముకొని
సంపాయించిన పాపపు సొమ్ముకు నిప్పంటించాలి
నిప్పుతో కాలితే ఇనుమే కాదు
ఇగో కూడా వొంగుద్దని నిరూపించే నీ రోజు ఇది

శత్రువులైన నీమిత్రులు
నిన్ను మనిషిగా గుర్తించడానికి
మరో అవకాశం ఈరోజు ఈరోజు నీది
దాన్ని గతం చేయడమా...
నీ పాత మనిషిని ఖతం చేసుకోవడమా
నీ చేతుల్లోనే ఉంది

రోజు రోజుకు ముంచేస్తున్న
అహం అణిగి పోయిందంటే నువ్వు పైకి లేచినట్టే

ఈరోజు నీలో ఉంది
ఛలో నిన్ను చంపేద్దాం
ఈరోజు గడిచేలోపు
కొత్త మనిషై మళ్లీ పుట్టొచ్చు

వ్యాసం

# తీరొక్క చేపల తిర్నాల

గుండెను కరిగించి పోత పూసిన
అక్షర పూదోట...



తుల శ్రీనివాస్
99485 25853

కులవృత్తిని కలం వృత్తిగా మార్చుకుని కవిత్వాన్ని శ్వాసిస్తున్న కవి మునాస్ వెంకట్. ప్రకృతితో అభేదం,జీవ కారుణ్యం, పసి పిల్లల నిర్మలత్వం, మనిషిని ప్రేమించే గుణం.. అన్నింటినీ కలగలిపిన ఓ మార్మిక మానవీయ అగ్నిపర్వతం. పంచభూతాలను శ్వాసించే, తపించే ధ్యానయోగి. గాలి నిశ్వాసం గలవాడు గనుకే మనకు సమకాలీను డయ్యాడు. అతని అక్షరాలు మట్టి మొలకలు. ప్రతి పదం పరమ పదం. వాక్యం ప్రాణాన్ని తడిమే భావ ప్రకంపనం.

పచ్చల సోమేశుడి సాక్షిగా తన ప్రాణాన్ని పానగల్లు చెరువుకు ముడుపుగట్టి చందమామలన్నింటినీ ఎదపరదాపై వెన్నెల విందుకు పిలిచి చేసుకున్న సాహిత్య పండగే ఈ చందమామలు.

**తాను చేపై ఎన్ని సముద్రాలను కలగన్నాడో.. తన లోపల చేపలకు అనంత సముద్రమై విస్తరించాడు. ఈ సుందర పద ప్రయాణంలో పాదాల కింద దాగిన గాయాల లోతులెన్నో కానీ..ఓ సూఫీ మంత్రమేసినట్టు, ఫకీరు తాయెత్తు కట్టినట్టు పాఠకుడి పంచేంద్రియాలూ బంధించి నిశ్శబ్దంగా ముందుకు సాగే పద మాంత్రికుడితడు.**

తాను చేపై ఎన్ని సముద్రాలను కలగన్నాడో.. తన లోపల చేపలకు అనంత సముద్రమై విస్తరించాడు. ఈ సుందర పద ప్రయాణంలో పాదాల కింద దాగిన గాయాల లోతులెన్నో కానీ..ఓ సూఫీ మంత్రమేసినట్టు,ఫకీరు తాయెత్తు కట్టినట్టు పాఠకుడి పంచేంద్రియాలూ బంధించి నిశ్శబ్దంగా ముందుకు సాగే పద మాంత్రికుడితడు. సందర్భం ఏదైనా భావంలో క్లుప్తత, గుప్తత, ఆర్ద్రత కలిపి చేసిన కనికట్టు విద్య ఇది.

ఇందులో బహుజన అస్తిత్వం ఉంది. వృత్తి కుల శోకం ఉంది. దళారీల దాష్టీకం ఉంది. దగాపడ్డ రైతు కథ ఉంది. రాజకీయ వ్యంగ్యం,భగ్న ప్రేమికుడి ఎదసడి.. ఇలా అన్నింటిలోనూ కవి హృదయ ఘోష తాత్వికంగా, తర్కబద్ధంగా గంభీర నిశ్శబ్ద శబ్దంగా వాక్యమంతటా అంతర్వాహినిలా ప్రవహిస్తుంది.

**ఆమెను చూశాకా**
**ఋతువు కాకపోయినా**
**చెట్లు పుష్పించాయి.**
**ఆమె సిగలోకి వచ్చి**
**మొగ్గలు పూలుపూసినయి.**

ఓ అమలిన ఆరాధన. నులివెచ్చని గిలి. ఇతని లోపలి ప్రకృతి నిత్య హరితం.

నీటి చందమామలపై మనసు చేసుకున్నట్టు నింగిలోని చందమామనూ నెత్తికెత్తుకు తిప్పాడు. అందుకే వెన్నెల వన్నెలు అద్దుకుంటాయి అక్షరాలు.

**వెన్నెల పట్టు చందమామ**
**ఎవరు ఇసిర్రో రాయి**
**ఆకాశమంత తేనెటీగల్లా నక్షత్రాలు**

**రాత్రి చందమామ చర్ల పడ్డది**
**పొద్దున ఎంత ఎతికినా**
**కనబడలేదు.**

**చంద్రున్ని, చుక్కల్ని, ఆకాశాన్ని**
**ఎవరో ఈ రాత్రి**
**చెరువులో చిత్రించారు.**

**ఆరు బయట నులక మంచం**
**నాకంటే ముందే**
**వెన్నెల పడుకొని ఉంది.**

రస సిద్ధికి పరాకాష్ట చివరి వాక్యాలు.

ఎవ్వరికీ ఏమీ చెప్పలేని నోరులేని చేపలు తమ ఎద చింతను కవికెంతలా చెప్పి ఉండకపోతే వాటి దుఃఖానికి దిక్కు దెశై తన గొంతునిస్తాడు.

**ఈ రాత్రి భయమయింది**
**దరి లేని చెరువును**
**చాపలు కలగంటాయని.**

**ఇడదీయలేం**
**నీళ్ల నుండి చాపలకన్నీళ్లు.**
**నీళ్లైటన్నా పోతాయేమోనని**

**భయానికి చాపలు**
**నీళ్లంటే తిరుగుతున్నాయి.**

చెరువే తెరువైన మత్స్యకారుల జీవితాలు దళారి వలలో చిక్కి గిలగిలా కొట్టుకుంటున్న వైనాన్ని గాలం ముల్లై గుండెకు గుచ్చుతాయి ఈ అక్షరాలు.

**దళార్లను చూసి**
**బెస్తల మీద**
**కొంగకు కూడా జాలేసింది.**

**చెరువు ఒడ్డున పెద్ద కొంగ**
**చాపలు తెగ మింగుతోంది**
**హౌరాకు పోయే లారీ.**

దేశపు ఉనికే కాదు దేవుడి ఉనికి కూడా రైతు శ్రమ ఫలమేనని నిందాస్తుతి రూపంలో రాముడిపై విసిరిన వ్యంగ్యాస్త్రం.

**నీ ప్రసాదం పులిహోర దద్దోజనం**
**రైతు పుణ్యమే కదా రామా**

ఎద్దు ఏడ్చిన ఎవుసం రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడ్డ దాఖలాలు లేవన్నట్టు హెచ్చరిస్తాడు.

**నీ పిండాకూడు కూడా**
**రైతు చెమటే**
**చచ్చినా పచ్చి ముట్టదు.**

**ప్రకృతికి ఓ నియమం ఉంది. ప్రతి జీవికీ ఓ పద్ధతి ఉంది. దేని లెక్క దానికుంది. నీతిదప్పిన మనిషి చేసే స్వార్థపు గాయాలకు లేపనం రాసుకుంటూ ప్రకృతి నిత్యం తనకు తాను చికిత్స చేసుకుంటూనే ఉంది.**

ఏలికలు ఎందరు మారినా రాజ్యమెప్పుడూ రైతు ఉసురు పోసుకుంటూనే ఉంది. సింగిడికి రంగులద్దే ఈ వాక్యాలొకసారి పరికిద్దాం.

**పిల్లలు హెూలీ ఆడిపోయిండ్రు**
**ఎంత కడిగినా**
**నా లోపలి రంగులు పోలే.**

అమ్మ త్యాగాన్ని ఉన్నతీకరించి చెప్పిన ఈ రెండు వాక్యాల కావ్యం చూడండి.

**జెల్లపిల్లలమ్మే అమ్మ**
**పిల్లజెల్లల కోసం**
**చెరువయింది**

రక్త సంబంధాలు సైతం రక్తపాతం అవుతున్న నేటి సమాజంలో ఇంటి ఆడబిడ్డల ఆరివారాన్ని అందంగా అల్లిండు.

**విత్తనాలు వేసి పోతూ పోతూ**
**ఇంటి ఆడబిడ్డలు**
**ఆత్మల్ని అంటుగట్టి పోయిండ్రు.**

కవి భావ వైశాల్యానికి కొన్ని మచ్చుతునకలు.

**తన పిల్లల కోసం**
**రేపటి చెట్టును మోసుకొచ్చింది**
**గింజను జార విడుస్తూ పక్షి**

**పక్షి దిగాలుగా ఎగురుతుంది**
**నిన్న వాలిన చెట్టు**
**కనిపించడం లేదని.**

ఈ పదకూనలను కనడానికి కవిపడ్డ ప్రసవ వేదనెంతో..

ప్రకృతికి ఓ నియమం ఉంది. ప్రతి జీవికీ ఓ పద్ధతి ఉంది. దేని లెక్క దానికుంది. నీతిదప్పిన మనిషి చేసే స్వార్థపు గాయాలకు లేపనం రాసుకుంటూ ప్రకృతి నిత్యం తనకు తాను చికిత్స చేసుకుంటూనే ఉంది. తన కన్నీళ్ళ గాఢత ఎంత విహ్వాలంగా ఉంటుందో కాలపుటలు కొన్ని తెలియపరుస్తున్నప్పటికీ మనిషెందుకో స్వల్పకాలిక మతి భ్రమణుడవుతున్నాడు.

మనిషి మనిషిగా జీవించినప్పుడే ప్రకృతితో పాటు పశుపక్ష్యాదులూ సంతోషంగా ఉంటాయి.సుఖాలను మోహించి, అవయవాలకు బానిసై, అహంతో ప్రజ్వరిల్లే వాడెప్పటికీ సముద్రపు అలల సౌందర్యాన్ని ఆస్వాదించలేడు. పర్వతాల పరిమళాన్ని ఆఘ్రాణింనించనూ లేడు. సాటి మనుషుల్ని ప్రేమించలేడు. జీవ కారుణ్యాన్ని పారించలేడు. మనిషి ఒక యంత్రమై, అవయవాల కూర్పే తనకు నిర్వచనమైన ఈ సాంకేతిక యుగంలో మునాసు గారి మనసు నుండి వెన్నెల చినుకులై పోటెత్తిన చందమామలు ఓ మానవీయ తెరపై మన ప్రతిబింబాలను మరింత సౌందర్యాత్మకంగా, దయాపూరితంగా ప్రతిబింబిస్తాయనడంలో సందేహం లేదు. గుండెను కరిగించి పోత పోసిన ఈ అక్షర పూదోటలో సీతాకోకలై మనమూ విహరిద్దాం. బ్రతుకుకి ఇంకొంత పరిమళమద్దుకుందాం.

## చందమామలు



మునాసు వెంకట్

కథ

# అపాత్రదానం

కొడుకు అసలు రంగు, దైన్యాన్ని మిగిల్చిన కథ....



కటుకోజ్వల మనోహరాచారి
94410 23599

తెల్లటి మల్లెపూవులాంటి ప్యాంటు మీద ఎర్రపూల షర్ట్ టక్‌చేసుకొని తండ్రి ఎదురుగా నిలబడి అలవాటుగా చేయి చాచాడు సూర్యం.

లింగమూర్తికి తప్పిందికాదు. లోచెడ్డీకి ప్రత్యేకంగా కుట్టించుకున్న జేబులోంచి ఓనోటు తీసి అందించాడు. రోజూ కొడుక్కి వందనోటు అందిస్తేగాని ఉద్యోగానికి వెళ్లిరాలేడు సూర్యం.

వందనోటు అందగానే "వెళ్లొస్తా డాడీ..." అంటూ బయటకు అడుగు పెట్టాడు సూర్యం. ఇంటి బయటకెళ్లగానే ఎవరో బైక్ మీద సిద్ధంగా ఉన్నారు. సూర్యం వెనక కూర్చోగానే బైక్ రయ్యిన వెళ్లిపోయింది. పక్క మండలంలో ఏదో స్కూల్లో కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్‌గా చేస్తున్నాడు సూర్యం. జస్ట్ నెలరోజులవుతుంది.. అంతే! ఇంకా నెలజీతం కూడా రాలేదు. రోజూ బస్‌లో వెళ్లిరావడానికి తగిన బస్‌చార్జి తండ్రి జేబులోంచి ఇవ్వాల్సిందే!

లింగమూర్తికి కొడుకు సూర్యం బయట ఉద్యోగం పేరుతో నానా కష్టాలు పడుతున్నాడేమోననే సానుభూతి ఎక్కువ. అందుకే తను ఇప్పటికి పది ఉద్యోగాలు మానేసినా పెద్దగా పట్టించుకోలేదు. అసలు ఏపనీ చేయకుండా ఇంట్లో కూర్చున్నా అన్నీ సమకూర్చిపెట్టే ఓపికా, సహనం తండ్రికి ఉన్నాయి. నలుగురూ నాలుగు మాటలంటున్నారని కొడుకును ఏదో ఉద్యోగంలో స్థిరంగా చూడాలనుకొంటున్నాడు గాని.. ఆ ఆశల్ని ఆశలుగానే మిగల్చుతున్నాడు సూర్యం.

లింగమూర్తి రిటైర్డ్ టీచర్. పెద్దగా ఆస్తులున్నోడేమీకాదు. ఇద్దరు కూతుళ్లుంటే వాళ్లకు ఎప్పుడో పెళ్లిలు చేసేశాడు. ఉన్న ఒక్క కొడుకూ చదువులో పెద్దగా రాణించకపోయినా అంతగా బాధ పడలేదు కాని, నలుగురి మాటలకు నామోషీగా ఫీలయ్యాడు. తండ్రి బాధకో, నలుగురి దాడికో డక్కామొక్కీలు తింటూ డిగ్రీ పూర్తయిందనిపించాడు సూర్యం. డిగ్రి ఫీజు కడుతున్నానంటే డబ్బులివ్వడం, పరీక్షలు రాస్తున్నానంటే బస్ ఛార్జ్ లివ్వడం తప్ప లింగమూర్తికి అసలు కొడుకేం చదువుతున్నాడో పట్టింపు లేదు. కొడుకు డిగ్రీ పాసయ్యానంటే సంతోషపడడం, స్వీటుకు ఐదొందలివ్వమంటే ఇవ్వడంతప్ప అతని సర్టిఫికెట్ చూసిన పాపాన పోలేదు.

అప్పటికే వయసు ముదిరింది కాబట్టి సూర్యం ఇంటిపట్టున ఉండి తింటుంటే నలుగురూ నాలుగు మాటలనడం మొదలు పెట్టారు. సరైన చదువులేదు. ఉద్యోగం లేదు. ఎంతకాలం కొడుకును మేపుతావని నలుగురూ నస పెడుతుంటే ఆనస భరించలేక కొడుకును ఏదోఒక ఉద్యోగం చూసుకొమ్మని ఒత్తిడి చేశాడు లింగమూర్తి.

ఇంటర్వ్యూల పేరుతో ఊళ్లమీద పడ్డాడు సూర్యం. ఏదో ఉద్యోగానికి వెళ్తూ రోజూ తండ్రి దగ్గరనుండి వందరూపాయలు బస్‌ఛార్జిల పేరుతో వసూలు చేసేవాడు. అతనికి ఇంకొకరు ఉద్యోగాలు వెతకాల్సిన పనిలేదు. ఏ ఉద్యోగమైనా తనే వెతుక్కొంటాడు.

కొంతకాలం ఏదో ప్రైవేటు స్కూల్లో టీచర్‌గా చేస్తున్నానన్నాడు. ఆతర్వాత అది మానేసి బ్యాంకులో క్లర్కుగా చేరానన్నాడు. అందులో జీతం సరిగా ఇవ్వడం లేదని చెప్పి మానేశానన్నాడు. తర్వాత ప్రింటింగ్ ప్రెస్‌లో చేస్తున్నానన్నాడు. ఆ తర్వాత ఆర్టీసీ డిపోలో మెకానిక్‌గా జాయినయ్యానన్నాడు. అదీ మానేసి స్కూల్లో కంప్యూటర్ ఆపరేటరన్నాడు. తర్వాత బి.ఇడి. కాలేజిలో లెక్చరర్‌నన్నాడు. ఇలా ఎన్ని ఉద్యోగాలు చేశాడో!

అయితే ఇందులో విశేషమేంటంటే.. తను చూసుకున్న ఏ ఉద్యోగమైనా సరే వేరే ఊళ్లలో చూసుకున్నాడు తప్ప, ఉన్నఊరు పట్టణమైనా ప్రయత్నించలేదు. ఉద్యోగం మార్చిన ప్రతిసారీ ఇంటర్వ్యూకు ఐదొందలు కావాలి. రోజూ వెళ్లిరావడానికి బస్‌ఛార్జ్ కావాలి. ఏ ఉద్యోగానికి ఎంత జీతమొచ్చిందో, ఎన్నిసార్లు వచ్చిందో, అసలు వచ్చిందో రాలేదో లింగమూర్తికి తెలియదు. ఆయన అడగరు. తల్లో,

మేనమామలో, పక్కింటివాళ్లో అడిగితే జీతం సతాయిస్తున్నారనో, ఆర్నెల్లది ఒకేసారి ఇస్తారనో, సంస్థ లాసుల్లో నడుస్తుందనో, తాను తర్వాత తీసుకుంటా నన్నాననో.. ఇట్లా ఏవేవో కారణాలు చెప్పేవాడు. ఈలోపు ఆ ఉద్యోగం మానేశాను అనేవాడు. ఈలెక్కన అసలు సూర్యం నెలజీతాన్ని లింగమూర్తి కళ్లజూసింది లేదు. ఆమాటకొస్తే సూర్యం కూడా చూశాడో లేదో!

★ ★ ★

ఉద్యోగానికి వెళ్లిన సూర్యం సాయంకాలం ఆలస్యంగా ఇంటికొచ్చాడు అదోలాంటి వాలకంతో. అడుగులు ఎత్తి ఎత్తి వేస్తూ నేరుగా వంటింట్లికెళ్లి "అమ్మా అన్నం పెట్టు" అన్నాడు.

"ఇప్పుడే వచ్చావుగా! బయటకెళ్లి కాళ్ళు చేతులు కడుక్కోనిరా.." అంది తల్లి.

తడబడుతూనే వెళ్లి కాళ్లుచేతులు కడుక్కొచ్చాడు.

"మళ్లీ తాగొచ్చినవా?" భోజనం చేస్తుంటే లింగమూర్తి అడిగాడు.

"తాగుడా...! ఛీ లేదు. ఎవరు చెప్పారు నీకు."

ప్రతిసారీ తండ్రి ఆమాట అడగడం.. సూర్యం తిరిగి అదే సమాధానం చెప్పడం సర్వసాధారణమైంది.

ఉద్యోగం పేరుజెప్పి ఊళ్లేలుతున్నాడో.. ఊరమ్మడి గొడ్డులా తిరుగుతున్నాడో గుర్తించే ఓపికా, సత్తా లింగమూర్తికి లేదు. రోజూ సాయంకాలానికి దీపాలు పెట్టే వేళకి అపసోపాలు పడుతూ రావడం! అడుగులు తడబడినా, మనిషి తుల్లిపడినా మర్మం గ్రహించని తండ్రి, మాట బయటకు పొక్కనీయని తల్లి అతనికి ఒకరకంగా రక్షణ కవచాలయ్యారు.

ఇంట్లో అవసరాలకు పదిరూపాయల వస్తువు సొంత చేతుల్తో కొనలేకపోయినా, ఇంటినుండి మాత్రం ఏ అవసరాలకైనా రాబట్టడంలో ఘనాపాటి సూర్యం. పర్సెంటేజ్ పొందకుండా ఇంట్లోకి ఏవస్తువూ కొనుక్కురాలేడు. చివరకు తండ్రి డబ్బులిచ్చి మందులు కొనుక్కు రమ్మన్నా అందులో పర్సెంటేజ్‌తో పాటు, పుక్కిడికొచ్చిందేగదా, ఒంట్లో దేనికైనా పని చేయకపోతుందా అని అవసరం లేకపోయినా నాలుగు మాత్రలు మింగి, ఇంత టానిక్ గొంతులో ఒంపుకొని మరీ మూతలు బిగించి ఇచ్చేసేవాడు. అదీ సూర్యం విశిష్టత.

ఇహ లాభం లేదనుకొని మేన మామలు, ఇతర బంధుమిత్రులంతా కల్సి సూర్యానికి ఓ జోడీ తగిలించారు. పెళ్లైతే తిక్కకుదురుతుందని, బాధ్యతలు తెలిసొచ్చి బుద్ధిగా ఏదోఒక పనిలో స్థిరపడతాడని నలుగురు నాలుగు వైపుల్నుండి లింగమూర్తికి ఉద్బోధించారు. లింగమూర్తికి కూడా ఈవాదన సరైందిగానే తోచింది.

అందరూ కల్సి అంతకుతగ్గ గంతలా ఓ బొంతను వెతుకులాడి పెళ్లి చేశారు. అతన్నేదో ఉద్ధరిద్దామనుకున్నారే గాని ఓ అమాయకురాలి గొంతు కోస్తున్నామనుకోలేదు. సూర్యంలో ఎలాంటి మార్పు లేదు. ఇప్పటికీ లోచెడ్డీ చిరిగిపోయినా తండ్రివద్ద వంద వసూలుచేసి యాభైతో చెడ్డీ కొనుక్కొంటాడు. మరో యాభైతో ఈత వనానికో, తాటి వనానికో పయనమవుతాడు.

విశేషమేంటంటే ఇంతకుముందు లింగమూర్తి కొడుకొక్కడి బాగోగులు చూసుకునేవాడు. ఇప్పుడు కోడలు, కోడల్తోపాటు మనవడి అవసరాలూ చూసుకోవాల్సి వస్తుంది.

రిటైర్డ్ అయ్యాడుకదా! ఎట్లాగూ ఏపనీ లేదు. మనవడు మనవరాళ్లతో ఆడుతూ పాడుతూ గడిపేద్దామంటే మనవడికి బేబీసోపు, కోడలికి బొట్టుబిళ్లల్తో సహా కొడుక్కి గడ్డం గీసుకోవడానికి బ్లేడు వరకు సమకూర్చాల్సి వస్తుంది లింగమూర్తికి.

ఇక సూర్యానికేం! తిండి బట్టా, అవసరానికి చిల్లరా ఇంట్లో దొరుకుతుంది. ఏదో ఉద్యోగం పేరుజెప్పి రోజూ ఛార్జిల పేరుతో వసూలుచేసే వందతో ఫ్రెండ్స్‌తో మందు కొట్టొచ్చు. ఇంకా అవసరానికి డబ్బు సరిపడకపోతే ఇంటర్వ్యూల పేరుతో, ఉన్నత చదువులకు ఫీజుల పేరుతో రాబట్టడానికి తండ్రి ఎలాగూ ఉన్నాడు. అయినా డబ్బులు సరిపడక పోతే ఇంట్లో అదనంగా మూలనపడి కనిపించిన వస్తువులు చాలానే ఉన్నాయి. వాటికి మోక్షం లభిస్తుంటుంది. అప్పుడప్పుడు తల్లిదండ్రులు వేరే ఊళ్లకు వెళ్లివచ్చేసరికి వంటింట్లో పప్పుడబ్బాల్లో పప్పులు, బియ్యండబ్బాల్లో బియ్యం అడుగంటినా ఆశ్చర్యపోవాల్సింది లేదు. లింగమూర్తి భారంగా నిట్టూర్చాడు.

★ ★ ★

ఉదయం తొమ్మిది కూడా కాలేదు.

బూడిదరంగు చెక్స్ మీద నల్లరంగు ప్యాంటు టక్ చేసుకుంటూ తండ్రి ముందు నిలబడ్డాడు సూర్యం. యదాలాపంగా చేయిచాపాడు. తండ్రి అలవాటుగా లోచెడ్డీ నుండి వందనోటు తీశాడు. లోచెడ్డీలోనే డబ్బులు ఎందుకు దాచుకోవాల్సి వస్తుందంటే.. ఇంట్లో దొంగలెవరూ లేకపోయినా, డబ్బులు ఎక్కడ పెట్టినా కనిపించవు మరి.

వందనోటు అందించబోతుంటే "ఐదొందలు.." అన్నాడు సూర్యం.

లింగమూర్తి విస్తుబోతూ "ఎందుకూ..?" అన్నాడు.

"ఇంటర్వ్యూకు వెళ్తున్నాను."

"అదేంటీ..?!"



“అవును. కరీంనగర్‌లో ఓ బి.ఇడి కాలేజీలో ఫ్యాకల్టీకి అప్లై చేశాను. వాళ్లు ఇంటర్వ్యూకి రమ్మన్నారు.”

“మరి పాత ఉద్యోగం..?!”

“అది నిన్ననే మానేశాను”

లింగమూర్తి నోరు వెళ్లబెట్టి అలా చూస్తూనే ఉండిపోయాడు. నెల పూర్తిగా నిండిందో లేదో.. జీతం ఇచ్చారో లేదో తెలియదు. అసలు ఇన్నాళ్లు ఉద్యోగానికి వెళ్లాడా, రోజూ జల్సాగా తిరిగిరావడానికి వెళ్లాడా కనుక్కునే ప్రయత్నం చేయలేదు లింగమూర్తి.

మారుమాట్లాడకుండా ఐదొందలు తీసి ఇచ్చాడు. అది జేబులో కుక్కుకొంటూ బయటకు నడిచాడు సూర్యం.

రిటైర్డ్ టీచరే అయినా కొడుకు ఏయే ఉద్యోగాలు చేస్తున్నాడు, ఎందుకు మానేస్తున్నాడు అని పట్టించుకునేంత ఓపికలేదు లింగమూర్తికి. అసలు తను చదివిన చదువుకి, బి.యిడి కాలేజీలో ప్యాకల్టీకి ఎంతమేరకు సంబంధం ఉందోకూడా ఆలోచించడం లేదు.

★ ★ ★

బావమరిది లింబాద్రి ప్రవేశించేసరికి లింగమూర్తి విచారంగా కూర్చొని కనిపించాడు.

“ఏమైంది బావా! అట్లా ఉన్నావు?” అన్నాడు లింబాద్రి ఎదురుగా సోఫాలో కూర్చుంటూ.

లింబాద్రిని చూడగానే కాస్త తేలికపడ్డట్లు అయ్యాడు లింగమూర్తి. “రా బామ్మర్ది.. రా! సమయానికొచ్చావు” అన్నాడు.

“ఎటో వెళ్లడానికి రెడీ అయినట్టున్నావు బావా ?”

“అవును! కరీంనగర్ నుండి సూర్యంగాడు మళ్లా తట్టాబుట్టా సర్దుకొని తిరిగి వచ్చేస్తున్నాడు...”

“సంతోషమేకదా! నీ కళ్లముందటే ఉంటాడు. అయినా.. దానికి నువ్వు పెళ్లి కొడుకులా తయారుకావడం ఎందుకు? స్వాగతించడానికా?”

“మూడు నెల్లనుండి వాడి గదికి అద్దె కట్టలేదట. వెళ్లి కడితేగాని వాన్ని ఖాళీ చేయనిచ్చేలా లేరు..”

“ఉద్యోగం చేస్తున్నాడుగదా! వాడి రూమ్‌కు అద్దె వాడే కట్టుకోవాలి మరి. ఇంతకూ ఏమైందట..??”

“ఏమవుతుంది... మళ్లీ ఉద్యోగం మానేశాడట..”

“ఏ ఉద్యోగం..?”

“అదే... అదేదో బి.ఇడి కాలేజీలో...” నసుగుతన్నట్టుగా అన్నాడు లింగమూర్తి.

“అసలతడు ఆ కాలేజీలో ఉద్యోగం వెలగబెడితేకదా... మానేయడానికి..”

“అదేంటీ..? మూన్నెల్లుగా వెళ్తున్నాడు గదా!”

“అవునా?? ఎంత జీతం ఇచ్చారట కాలేజీవారు..? ఇంట్లోకి ఎంత సర్దుబాటు చేశాడేంటి..కొడుకు?”

“అదేంటి బామ్మర్దీ...”

“మరదే..! వాడసలు ఇంతవరకు చేసిన ఉద్యోగాలు నిజంగానే చేశాడనుకుంటున్నారా?”

“మరి..?!

“వాడికసలు పనిచేయడమే ఇష్టం లేదు. ఇంతవరకూ మన చెవుల్లో... ముఖ్యంగా తల్లిదండ్రులైన మీచెవుల్లో పెట్టిన పూలన్నీ నిజమే! వాడు ఇప్పటివరకు ఏ ఉద్యోగమూ చేయలేదు..”

“అంత కచ్చితంగా ఎట్లా చెబుతున్నావు బామ్మర్దీ!”

“వాడు పనిచేశానని చెప్పిన అన్నిచోట్లా ఎంక్వైరీ చేశా..”

లింగమూర్తి విస్తుబోయి చూస్తూ “మరి.. మరి నాలుగేండ్లుగా మార్చిన ఉద్యోగాలు, రోజూ బస్ ఛార్జిలు.. ఇవన్నీ...” గొణుగుతున్నట్టుగా అన్నాడు.

“అన్నీ ఉట్టివే! తాగనీకి, జల్సాలకి డబ్బులు కావాలిగా...! అదో డ్రామా! నీ కొడుకు డ్రామా కంపెనీలో చేరితే ఇప్పటికి పెద్ద నటుడిగానైనా గుర్తింపు పొందేవాడు”

“డ్రామా ఎందుకు? నిజంగానే ఏదోఒక పని చేసుకోవచ్చుకదా!”

“పని ఎందుకు చేస్తాడు బావా?? నువ్వున్నావుగదా! వాడి ఇంటి కిరాయి కట్టడానికి, ఎక్కడుంటే అక్కడికి బియ్యం బస్తాలు, పప్పు, ఉప్పులు మోయడానికి. గడ్డం గీసుకునే బ్లేడుతో సహా కొనియ్యడానికి??”

“అయితే..?!”

“అదంతే! అన్ని అవసరాలూ తీరుతున్నప్పుడు మనిషికి పనిచేయాలనే కోరిక ఎందుకు కలుగుతుంది? ఆకలవుతున్నప్పుడే కదా.. ఆహారం కొరకు వేట మొదలయ్యేది. కళ్లముందు సిద్ధంగా ఆహారంతో పాటు అవసరాలకు సరిపడా అన్నీ అందించేవాళ్లున్నప్పుడు ఇంక వేట ఎక్కడిది? కష్టపడే తత్వం ఎక్కడిది?? అన్నీ అందుబాటులో అమర్చిపెడితే ఇక మనిషి పనెందుకు చేస్తాడు..? సోమరిపోతు అవుతాడుతప్ప?! ప్రభుత్వాలిచ్చే పుక్కిడి పథకాలకు కూడా సామాన్యుడు ఇలాగే తయారవుతాడు మరి. మనిషికి ఒక వయస్సు వచ్చేవరకే అవసరాలు తీర్చాలి. ఎన్నేళ్లొచ్చినా, పెళ్లాం పిల్లలు కలిగినా..వాడికీ, వీడికీ చెడ్డీల్తో సహా అన్నీ నువ్వే సమకూర్చుకుంటూ పోతే... ఇక తనకోసం తాను కష్టపడే అవకాశం ఎక్కడిది??” కాస్త ఆగాడు లింబాద్రి. “నువ్వు చేస్తున్నది అపాత్రదానం బావా..”

లింగమూర్తి సాలోచనగా చూస్తుండిపోయాడు.

ఆయన సంశయాలు మందుతో కమ్మిన మత్తులా మెలమెల్లగా విడిపోవడం మొదలెట్టాయి. ఇంతకాలం బామ్మర్దిగాడు ఈ మాటల్ని గుర్తుచేయలేదెందుకో అనుకొన్నాడు. నిదానంగా కొడుకు విషయంలో ఇకనుండి ఏంచేయాలో ఒక స్పష్టత వస్తుంటే, అతని అవసరాలు తీర్చేందుకోసం సిద్ధమైన లింగమూర్తి లోనికివెళ్లి డ్రెస్ విప్పేసి వచ్చాడు. హాయిగా లుంగీ కట్టుకొని ఇంటివెనక మామిడిచెట్టు కిందకు దారితీస్తూ “రా బామ్మర్ది..” అన్నాడు.

“ఎందుకు..?”

“విందుకు.”

పరిష్కారం చూపిన పరంధాముడిలా కనిపిస్తుంటే బామ్మర్ది లింబాద్రితో హాయిగా మందు విందుకు కూచున్నాడు లింగమూర్తి.

కవిత

# కోడి పందాలు ఎదురు చూడకు!



వనపట్ల సుబ్బయ్య, 94927 65358



నా నగారాకే
ఆకాశ మంచు గుహల్లోని సూర్యుడు
దిగ్గుదిగ్గున నిద్రలేచేది
నా స్వరాలే
ఊరుకు తొలి వెలుగు
నాగరికతకు తొలి ప్రభాత భేరి

భూమంతా గాలించి గాలించి
మట్టి కుప్పల్ని పొడిసి పొడిసి
గింజగింజతో నా బిడ్డల్ని ఎలా సాదిననో
శత్రవునుండెట్లా రక్షించుకోవాల్నో
నా విద్యనే మీరు వంటబట్టించుకుంటిరి
సంసార సాగరాన్ని ఈదే మెళకువల్ని
నా నడక నుండే జ్ఞానం పొందితిరి
నేల కాళ్ళకు నేనే తొట్ట తొలి తోవను

నాపలుకుల సరిగమలే
సంగీత సామ్రాట్టుల స్వప్తస్వరాలు
నా రెక్కల చప్పుళ్ళే
వాయిద్యకారుల దరువులు

లంకంత ఇంటిముందు
గుర్రుగుర్రున గురుకతో
సోయిలేకుంట వాకిట్లో నిద్రపోతే
పురుగు బూసొస్తే పసిగట్టి
పరిసరాలపట్ల ఎరుక చేసి జాగృత పరిస్తి
దొంగలు దుండగులొచ్చినా
అలారమై నిద్రలేపిన
నిత్యం నీడై తోడున్న

నీ ఇంటికి కాపలైనా ఎన్నడు
గంటెడు జాగడగలే గజం చీరడగలే
నీవు తిన్నంక చల్లిన ఎంగిలి మెతుకుల్నే
తిని నీకు నీ సుట్టానికి కమ్మని విందైన
ఆత్మ గౌరవానికి ప్రతీకను

పులిలాంటి మనుషులై
కొర్రమట్టల మీసాల మీద
నిమ్మకాయల్ని నిలబెడ్తుంటే

సై సై సైరా అనుకున్నా
మీ బాహుబలి తనాలంతా వొట్టివే

పౌరుషాల పేరుతో
విలాసాల దూకుడుతో
నా కాళ్ళకు కత్తులు గట్టి
ఈలలేసి జబ్బలు చరిసి
పందాల పేరున లక్షలరూపాయలు
ఒడ్డుతుంటే జాలేస్తున్నది
మీ రోసాల్ని చూసి సిగ్గుపోతున్నది

నీకెన్ని ఆస్తులుంటేం
నీ కెన్ని వికాసాలు వికసిస్తేం
నీవెన్ని మీటర్ల పొడవు నిలిచి
ఎన్ని కిలోల కండల్లో ఊరేగితేం
నీవు ఒక పిరికి పందవు
నీవు ఒక అనాగరికుడవు

ఓ మనిషీ!
నీ కాళ్ళకు కత్తులు గట్టే రోజుకు
ఎదురు చూడకు!

వ్యాసం

# కాలంతో స్త్రీ కథ...

**స్త్రీల ఉద్యమానికి కథలు ఏ విధంగా మూలమయ్యాయో చెబుతున్న వ్యాసం...**



**మినుకూరి శ్రీనివాస్ రెడ్డి**
92469 23477

20వ శతాబ్దం కథావరణంలో వికాస దశకు చేరింది. ప్రధానంగా 20వ శతాబ్దం చివరి రెండు దశకాల్లో సమాజం పట్ల, ఆ సమాజంలో ప్రాధాన్యత వహిస్తున్న స్త్రీల పట్ల కొత్త కోణంలో ఆలోచనలు విస్తరించాయి. 1960 తరువాత మహిళా నవలాకర్తలు అధికమైనట్లే 1990 తరువాత తెలుగు సాహిత్యంలో స్త్రీ కథకుల శాతం పెరిగింది.

పైన పేర్కొన్న కాలంలో స్త్రీవాద, దళిత వాదాల పరిశీలన, వాటి తాలూకు విజయాలు, వైఫల్యాలు రెంటినీ కథావరణంలో కథా రచయిత్రులు గుర్తించి సమస్యల పట్ల స్పందించడమే కాకుండా వాటికి పరిష్కార దశలో కథలు వ్రాశారు. సంస్కృతి లోని భాష, సంప్రదాయాల వంటి అంశాలు జండర్ స్పృహలో స్త్రీగానో, పురుషునిగానో వర్గీకరించి నిర్ధారించే ప్రయత్నం చేశారు మహిళాకథకులు. ప్రధానంగా స్త్రీలు ఎదురుగానే సమస్యలను గ్రామీణ, నగర కోశాల్లో పరిశీలించిన వైనాలనేకం మహిళాకథకుల్లో చోటుచేసుకున్నాయి.

మహిళాకథకులు గుర్తించిన సమస్యలలో స్త్రీ లైంగికత ప్రాతినిధ్యం వహించింది. కారణాలను పరిశీలించే కోణంలో సమాజంలో విచ్చలివిడితనానికి ప్రతీకగా వున్న కామం (పురుషార్థాలు నాల్గింటిలో ఒకటైనది) ధార్మిక వాంఛను పక్కన పెట్టి దేహ వాంఛ పరితుష్టతకు ప్రాధాన్యం యిచ్చిన కారణంగా ఒక జండర్ పరంగా అధిక్యతలో వున్న బలవత్తర వర్గం స్త్రీలకు రక్షణ లేకుండా చేసింది. దీనిపై ఏవి ప్రభావం చూపాయంటే ఒకటని చెప్పలేం కానీ అన్నికోణాలు పరిస్థితులు పురుషాధిక్య సమాజానికి వెన్నుదన్నుగా నిల్చాయి. వీటిపట్ల ఆగ్రహం అనండి, లేదా సానుభూతి అనండి లేదా తపన అనండి అవి ఏవైనా స్త్రీలను ఉద్యమించేలా చేశాయి. స్త్రీ ఒక యంత్రం కాదు, ఆమెకూ ఆలోచన వుంది అన్న గుడిపాటి వెంకటాచలం గారి మాటను నిజం చేస్తూ స్త్రీలే కలం పట్టి ఉద్యమించడం జరిగింది.

ప్రధానంగా 1990-2010 మధ్య కాలంలో చోటుచేసుకున్న కథలు స్త్రీల పరంగా వారి సమస్యలకు వారే పరిష్కారం సూచించుకునేస్థాయికి ఎదిగేలా చేశాయి. ఈ సందర్భంలో విశ్వాన్ని మింగేసిన ప్రపంచీకరణ అందించిన లాభాల మాట ఆలావుంచి నష్టాలకు, కష్టాలకు అలవాలమైంది. ఈ విషయాన్ని వేగంగా గుర్తించి కథా నేపథ్యంలో అందించిన రచయిత్రులు ఎక్కువ కావడం జరిగింది. ఈ ప్రపంచీకరణ ఎలామారిందంటే కేవలం నగర, గ్రామీణ సమజాలపైనే గాక దండకారణ్యంలోని ఆదివాసీలపై అమలౌతున్న రాజ్యహింసలు స్త్రీలపై (ఆదివాసీ స్త్రీలపై జరుగుతున్న క్రూర హింసల వ్యక్తీకరణలు కూడా కథలుగా వెలుగుచూశాయి).

**ఈ విషయంలో ప్రధానంగా గిరిజన సమాజంలోని స్త్రీల అగచాట్లు కూడా కథలుగా వచ్చాయి. దానికి ప్రత్యక్ష ఉదాహరణ వాడ్రేవు వీరలక్ష్మి గారి 'కొండ ఫలం' కథ. ఈ కథలో 'సీతాలు' అనే గిరిజన స్త్రీ భూమి పరంగా మోసపోయిన వైనాలను వీరలక్ష్మి గారు తెలియజేశారు.**

అలాగే మహిళాకథకుల ఆలోచనలు సమాజానికి మూలబిందువైన కుటుంబం దాని తాలూకు వైరుధ్య పరిణామాలను కథకురాండ్రు ఇతివృత్తాలుగా స్వీకరించారు, కథలందించారు. అంటే కథకులు సమకాలీన వర్తమాన సమాజంలోని వివిధ కారణాల వల్ల వస్తున్న అస్పష్టతలను (సమస్యలను) సామాజిక బాధ్యత, సామాజికస్పృహ నేపథ్యంలో కథలందించారు. "జీవితం అనే మూడక్షరాల్లోంచి కథ అనేది రెండక్షరాలుగా చోటు చేసుకుంది". అన్న రావి శాస్త్రి గారి కథా నిర్వచనం కథకు కొత్తజీవాలందించింది.

పరిణామక్రమంలో పురుషులపైశాచిక లైంగిక విధానాలకనుగుణంగా వైద్య నేపథ్యంలో స్త్రీల శరీరాలు ప్రయోగ ముడిసరుకులుగా మారుస్తున్న విష




జూపాక సుభద్ర



కె. వరలక్ష్మి

సంస్కృతిని ఎదుర్కునే దిశలో స్త్రీలు ఉద్యమించడానికి కథలే మూలకాల య్యాయి. ఈ నేపథ్యంలో డా॥ భారతి గీతాంజలి పేరుతో కథలందించారు. వారు తమ కథల్లో స్త్రీలకు తమ దేహం మీద తమకే అధికారం లేదనీ, కృత్రిమంగా మొలచుకొచ్చిన ఈ రాతి ద్రవపు సంచులు తమను తమ అస్తిత్వాలను వెక్కిరిస్తూ రోతకలిగిస్తూ, భరించలేని నరకం చూపిస్తున్న క్రమాన్ని గీతాంజలి తన కథల్లో పొందు పరిచారు. ఈ రచయిత్రి మానసిక వేత్తగా మానవజీవితంలోని అనేక సంక్షోభ పార్శ్వాలను మార్క్సిస్ట్ దృక్పథంతో తెలియచేసింది.

అలానే గీతాంజలి తన కథల్లో పితృ స్వామ్య అవలక్షణాలు, వస్తువుగా కథలు నడిపే నేర్పును ప్రతి కథలో తెలియజేశారు. అలాగే జూపాక సుబద్ర 'రాయక్క మాన్యం' కథలు దళిత మహిళ అగచాట్లను దళితేతరులకంటే దళితుల్లోని వారే సమస్యల సృష్టికి మూలం అవుతున్నారనే విషయాన్ని రామక్క మాన్యం కథల్లో అందించారు.

ఆర్థిక శాస్త్రములో పేర్కొన్న ఉత్పత్తి కారకాలైన భూమి, శ్రమ మూలధనం వ్యవస్థాపనలు నాల్గింటిలో ప్రధానంగా స్త్రీలు గ్రామీణ ప్రాంతంలో ఎదుర్కునే సమస్యలను రాయక్క మాన్యం కథల్లో స్పష్టం చేశారు. దళితమహిళ కష్టాలుగా అవి బాహ్యంలో కనిపించినా అంతర్లీ నంగా సమకాలీన సమాజంలోని మహిళల కష్టాలుగానే తెలియచేసినట్లు అన్పిపిస్తుంది.

అలాగే స్త్రీలపై అమలయ్యే హింసకి సమాజం ఏదో ఒక రూపంలో ఆమోదం అందిస్తూనే వుంది. అంతే గాక మాతృత్వం కేంద్రంగా అల్లబడిన భావ జాలాన్నే స్త్రీలకు సమాజం చూపిస్తోంది. కానీ ఆ మాతృత్వ సాధనలో చోటుచేసు కున్న భయం శ్రమను మాత్రం సమాజం బయటపెట్టడం లేదన్న సత్యాన్ని కథారచయిత్రులు నిర్మొహమాటంగా తెలియజేశారు.

అంతే గాకుండా మతాలపరంగా, తెగల పరంగా స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలలో లింగవివక్షత, పేదరికం, శ్రమదోపిడి వంటి సామాజిక సమస్యలను మహిళాకథకులు విశ్లేషించారు.

ఈ విషయంలో ప్రధానంగా గిరిజన సమాజంలోని స్త్రీల అగచాట్లు కూడా కథలుగా వచ్చాయి. దానికి ప్రత్యక్ష ఉదాహరణ వాడ్రేవు వీరలక్ష్మి గారి 'కొండ ఫలం' కథ. ఈ కథలో 'సీతాలు' అనే గిరిజన స్త్రీ భూమి పరంగా మోసపోయిన వైనాలను వీరలక్ష్మి గారు తెలియజేశారు. అలాగే కె.వరలక్ష్మి మంత్రసాని కథలో మంత్రసానిగా కాన్పులుచేస్తూ మంచిపేరు తెచ్చుకున్న ఎరుకల స్త్రీ సుక్కమ్మ తన కులవృత్తిని మంత్రసానిగా చేస్తూ విధివంచితయై ఆస్పత్రిలో మంత్రసాని వృత్తి కూతురు 'లోవా'కు అప్పచెప్తుంది. అయితే లోవా మంత్రసాని పని చేసే నాటికి పూర్వ పరిస్థితులు మారి, వైద్యంలోనూ, వైద్యాలయాలలో ఆధునికత ప్రవేశిస్తుంది. దాని కారణంగా 'లోవాకు' మంత్రసాని పనిపోతుంది. నలుగురు పిల్లలతో జీవనం కష్టమై, భర్త వ్యసనాల నుండి బైటపడకపోవడం ఒక కారణమై పాచిపని చేస్తూ పిల్లల్ని పోషిస్తూవుంటుంది అతి కష్టంగా. భర్త అప్పన్న లోవా తెచ్చిన డబ్బులు తాగుడికి పెడ్తాడు. తాగుడు తగాదాలో అప్పన్న చనిపోతాడు. లోవాకు ఆ పాచిపనీ పోతుంది. చివరికి కుటుంబం కోసం వ్యభిచారంలోకి దిగుతుంది.

ఈ కథను ఒక స్త్రీ జీవిత కోణంలో చూడకలిగితే ఎన్నో విషయాలు బహిర్గత మౌతాయి. ఆమె నాగరికస్త్రీ అయినా లేదా గిరిజన స్త్రీ అయినా 'స్త్రీయే' అన్నమాట వరలక్ష్మి ఈ కథలో నిరూపించారు. ఈ కథలో సుక్కమ్మ, లోవా (స్త్రీ పాత్రలు) వారి జీవిత గమనంలో ఎదుర్కొన్న వైఫల్యాలు కథగా కొట్టిపారేశేవికావు. ఎందుకంటే సమాజంలో పునరుత్పత్తి కేంద్రంగానూ, వాంచలకు బలయ్యే వారికి ప్రతీకగానూ వున్నస్త్రీ స్థానాన్ని రచయిత్రి గిరిజన నేపథ్యంలో తెలియచేశారు. భర్తపోయాక 'లోవా' పాచి పనికి అర్హత కోల్పోవడం దురదృష్టం దానికి ప్రబల కారణం సామాజికంగా సంప్రదాయ నేపథ్యం (విధవలు ఇండ్లలో పనికి పనికిరారు) కూడా మరొక కారణమైంది.

కానీ దురదృష్టం 'లోవా'ని గౌరవంగా బతకనీక చివరికి హైవేపై వ్యభిచారం చేసే స్థాయికి తీసుకువెళ్లింది. ఇలాంటి ఘటనలు సామాజికావరణంలో ఎందరో అమాయక స్త్రీలను బలితీసుకుంటున్నా ఎలాంటి మార్పు కనబడడంలేదు. చట్టం, న్యాయం అమాయకులకు రక్షనివ్వడం మానేసి అవినీతిపరులకు కొమ్ము కాయడం దురదృష్టకరం.

ఇలాంటి ఎన్నో సమస్యలను 20వ శతాబ్దంలో స్త్రీల కథలు వెలుగులోకి వచ్చాయి. అయితే సమాజంలో మార్పు ఆశించాలంటే అది మృగ్యమే, అయినా పోరాటం తప్పదు. దానికి స్త్రీల వ్యథలే కథలయ్యాయన్నది నిజం ఎంతనిజం అంటే సూర్యుడు తూర్పున ఉదయిం చాడన్నంతనిజం.

కవిత

# రంగు కాగితం



డా॥ ఐజక్ గుండె, 9866752159




ఒకే ఒక్క రంగు కాగితం మనిషిలోని
అన్ని రంగుల్ని బయటపెడుతోంది
ఏ స్వార్ధం లేని రంగు కాగితం మనిషిలోని
స్వార్ధపు రంగుని చూపిస్తుంది

మాట్లాడలేని, పలకలేని రంగు కాగితం నిజాన్ని
తొక్కిపెట్టి అబద్దాన్ని చెప్పి, ప్రచారం చేస్తుంది
ఏ బంధం లేని రంగు కాగితం అన్ని బంధాల్నీ
తెంచి లేని కొత్త బంధాల్ని పెనవేస్తుంది

ఏజాతికి, కులానికి చెందని రంగు కాగితం మనిషికి కులం,
జాతి రంగును అంటగడుతుంది
ధర్మం తెలియని రంగు కాగితం అధర్మపు రంగును చూపి ధర్మ,
అధర్మ విచక్షణ ని కోల్పోయేలా చేస్తుంది

మోసం తెలియని రంగుకాగితం మనిషికి మోసపురంగుని
నేర్పి కన్న తల్లి తండ్రులనే మోసం చేయిస్తుంది
ద్రోహం తెలియని రంగుకాగితం మనిషికి ద్రోహం
చేయడమెలాగో తెలిపి నమ్ముకున్న స్నేహితులకి దోహం చేయిస్తుంది

ఈర్ష్య,ద్వేషం,అసూయ తెలియని రంగుకాగితం
అన్నిటినీ మనిషిలో పుట్టించి
మనుషుల మధ్య అంతరాల్ని సృష్టిస్తుంది,
చివరికి ఒకడ్ని, ఒకడు చంపుకునేలా చేస్తుంది.

మనిషి పుట్టినా, చచ్చినా చివరికి దినానికి కూడా రంగుకాగితమే.
అది లేకపోతే ఆసుపత్రిలో ఆక్సిజన్ కూడా పీల్చుకోలేని బ్రతుకు మనిషిది
నిద్ర లేచింది మొదలు మళ్ళీ నిద్ర పోయేవరకు మనిషి ఉరుకుల,
పరుగుల జీవితం ఆ రంగుకాగితం కోసమే.

తాను సృష్టించిన రంగుకాగితానికి తానే
బానిసైపోయాడు మనిషి చివరికి
మనిషిని నడిపే ఆరవ భూతమే
ఈ రంగు కాగితం.

మంచితనాన్ని మాయం చేసి, మానవత్వాన్ని
మంటగలిపి హత్యలు  చేయిస్తుంది ఈ రంగు కాగితం.
మనిషి అవసరం కోసం సృష్టించిన రంగుకాగితం
చివరికి ఆ మనిషినే బానిస చేసుకుని
ఆ మనిషి జీవితంతో తోలు బొమ్మలాట ఆడిస్తుంది.

సాహితీ శిఖరం

1964 సాహిత్య నోబెల్ విజేత....



# పుస్తకాలను ప్రేమించమనే రచయిత...
# జీన్-పాల్ సార్త్రే

జీన్-పాల్ సార్త్రే ఒక ప్రముఖ ఫ్రెంచ్ తత్వవేత్త. ఆతను మార్క్సిజం, అస్తిత్వవాదం పై రచనలు చేసేవాడు. ఏది నిత్యమో, ఏది శాశ్వతమో, ఏది సార్వజనికమో దానిని గూర్చి తెలియజేస్తుంది అస్తిత్వ వాదం. వ్యక్తి స్వభావాన్నీ, మానవుని విచిత్రానుభూతులనూ తరచి తరచి జగద్రహస్య సిద్ధాంతాలను తేటతెల్లం చేస్తుందీ అస్తిత్వం. రెండవ ప్రపంచ యుద్ధం, వియత్నాం యుద్ధం విషయాలలో ఇతను మార్క్సిస్టుల వైపే ఉన్నాడు. ఆయన 1905వ సంవత్సరం, జూన్ 5వ తారీఖున పాశ్చాత్య నాగరికతకు మెట్టినిల్లుగా భాసించే పారిస్ నగరంలో, మధ్య తరగతి కుటుంబంలో జన్మించాడు. మహా సంక్షోభమొకటి రాత్రింబవళ్ళను కాల్చివేస్తున్న ఆదుర్దినాలలో పారిస్‌లోనూ, లోరోషెల్ లోనూ విద్యాభ్యాసం ముగించాడు. ముప్పై ఏండ్ల వయసు నుండే వేదాంతశాస్త్రాన్ని బోధించే ఆచార్యుడిగా జీవితం ప్రారంభించాడు. ఆచార్యుడిగా ఉండగానే కీర్క్ గార్డ్, హెయిడెగార్ వంటి ప్రముఖ దార్శనికుల రచనలు చదివి వారి ప్రభావానికి లోనయ్యాడు. ఆ ప్రభావమే తర్వాత తర్వాత అస్తిత్వవాదంగా పరిణమించింది.అయితే ఈ అస్తిత్వవాదం, 2వ ప్రపంచ యుద్ధానికి ముందు అతడు ప్రచురించిన రచనలలో ఎక్కడా కనిపించదు.



1939లో సైన్యంలో చేరాడు. శత్రువుల చేతికి చిక్కి జీవన్మరణాల మధ్య ఊగిసలాడాడు. కానీ విధి అనుకూలించి, తప్పించుకొని పారిస్ చేరి అజ్ఞాత జీవితం ప్రారంభించాడు. తన జీవన విధానాన్ని, తను నమ్మినదానిని సర్వ ప్రపంచానికి తేటతెల్లం చేయాలని, సాహిత్య కృషీవలుడై, అచిరకాలంలోనే అశేషమైన ప్రజాదరణను సంపాదించుకొని, పెక్కు నాటకాలను, నవలలను ప్రచురించాడు. విశ్వవ్యాప్తి చెందిన సార్త్రే రచనలు అంతగా తెలుగులోకి అనువదించబడలేదు. కానీ, భాస్కరభట్ల కృష్ణారావు "వెల్లువతో పూచిన పూచిక పుల్లలు" శ్రీమతి లత చెప్పీ చెప్పకుండా అనువాదమూ అనుకరణా స్వేచ్ఛగా చేసిన "గాలి పడగలూ-నీటి బుడగలూ నీలి నీడలు" మొదలగు నవలలూ, గొల్లపూడి మారుతీరావు గారి ఒకటి రెండు కథానికలు, శ్రీరాజమన్నార్ రేడియోలో ప్రచారం చేసిన నాటకాలు, సార్త్రే ప్రభావానికి నిదర్శనాలు. శ్రీ శ్రీ, కాశీభట్ల వేణుగోపాల్, త్రిపుర రచనలలో సార్త్రే అస్తిత్వవాదం తీరు కొంతకనిపిస్తుంది. "నామతం ఏమిటో, నాధర్మం ఏమిటో నాకు తెలిసిపోయింది. పుస్తక ప్రపంచం కన్నా నాకు వేరే ప్రపంచం తెలీదు. వేరే మతం లేదు. పుస్తకం ముందు అన్నే తీసికట్టే. యేదీ ముఖ్యం కాదు" అంటాడు సార్త్రే. లైబ్రరీ నాకు దేవాలయం. నేను ఒక మతాధికారి మనవణ్ణి. ప్రపంచం యొక్క శిఖరస్థానంలో నా నివాసం. అంది కేంద్ర స్థానంలో మహా వృక్షం లాంటిది. అక్కడ నేను చెట్టుమీద పక్షి గూడు చేసుకున్నట్లు నివాసం ఏర్పాటు చేసుకున్నాను. శైశవదశలో ఉన్నపిల్లవాళ్ళలో కూడా స్త్రీ సహజమైన మెత్తని లక్షణం ఒకటి ఉంటుంది. అది ఆ వయస్సులో నాలోనూ ఉంది. మా అమ్మ నన్ను లగ్జంబర్గ్ గార్డెన్‌కు తీసుకుపోతూ ఉండేది, అప్పుడు మాత్రమే నేను అధోలోకాలకు అడుగు పెట్టడం జరుగుతుంది. కాని నా కాయం మాత్రం నాగూట్లోనే ఉంటుంది. అదే చెట్టు మీద చిటారు కొమ్మమీద. ప్రతీ మనిషికి సహజమైన స్థానం, సహజమైన తీరు అంటూ ఉంటాయి. మనిషి ఔన్నత్యం, అభిమానం వంటివి విలువైన వస్తువులతో నిర్ణయించలేము. వీటి అన్నింటిని మనిషి శైశవదశ నిర్ణయిస్తుంది. అందరి జాతకాలు అక్కడే తేలుతాయి. అక్కడ పుస్తకాల ప్రాముఖ్యం చాలా ముఖ్యం అంటాడు సార్త్రే. సార్త్రే నవలలూ, నాటకాలే కాదు పెక్కు కథలు కూడా వ్రాశాడు. 1943లో తన మొట్టమొదటి నాటకం హెయిన్ క్లోస్ ను ప్రచురించాడు.ఈనాటకమే లండను నగరంలో విషస్ సర్కిల్ అన్నపేరుతోనూ, న్యూయార్క్లో నో ఎగ్జిట్ అన్నపేరుతోనూ ప్రచురించబడి ప్రదర్శనలో పెక్కుమంది విమర్శకులచేత అద్భుతమైన ప్రదర్శనగా పొగడబడింది. అతని నాటక రచయితగా స్థిరపడడానికి ఈ రచన ఎంతో దోహదపడినది. నలభై-నలభై ఏడు లమధ్య లే కెమిన్ డిలా లిబర్టే అన్న పేరుతో అతను వాసిన నవలాత్రయం.ఈ నవలలో ఆధునిక మానవుడు అధికారదాహంతో రాజకీయ సుడిగుండాలలో చిక్కుకొని ఎలా తనను తాను హింసించుకుంటున్నదీ-అతి వాస్తవికంగా, నగ్నంగా, భయంకరంగా ఎక్సురే కళ్ళతో చిత్రీకరించాడు సార్త్రే. 1943లోనే లోనే లేమోషెస్ 1946లో మోర్ట్ సాంస్ సెపుల్చర్ లాపుటైరెన్ రెస్పెక్టుస్ అన్న నాటకాలనూ వరుసగా ప్రచురించాడు.ఈ నాటకాలన్నే లండను నగర రంగస్థలం మీద ప్రదర్శించబడి ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యచకితులను చేశాయి.అయితే సార్త్రేకు సర్వప్రపంచంలోనూ ఎనలేని గౌరవాన్ని కూర్చిపెట్టినవి. ఇతడు 1964 సంవత్సరానికి సాహిత్యంలో నోబెల్ బహుమతి గెలుపొందాడు.

వ్యాసం

# సాహిత్య కిరీటం

**భాషను కాంతిపుంజం చేసిన ఘనతను విశ్లేషించిన వ్యాసం....**



డా. సరోజ వింజామర
80997 21928

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత జరిగిన 2017 ప్రపంచ తెలుగు మహాసభలు మన అస్తిత్వాన్ని, ఆత్మ గౌరవాన్ని, భాషను బతుకమ్మ శిఖరంలా నిలబెట్టినాయి. భాషా సంబురాల సభలను అంబరాన్నంటించిన ఘనత కె.సి.ఆర్. దైతే, ఆ సభల విజయానికి కారకులు, కార్యనిర్వాహకులు దక్షులైన తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు నందినీ సిధారెడ్డి. అంతకుముందు విశిష్ట కవి, రచయిత, ఉద్యమకర్తగా మంచిపేరు ఉన్న సిధారెడ్డి మహాసభలతో తెలుగు వారికి ముఖ్యంగా తెలంగాణలో ప్రతి ఇంటిమనిషి అయ్యారు. సిధారెడ్డిలో సలహాలిచ్చే నాన, పెద్దరికంలో బాపు కనిపిస్తారు. ఎక్కడ, ఎప్పుడు ఏం మాట్లాడాలో సర్వం తెలిసిన మర్మజ్ఞుడు ఆయన.

కొందరిగురించి ఎంత రాసినా ఇంకా రాయాల్సింది మిగిలింది అనిపిస్తుంది. రాసినదంతా స్వభావోక్తి అనిపిస్తుంది. అలాంటి వ్యక్తి, సాహితీ శక్తి నందిని సిధారెడ్డి.

**సాహిత్య కార్యక్రమాల నిర్వహణ...**

సిధారెడ్డి నిర్వహించే సాహితీ కార్యక్రమాలన్నీ ఒక ఎత్తైతే, ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణ ఒక్కటే ఒకెత్తు. తెలంగాణ రాష్ట్ర అస్తిత్వాన్ని, గౌరవాన్ని, ఆత్మనూ అమాంతంగా పైకెత్తిన సభలవి. తెలుగు మృతభాష అయిందని చెమర్చిన కళ్ళనుండి ఆనందభాష్పాలను ఒలికింపజేసేట్లుగా జేగీయమానంగా జరిగిన మహాసభల నిర్వహణ నభూతో నభవిష్యతి. మహాసభలు ముగియగానే తెరిపి లేకుండా మరెన్నో సాహితీ కార్యక్రమాలు. పుస్తక ప్రచురణలు, ఔత్సాహిక శిక్షణ శిబిరాలు, అన్ని జిల్లాలలో సాహితీ కార్యక్రమాలు, కావ్యపరిమళం, దాశరథి, కాళోజీ, సినారెవంటి తెలంగాణ మహనీయుల జయంత్యుత్సవాలు, కవిసమ్మేళనాలు, సదస్సులు, పుస్తకావిష్కరణలు ఇలా పలు కార్యక్రమాలు చేపట్టడంతోపాటు సాహిత్యాభిలాష ఉన్న ఇతర సంస్థలను కూడా ప్రోత్సహిస్తూ వారు జరిపే సాహిత్య కార్యక్రమాలకు సహాయసహకారాల నందిస్తూ అప్రతిహతంగా కొనసాగుతోంది తెలంగాణ సాహిత్య అకాడమీ సిధారెడ్డి సార్ నాయకత్వంలో. ఈ సాహితీ సంబురాలు ఇంత ఘనంగా, ఇంత నవ్యంగా, ఇంత రమ్యంగా, ఇంత హృద్యంగా ఇంకే రాష్ట్రంలోనూ జరగలేదు, జరుగబోవు. ఇదికదా బంగారు తెలంగాణ.



సాహిత్య అకాడమీ చైర్మన్‌గా సాహితీకారులతో అధికారిక సమావేశాలు, చర్చలు, భవిష్యత్ ప్రణాళికలు, వాటి అమలు, సభలు, సాహితీ సమావేశాల నిర్వహణ, సాహితీసంబంధంగా వచ్చినవారితో చర్చలు, వారి సభలకు కావలసిన సలహాలు, సూచనలు, సహకారాన్ని అందించడం, కొత్త పొత్తాలకు ముందుమాటలు, ఇష్టమైన రచనావ్యాసంగం వీటన్నిటికీ తోడు వ్యక్తిగత జీవితం. ఇన్ని విషయాలతో తలమునకలుగా

ఉన్నా ఉదయం ఆయన ఏ చిరునవ్వుతో వస్తారో కార్యక్రమాలన్నీ ముగించుకుని ఇంటికెళ్ళేటపుడుకూడా అదే చిరునవ్వు స్వచ్ఛంగా అందరినీ పలకరిస్తుంది.

**ప్రసంగం...**

సభాధ్యక్షునిగానైనా, ముఖ్య అతిథిగానైనా, సాధరణ వక్తగానైనా ప్రసంగించడానికి లేచి ముందుకు కదిలింద్రంటే సభాసదుల చెవులు, కళ్ళు సహజంగానేకి అప్పజెప్పేయబడతాయి. మంత్రమేసినట్లు తన ప్రసంగంద్వారా సాహితీవేత్తలను ఆకర్షించే వాగ్ధాటి ఆయనది. మాట్లాడుతున్న అంశంమీద పూర్తి అవగాహనతో, ఎక్కడా దిశ తప్పకుండా అంశంపట్ల సభికులకు ఆసక్తి, అవగాహన పెంచేలా ఉండే స్పష్టమైన సార్ ప్రసంగం శ్రోతలను మంత్రముగ్ధులను చేస్తుంది.

**భాష, యాస...**

వెక్కిరించిన నోళ్ళు మూతపడేలా తన భాషను కాంతిపుంజం చేసిన ఘనత సార్‌ది. ఇప్పటివరకూ మన పదాలు, భాషను లోపలే కుక్కుకుంటూ బతికిన పాణాలు మనయి. కానీ ఆయన ప్రసంగాలు విన్నాక, రచనలు చదివినాక మన భాష, ప్రజ తలెత్తుకుంది. ప్రతి తెలంగాణ గుండె ఉప్పొంగుతుంది. మనం అభిమానించిన మనవైన పదాలు ఆయన రచనల నుండి, నోటిగుండా సాధికారికంగా వెలువడి మన గుండెలను తాకుతయి. యాస, మాండలికం కాదు, ఇదే అసలైన భాష అని ఖచ్చితంగా మాట్లాడ్తడు, మాట్లాడిస్తడు. సొగసైన తెలంగాణ భాషల మళ్ళా ప్రజలు మాట్లాడడం, రాయడం అలవాటు చేసుకోవడానికి, మన భాష మళ్ళా ఊపిరి పోసుకోవడానికి అతని మాట, ప్రసంగం, సాహితీ సభలే ప్రేరణ.

**సమయపాలన...**

ఒక పని ఆ టైమ్‌కి షురు కావాలంటే కావాల. పని ముగియాలంటే ముగియాల. అవి ఆకాడమీ ఏర్పాటు చేసిన కార్యక్రమాలే అవనీ లేదా ఇతర సాహితీ సంస్థల వారి కార్యక్రమాలవనీ. ఆహుతుల ఆలస్యానికి కారణాలు వినేదిలేదు. ఎందుకంటే మీ ఒక్కరి కారణాలు నేను వింటే సభకొచ్చినవారి తీర్చలేని కారణాలు ఎన్నుంటయ్. ఆలస్యమౌతున్నకొద్దీ వారి వ్యక్తిగత సమయం తీసుకున్నవారిమి ఔతాం. కాబట్టి సమయపాలనను అనుసరిస్తే వారిని ఇబ్బంది పెట్టనివార మౌతాం అని సామాన్యప్రజల గొంతుక ఔతారు సర్. అనుకున్న సమయానికి ముగియక సభ ఇంకా కొనసాగుతూ ఉంటే సభాధ్యక్షుల వారి అనుమతి తీసుకుని తాను వెళ్ళిపోయిన సందర్భాలూ ఉన్నాయి. అలా వెళ్ళిపోవడంలో ఉన్న అంతరార్థాన్ని వారుకూడా అర్థం చేసుకుని ఇకముందు ఏర్పాటు చేసే సమావేశాలకు తగిన జాగ్రత్తలు తీసుకోవడానికి అది నాందిగా ఉపకరిస్తున్నది.

**వ్యక్తిత్వం...**

ఎదుటివారు జంకుతోనో, పట్టించు కుంటారో లేదోననే మొహమాటంతోనో మౌనంగా ఉన్నా తనే వెళ్ళి నిండుగా నవ్వుతూ బాగున్నారా అని ఆత్మీయంగా పలకరించే నిండైనస్వభావం సిధారెడ్డిది. మాట ఇస్తే నిలబెట్టుకోవడం, చెయ్యలేని, ఇవ్వకూడని, అనవసరపు పనులకుమాటే ఇవ్వకపోవడం ఆయన ఖచ్చితత్వాన్ని తెలుపుతాయి. మాటలో స్పష్టత, భావ గాంభీర్యత, భాషపై పట్టు, పనిపట్ల నిబద్ధత, కలుపుగోలు తత్వం, ధరించే దుస్తులలో తెల్లదనం తన మనసుకు దర్పణం. కోపమొస్తే ఇగ ఆపుకునే పనే లేదు. ఐతే అది అలసత్వాన్ని, అన్యాయాన్ని, ఎదిరించే కోపమే. అంత పెద్ద మనసుని సన్మానించుకుందామని ఎవరైనా శాలువా తీస్కొని పోగానే నిఅరే నాయినా! నేనేమన్నా కొత్తోన్నా! పెద్దోన్నా! మీలోని మనిషిని. గివ్వన్నీ వద్దయ్యా అని సున్నితంగా తిరస్కరించే భేషజాలు లేని మనిషి. అకాడమీ ఆధ్వర్యంలో జరిగే ప్రతీ కార్యక్రమాన్నీ పటిష్టంగా నిర్వహించడం, మొదటినుండీ చివరివరకూ శ్రద్ధగా వినడం, సభామర్యాదలను అందరూ కాపాడేట్లుగా చూడడం ఆయన నిబద్ధతను తెలియజేస్తుంది.

**సాహితీ వ్యాసంగం...**

సిధారెడ్డికి గల సాహితీ ప్రవృత్తియే వృత్తిగా మారడం తెలంగాణ ప్రజల అదృష్టం. అకాడమీలోని ఛాంబర్‌లో ఆయన బల్లమీద సర్కార్ ఉద్యోగుల బల్లలమీద ఫైళ్ళలాగా ఎప్పుడూ పుస్తకాల దొంతరే. ఏరోజుకారోజు కొత్తవి. తెలంగాణాలో అచ్చయ్యే ప్రతి పుస్తకానికీ ఆరాటం సిధారెడ్డి చేవ్రాలే తనకు ముందుమాటగా కావాలని. తెలంగాణ ఇంటింటిలో, ప్రతి తెలంగాణ నోటిలో కదలాడే నాగేటి సాళ్ళల్ల పాట కర్త, మంజీరా రచయితల సంఘం, తెలంగాణ రచయితల వేదిక, సోయి, గులాబి పత్రికలు ఇలా ఎన్నో విధాలుగా సాహిత్యజాగృతిని తెలంగాణ జన హృదిలో నింపిన సాహితీ శక్తి సిధారెడ్డి. ఆయనొక సాహితీ భాండాగారం. తన బహుముఖ ప్రజ్ఞతో జనుల మనసులను గెలుచుకున్న సాహితీవేత్త, తెలంగాణకోసం తపించే మనసు, మనలో మనవానిగా కలిసిపోయే ఆత్మీయ గుణం, పనిచేసి చూపించే సత్తా, తెలుగుభాష, సాహిత్యాలపట్ల పూర్తి పట్టు, తెలంగాణను ఆత్మగా చేసుకోవడం, మన భాషా పునరిజ్జీవనానికి మేలైన కార్యక్రమాల రూపకల్పన, అమలు, పాత సాహిత్యపు విలువలను తెలిసిన, కొత్త సాహితీ వేత్తలతో మమేకం కాగలిగిన సాహితీ వారధి, రథసారధిగా తెలంగాణ సాహిత్యాన్ని శిఖరాన నిలిపే ఆశయం ఇవే అతన్ని తొలి తెలుగు సాహిత్య అకాడమీ అధ్యక్షునిగా చేశాయి.

అకాడమీ అధ్యక్ష పదవి, హోదా సిధారెడ్డిలో ఎలాంటి దర్పాన్ని, కల్మషాన్నీ నింపలే. పైపెచ్చు ఈ సాహితీ వజ్రం మరింత స్వచ్ఛతా మెరుపులను సంతరించుకుంది. తెలంగాణ సాహిత్యం పట్ల సామాన్యుల్లోకూడా అభిమానాన్ని పెంచి, తెలుగు భాషను ప్రజలకు చేరువ చేసి తెలంగాణ సాహితీబావుటాను దశదిశల్లో ఎగురవేస్తున్న సాహితీ కిరీటం నందినీ సిధారెడ్డి.

# మూల రచయిత ప్రభావం పాఠకునిపై అనువాదంలో బలంగా ఉంటుంది...

**- వారాల ఆనంద్**

**కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కార విజేత వారాల ఆనంద్‌తో ముఖాముఖి...**




కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, ఉమ్మడి కరీంనగర్ జిల్లా వాసి, తెలంగాణ ముద్దు బిడ్డ వారాల ఆనంద్ ను కలవాలనే తలంపులతో ఇంటి తలుపు తట్టిన "తంగేడు"...

**ప్రముఖ ఉర్దూ కవి, రచయిత, పద్మ భూషణ్ గుల్జార్ రాసిన "గ్రీన్ పోయెమ్స్" (2014)ను "ఆకుపచ్చ కవితలు" (2019)గా తెలుగులో అనువదించి నందుకు 2022 సంవత్సరానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించి నందుకు అభినందనలు దీనిపై మీ అభిప్రాయం...**

చాలా ఆనందంగా ఉంది. అవార్డు వచ్చినందుకు ఒకంత ఆశ్చర్యంగానూ ఉంది. నా మనసుతో మమేకమై ఈ అనువాదానికి పూనుకున్నాను. అవార్డు వస్తుందని ఊహించలేదు. నేను మొదటిసారి గుల్జారు రాసిన గ్రీన్ పోయెమ్స్ చదివినప్పుడు ఆయన అనుభూతులను తెలుగు వారితో పంచుకోవాలని ప్రయత్నించాను, దాని ప్రతిఫలమే ఈ పురస్కారం.

**మీరు రచయితగా, కవిగా మారటానికి నేపథ్యం?**

నా చిన్నప్పటినుండి రేడియోలో పాటలు వినడం, పుస్తకాలు చదవడం జీవితంలో ఒక భాగమయిపోయింది. కరీంనగర్ లో బాల్యంలో మిత్రులతో, ఉర్దూ భాషతో మమేకమైనప్పుడు నాలో సాహిత్య సృజన మొదలయింది. ఆ తర్వాత పై చదువుల కోసం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రవేశించినప్పుడు నందిని సిద్దారెడ్డి, అలిశెట్టి ప్రభాకర్ మొదలైన వారి పరిచయం ఈ సృజనను ఇంకా పెంచింది. ఏదో చదవాలనే తలంపు పెరుగుతూ వచ్చింది, వివిధ రచనల మీద ఆసక్తి,అవగాహన పెరిగింది.

**సైన్స్ విద్యార్థి నుండి సృజనాత్మక రచయితగా మార్పు చెందడానికి కారణం?**

మొదటి కారణం సామాజిక మార్పు, రెండోది నేను చాలా అంతర్ముఖుడిని, నాలో నేనే సంభాషించుకునే వాడిని. పాత సినిమా పాటలు, సాహిత్యం, గొప్ప, గొప్ప రచనలు నాలోని కళాత్మక హృదయాన్ని, భావాలని బహిర్గతం చేయడానికి ప్రేరేపించాయి. దానిలో భాగంగా మొదటి సంకలనం "మినీ పోయెట్రీ"తో (1978 - 80) మధ్య ప్రారంభించాను.

**కవిగా మీ సాహితీ ప్రస్థానం?**

నా సాహిత్య మిత్రులు అలిశెట్టి ప్రభాకర్, వజ్జల శివ కుమార్, పీ.ఎస్. రవీంద్ర, జింబోలతో కలిసి "లయ" పేరుతో పుస్తకాన్ని ముద్రించాము. అది నాలోని కవి యొక్క పరిణితిని పెంచింది. ఇప్పటివరకు దాదాపు నాలుగు కవిత్వ సంకలనాలూ వెలువరించాను, సుమారు 400కు పైగా కవితలు రాశాను.

**కవిత్వం నుండి అనువాదంలోకి రావడానికి ఏదైనా ప్రత్యేక కారణం ఉందా?**

చదవడం ప్రారంభించిన తర్వాత ఎన్నో పుస్తకాలు ఉస్మానియాలో చదవడం, వాటిని ఆకళింపు చేసుకొని ఎన్నో తెలియని విషయాలు తెలుసుకున్నాను. అంతేకాకుండా, తెలుసుకోవడం అన్నది నా జీవిత స్వభావం కూడా. అంతే కాకుండా నాకు తెలిసింది అందరితో పంచుకోవడం అన్నది కూడా నేను ఆచరించే జీవన విధానం, ఈ స్వభావమే నన్ను అనువాదకునిగా మార్చింది. దానిలో భాగంగా "ఇరుగు-పొరుగు" అని శీర్షికతో వివిధ భాషల సాహిత్యాన్ని తెలుగులో



ముఖాముఖి

అనువదించడం మొదలుపెట్టాను. ఇప్పటి వరకు దాదాపు 17 భారతీయ భాషలలోని అనేక మంది కవితల్ని తెలుగులోకి అనువదించాను. అట్లా అనువదించిన కవితలు వందకు పైగా వున్నాయి. అట్లా అనువదించడం వల్ల నా పరిధి చాలా విస్తరించింది. విషయాల్లోనూ వ్యక్తీకరణల్లోనూ ఎంతో ఉపయుక్తమయిందనే అనుకుంటున్నాను. గతం లో విపుల లాంటి పత్రికలు నాలోని అనువాదకున్ని ప్రోత్సహించి నిలబెట్టాయి.

**మీ దృష్టిలో చక్కని అనువాదం అంటే ఏమిటి? దానిలోని కీలకమైన అంశాలు తెలియచేయగలరు.**

అనువాదం యొక్క ప్రాథమిక లక్షణాలు రచయిత భావాలను పాఠకుని మనస్సుకు చేరవేయడం. అనువాదకుడు మూల రచయిత యొక్క కవితాత్మను, ఆయా కవితల రూపాన్ని, మూల కవి అభిప్రాయాలను, జ్ఞానాన్ని వ్యాప్తి చేస్తే పాఠకుని దృష్టిలో అది మంచి అనువాదం. మూల రచయిత చెప్పాలనుకున్న సారాంశాన్ని అనువాదకుడు పాఠకునికి అందించాలి. స్వంత భావాల్ని చొప్పించ కూడదు అని నేననుకుంటారు.

**సాధారణంగా అనువాదం అనేది ద్వితీయ శ్రేణి రంగానికి చెందినదంటారు సాహిత్యంలో, దీనిపై మీ అభిప్రాయం.**

నా అభిప్రాయంలో అనువాదం లేకుంటే మానవ జీవితంలో పురోగతి కానీ అభివృద్ధి కానీ లేదు. ప్రాచీన గ్రీక్, రోమన్ సాహిత్యాలతో ప్రారంభిస్తే అనేక భాషా సాహిత్యాలూ, తాత్వికరచనలు అనువాదం వల్లనే మనకు లభ్యమవు

> **కవిత్వంతో నా ప్రయాణం, నన్ను, నా లక్ష్యాలకు సమాంతరంగా తీసుకు పోతోంది. కొన్నిసార్లు అభ్యాసకునిగా, రచయిత భావాలకు వ్యాఖ్యాతగా మరియు అనువాదకునిగా కాలంతో పరిగెడుతూఉన్నాను. మొత్తానికి ఒక శ్రామికుడిగా, రైతుగా, సాహిత్య వ్యవసాయం చేస్తున్నానని గుర్తించవచ్చు.**

తున్నాయి. ఫ్రెంచి, రష్యా మరియు పాశ్చాత్య సాహిత్యాలు మన జీవన విధానంలో చాలా మార్పులను తీసు కొచ్చాయి. అంతెందుకు, మన ప్రస్తుత రామాయణ, మహాభారత, భాగవతాలు కూడా అనువాదాలే. ఇకపోతే ఈమధ్య అనువాదాలు యాంత్రికంగా తయారవు తున్నాయి. అందువల్ల అనువాదం ద్వితీయ శ్రేణి అనే భావం కలగవచ్చేమో కానీ మూల రచయితకి పాఠకుడికి మధ్య సమన్వయ వారధే ఈ అనువాదకుడు. ఈ హెచ్చుతగ్గులు తగ్గాలంటే విశ్వవిద్యాలయాలు, పరిశోధన అధ్యయన కేంద్రాలు కొన్ని కార్యశాలలను మరియు అనువాద అవశ్యకతలపై, వాటి సమస్యలపై చర్చ-గోష్ఠులను నిర్వహిస్తే అనువాదంపై ఉన్న అపోహలను తొలగించకోవచ్చు.

**అనువాద రచనకు గుల్జార్ యొక్క 'గ్రీన్ పోయెమ్స్'ని ఎంచుకోవడానికి కారణం?**

నా చిన్నతనం నుండి గుల్జార్ రచనల యొక్క ప్రభావం నాపై అపారంగా ఉంది. ఆయన పాటలు, మాటలు నన్ను ఎంతో మార్చాయి. డిగ్రీ వరకు నా ద్వితీయ భాష హిందీ కావడంతో ఈ 'గ్రీన్ పోయెమ్స్'ని ఎంచుకున్నాను. నేను ఎం.ఏ. లో అభ్యసించిన తత్వశాస్త్రం, గుల్జార్‌లోని తాత్విక వేత్త, పర్యావరణ ఆవశ్యకత గురించి ఆయన స్పందించిన తీరు, మానవ మరియు ప్రకృతి సంబంధాల గురించి స్పృశించిన శైలి నన్ను ఆకట్టుకుంది.

"పువ్వు రాలిపోతూ కొమ్మతో ఏమంటుంది/ చెట్టు కూలిపోతూ భూమితో ఏం చెబుతుంది /భూమి మళ్ళీ వస్తావు నేను బతికుంటే...."

**మూల రచనకు/ రచయితకు అనువాదకుడు విశ్వాసపాత్రకుడుగా ఉండగలుగుతాడా?**

అనువాదకుని పరిధి, బాధ్యత, రచయిత యొక్క భావాలను పాఠకునికి చేరవేయడమే. రచయిత మూలభావాలను అనుసృజనగా మార్చి పాఠకునికి చేరవేసే మహోన్నత బాధ్యత అనువాదకుల భుజస్కంధాలపై ఉంది.

**మీరు ఆనందం కోసం పుస్తకాలు చదువుతారా లేక అనువాదం కోసం చదువుతారా? ఈ రెండిట్లో ఏమైనా బేధాలు ఉన్నాయా?**

కవిత్వాన్ని చదవడం నా జీవితంలో ఒక అంతర్భాగమయిపోయింది. కవిత్వాన్ని ఎందుకు చదువుతారు అంటే చదవకుండా ఉండలేను కాబట్టి చదువుతాను. అధ్యయనం ఆనందం కూడా ఇస్తుంది. ఉత్తేజాన్ని ఇస్తుంది.






ప్రత్యేకంగా అనువాదం కోసం చదవను. చదివే క్రమంలో నాకు బాగా నచ్చి నేను కదిలిపోయిన కవితల్ని అనువదిస్తాను. ఇష్టంగా చదివి అనుసృజన చేస్తే తాదాత్మిక ఆనందంతో పాటు సృజనాత్మక జ్ఞానాన్ని అందరికీ పంచడం జరుగుతుంది. దానిలో స్వల్ప భేదాలున్నప్పటికీ సాహిత్య తృష్ణ వాటిని మార్చి వేస్తుంది. భాషామార్పుతో అనేక ప్రయోగాలకు నాంది పలకడంతో పాఠకుడు సంతృప్తి చెందుతారు. నా వరకు అనువాదంతో కూడా అపరిమితమైన ఆనందం వస్తుంది.

**పాఠకులు, గుల్జార్ యొక్క సాహిత్య ప్రపంచంలోకి ప్రవేశించడం సులభమేనా?**

పాఠకుడు రచయిత మనసుతో మమేకం కావాలి. గుల్జార్ రచనలు అలతి అలతి మాటల్లో సాధారణంగా ఉండి ఉదాత్తమైన ఆలోచనలు కలిగిస్తాయి. ఆయన రచనలలోకి తొంగి చూస్తే వాటి యొక్క స్పర్శ మనల్ని తట్టి లేపుతుంది. ఠాగూర్ రాసిన "భాగ్ బన్"ను ఆయన అనువదించిన తీరు అద్భుతం. తనలోని భావుకతను అర్థం చేసుకుంటే మనకు దృశ్య కావ్యాలు ఆవిష్కృతమవుతాయి. ఆయన రాసిన "కలెక్టెడ్ పోయెమ్స్", "నెగ్లెక్టెడ్ పోయెమ్స్", "సస్పెక్టెడ్ పోయెమ్స్" మనల్ని వేరొక ప్రపంచంలోకి తీసుకెళ్తాయి.

**స్వేచ్ఛానువాదాల వల్ల పాఠకులపై మూల రచయిత ప్రభావం ఏ విధంగా ఉంటుంది?**

సంకేతము మరియు వాటి తరంగాలు సమానమైతేనే మూల రచయిత ప్రభావం పాఠకుడిపై బలంగా ఉంటుంది. ఇందులో స్వేచ్ఛానువాదాల పాత్ర కూడా తక్కువేమీ



కాదు. అనువాదకుని ప్రతిభ, అతని యొక్క భాషా దర్శనం, పదాలు, పదజాలం మరియు పదబంధాలు పాఠకుని మనస్సులోకి చేరితేనే, పాఠకుడు అనువాదకుని ద్వారా మూల రచయిత (కవి) యొక్క ప్రయాణంలో భాగమవుతాడు.

ఉ.దా: కాలం నన్ను లాలిస్తుంది మురిపిస్తుంది
పోతూ పోతూ కదిలిస్తుంది
కలల్ని నాటుకుంటూ నడిచిపోతుంది
నేనే నీళ్లు పోసి సాకాలి.

**కవితలనే మీరు అనువదిస్తారా? లేక నవలలు కూడానా?**

కవిత్వం ఒక భావావేశంతో పుడుతుంది. దాని లక్ష్యం సమాజ మార్పు. అదే నవల యొక్క స్వభావము, పరిధి చాలా విస్తృతంగా ఉండటం వల్ల నా ప్రాధాన్యం కవిత్వానికి ఇచ్చాను. కొన్ని కథలు కూడా అనువదించాను. ప్రస్తుతానికి నవలలు అనువదించే ఆలోచన ఉన్నా, సమయానుకూలంగా ప్రయత్నించాలి. కవిత్వంలో ఉన్న గొంతుకు ప్రభావం ఎక్కువ. అది నూతన పోకడలకు నాంది పలుకుతుంది. సమాజ పరిణామ క్రమంలో కవిత్వం పాత్ర ఎక్కువని నా అభిప్రాయం.




**మీ దృష్టిలో అనువాదం అంటే అర్థాన్ని అనువదించడమా? లేక భావాన్ని సమాచారం చేయుటమా?**

సాంకేతికంగా లేక ప్రయోగాత్మకంగా చూస్తే అర్థాన్ని అనువదించి పాఠకునికి చేరవేయడమే అనువాదం. కానీ సాహిత్య విలువల పరంగా చూస్తే కవితలు, పదాలు-పదజాలం కాదు, రచయిత యొక్క భావాల ప్రతిబింబాలు. ఆ భావాలు సమాజంలోని మార్పులకు సోపానం కావడమే ముఖ్యం. అలాంటి అనువాద సాహిత్యాన్ని చదివాక కలిగే అనుభూతి చాలా ప్రత్యేకమైయినది.

దుఃఖము చీకటి రెండూ ఒకటే
దుఃఖంలో చీకటికమ్ముకు వస్తుంది
చీకటిలో దుఃఖం రెట్టింపు అవుతుంది.

**మిమ్మల్ని మీరు ఎలా గుర్తిస్తారు? ఒక అభ్యాసకుడా, (వ్యాఖ్యాత) లేక అనువాదకుడిగాన?**

కవిత్వంతో నా ప్రయాణం, నన్ను, నా లక్ష్యాలకు సమాంతరంగా తీసుకు పోతోంది. కొన్నిసార్లు అభ్యాసకునిగా, రచయిత భావాలకు వ్యాఖ్యాతగా మరియు అనువాదకునిగా కాలంతో పరిగెడుతూఉన్నాను. మొత్తానికి ఒక శ్రామికుడిగా, రైతుగా, సాహిత్య వ్యవసాయం చేస్తున్నానని గుర్తించవచ్చు. నా రచనలు 'మనిషి లోపల', 'అక్షరాల చెలిమే', "ముక్తకాలు" మరియు "సిగ్నేచర్ ఆఫ్ లవ్" నా గురించి పరిచయం చేస్తాయి.

**మీ భవిష్యత్తు ప్రణాళికలు ఏమిటి?**

ప్రస్తుతం జావిద్ అక్తర్ పోయెట్రీని మరియు మలయాళ కవి కే.సచ్చిదానందం కవిత్వాన్ని అనువదిస్తున్నాను. మిగతా భారతీయ భాషా కవుల కవిత్వాన్ని అనువదించే పని రోజూ కొనసాగుతూనే వుంది.

**మీ అనువాదాలకు ప్రేరణ లేక తోడ్పాటు ఎవరైనా ఉన్నారా?**

నా అనువాదాలకు లేదా కవిత్వ

రచనలకు తోడ్పాటు నా జీవిత సహచరి 'ఇందిర'. 2014లో నేను రాసిన "మనిషి లోపల" పుస్తకం తనకు అంకితం ఇచ్చాను. ఇట్లా రాసాను.. 'కలిసి బతుకుదామని వచ్చి, నాకు జీవితాన్నే ఇచ్చిన ఇందిరకు' అని తను లేనిది నేను లేను. తనే నా అంతరంగం.

"పొద్దస్తమానం అద్దంలోకి చూస్తూనే ఉంటాం... అందం కోసమో... అలంకరణ కోసమో... మన లోపలికి చూసుకోవడానికి తీరికే లేదు."

**భవిష్యత్ అనువాదకులకు మీ సందేశం.**

అనువాదకులకు భాష పై పట్టు, రచయిత మనసులోని భావము, అతని ఆలోచనల ప్రభావంపై స్పష్టత ఉండాలి. అప్పుడే అనువాదకుని బాధ్యత పూర్తవుతుంది. ఉదాహరణకి వేదన, బాధ, దుఃఖంలలో మూడు ఒకే రకమైన పదాలు కానీ వాటి భావాలు, అర్థం, పరిస్థితి, ప్రభావాలు వేరు, అనువాదకుడు వాటిని సమన్వయంగా సద్వినియోగం చేసుకోవాలి.

**"ఆకుపచ్చ కవిత్వం" పై మీ అభిప్రాయం...?**

గుల్జార్ "గ్రీన్ పోయెమ్స్" ఒక కవిత సంకలనం, అది మనిషికి మరియు పర్యావరణానికి మధ్య ఉన్న అనుబంధాల గురించి, మనిషి వల్ల ప్రకృతిలో జరిగే మార్పులపై రాయబడ్డ మనోహరమైన కావ్యాల సమాహారం. మానవజాతి పర్యావరణంతో విడిపోతూ ఒంటరిగా చేస్తున్న ప్రయాణానికి అడ్డుకట్ట వేస్తూ ప్రకృతి ప్రాముఖ్యత గూర్చి మానవ మేధస్సులో నాటే సువిశాల మర్రి విత్తనమే ఈ గ్రీన్ పోయెమ్స్. ఇందులోని ప్రతి కవితా తంగేడు చెట్టులా మనిషి జీవన వికాసములో భాగమయ్యే తంత్రులుగా అభివర్ణించవచ్చు.

**వారాల ఆనంద్ పేరు సినిమాలతో, డాక్యుమెంటరీలతో, ఫిలింక్లబ్‌లతో మమేకమైనదని కొందరంటారు. దీనిపై మీ వ్యాఖ్య?**

భాషలో ప్రకృతి మరియు వికృతి లాగా, నాణేనికి బొమ్మ మరియు బొరుసు లాగ, మనిషికి జన్మ మరియు పునర్జన్మ ఉంటుందని భావిస్తాను. నాలోని బహిర్ముఖుడు -ఒక ఛాయాగ్రహకుడు, ఒక సినీ విశ్లేషకుడు, ఫిలిం క్లబ్‌లతో మమేకమైన స్వాప్నికుడు అది ఒక పార్శ్వం ...అదే నా జన్మ... మరియు అంతర్ముఖుడు రచయితగా, కవిగా, అనువాదకుడుగా సాహిత్య సాగు చేస్తున్నాడు. ఇది మరో పార్శ్వం, అది... నా పునర్జన్మ....కవిత్వం సినిమా నాకు రెండు కళ్ళు

సృష్టిలో రహస్యం ఏమిటి?
పుట్టుక, చావు ...
బతుకులో సారమేమిటి....
ఓటమీ... గెలుపూ...



ఇంటర్వ్యూ
**డి.విజయ్ ప్రకాశ్**
9885778585

కవిత

# ఇంత బూడిద!



**కందుకూరి శ్రీరాములు**, 94401 19245



శూన్యం!
అంతా శూన్యం!

జీవమున్నంత సేపే
జవం!
అహం!

ధిక్కారమైనా
అధికారమైనా

మనుషులిట్లా ఎందుకయ్యారు?
తోడు రారు
గోడు వినరు

ఎన్నాళ్ళీ గద్దెలు, మిద్దెలు -
తెర ఎత్తగానే
నాంది ప్రస్తావనలు -
ఉన్నంతసేపే వీధి భాగోతం!
తెరదించితే
మంగళ హారతే!

కండలన్నీ మాడిపోయి
కిరీటాలన్నీ కూరుకుపోయి
పుట్టిన గిట్టిన తేదీలు
పాలరాతి మీద చెక్కుతుంటే
ఘోరీ నవ్వుతుంది

ఎగిరితే పడిపోయేది
కిందనే,
ఏం మిగులుతుంది
ఇంత బూడిదే!

వ్యాసం

# ముస్లిం పాలకులు - తెలుగు శాసనాలు

చరిత్రలో శాసనాల ప్రాధాన్యం...



డా॥ మామిడి హరికృష్ణ
80080 05231

వేదకాలం నుండి విశిష్ట చరిత్రను కలిగి ఉన్న దేశంగా మనదేశం ప్రత్యేకతను సాధించింది. సింధు నాగరికత కాలం నుండీ ప్రాచీన నాగరికతలకు నెలవుగా, ఆదిమ జాతుల జీవన శైలులకు కొలువుగా భారతదేశం చరిత్రకారులకు ఓ నిత్య అధ్యయన శాలగా, నిరంతర ప్రయోగశాలగా ఉంటున్నది.

ఈ నేపథ్యంలో అన్య దేశ సంస్కృతులు, అన్యమత విశ్వాసాలు భారతదేశంలోకి ప్రవేశించి ఎన్నెన్నో మార్పులను తీసుకువచ్చాయనేది కాదనలేని సత్యం. వీటిలో బౌద్ధం, జైనం, వైదిక మతం, హైందవ జీవన సంస్కృతులు ఈ నేలమీద పరిఢవిల్లిన స్వదేశీ విధానాలుగా ఉండగా, ఇస్లాం, క్రైస్తవం, జూరాష్ట్రియనిజం వంటివి అన్యమతాలు, అన్య దేశాల సంస్కృతులుగా దేశంలోకి ప్రవేశించి, దేశ జీవన విధానంపై ఎంతో ప్రభావాన్ని చూపించాయనేది నిజం.

వీటిలో ముస్లిం చక్రవర్తుల పాలన ప్రత్యేకమైనది. క్రీ.శ . 1215 నుండి 1857 వరకు దాదాపు 642 ఏళ్ళపాటు దేశాన్ని మొత్తం గానో, భాగాలుగానో పరిపాలించిన ముస్లిం పాలకులు దేశంలో అరబిక్, పర్షియన్, ఇస్లామిక్ తరహా జీవన శైలులను, భాషను, సాహిత్యాన్ని, సాంస్కృతిక రీతులను, వాస్తు శిల్పకళలను, పాలనా సంస్కరణలను, సైనిక యుద్ధ రీతులను పరిచయం చేశారు. అన్య దేశస్థులు, అన్యమతస్థులుగా వీరు దేశానికి ఏ మేరకు మేలు లేదా కీడు చేసారనేది ఇక్కడ అప్రస్తుతం. కానీ ఈ ముస్లిం పాలకుల కాలంలో భారతదేశం, తెలంగాణా ప్రాంతం ఎలాంటి ప్రభావానికి లోనయింది అనేది మాత్రం ఆసక్తి కలిగించే అంశమే. సాధారణంగా అన్యమతస్థులు, అన్య సంస్కృతులు, అన్యదేశస్థులు పాలకులుగా ఉన్నప్పుడు స్థానిక జాతులు, ప్రజలు, సంస్కృతుల పట్ల ఎలాంటి వైఖరిని కలిగి ఉంటారనేది కూడా కుతూహలాన్ని రేకెత్తించే అంశమే. ఇలాంటి నేపథ్యంలో దేశాన్ని పాలించిన ముస్లిం పాలకుల పాలనా రీతులను తెల్సుకోవడానికి వారు వేసిన శాసనాలు, వాటిలోని అంశాలు, వారు ఉపయోగించిన భాష వంటివి కొంతవరకు ఆధారంగా నిలుస్తాయి. అలా తెలంగాణా ప్రాంతంలో ముస్లిం పాలకులు ఆయా కాలాలలో వేసిన శాసనాలను, ముఖ్యంగా తెలుగులో వేసిన శాసనాలను అధ్యయనం చేయడం ద్వారా ఇప్పటి వరకూ అంతగా తెలియని చరిత్ర నిర్మాణానికి దారి ఏర్పడుతుంది.

**రెండింటికీ భిన్నంగా రాసిన మరో కవితా సంపుటి 'చూస్తుండగానే...'. ఆధునిక జీవితం లోని సంఘర్షణ, మానవ సంబంధాలు, రేపటి మనిషి, రాజు తీర్పు లాంటి అధిక్షేప కవిత్వాలు ఇందులో వున్నాయి. అనగా అనగా... అన్న కవిత ఎందరినో ఆకర్షించింది. సత్యమూర్తి ప్రత్యేకంగా ఆ కవిత మీద ఉత్తరం రాశాడు.**

భారత దేశంలో శాసనాల ప్రస్థానం

"Epigraphy is a primary tool of archeology when dealing with Literate Cultures" అనడాన్ని బట్టి శాసనాలు ఒక దేశ సాహితీ, సంస్కృతులను పురావస్తువుల ఆధారంగా వెల్లడి చేస్తాయని తెలుస్తోంది. అలా భారతదేశంలో శాసనాల ఆధారంగా చరిత్రను అధ్యయనం చేసే ప్రక్రియను మొదటిసారిగా అశోకుడు వేసిన శిలా శాసనాలపై ప్రారంభించారు. క్రీ. పూ 3వ శతాబ్దంలో బ్రాహ్మి లిపిలో రాసిన శాసనాలను Decipher చేయడం ద్వారా మౌర్యుల కాలానికి సంబంధించిన ఎన్నో అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఇవే కాక అశోకుడు క్రీ. పూ. 272-231 మధ్య కాలంలో వేయించిన 33 శాసనాలు ఆ కాలం నాటి భారత దేశ సామాజిక, ఆర్థిక, రాజకీయ ముఖచిత్రాన్ని ఆవిష్కరించాయి.

ఇలా శాసన శాస్త్రం (Epigraphy)

వ్యాసం

పరిష్కరించిన ఇతర భారత శాసనాలలో భారత చరిత్రలో మొదటిగా గుర్తించ బడిన రాతి శాసనం భట్టిప్రోలు శాసనం (క్రీ. పూ.3వ శతాబ్దం), కళింగ ఖారవేలుడు వేయించిన హాథీగుంఫా శాసనం (క్రీ. పూ. 2వ శతాబ్దం), రుద్రదాముని జునాగడ్ శాసనం (క్రీ. పూ. 150 ప్రాంతం) సముద్ర గుప్తుని అలహాబాద్ ప్రశస్తి, రెండో పులకేశి ఐహొల్ శాసనం (క్రీ. శ. 634) వంటివి ప్రముఖంగా ప్రస్తావించదగినవి.

ఇవే కాకుండా మరెన్నో శాసనాలు (రాతిమీద, లోహాలమీద, కర్ర మీద వేసినవి) విస్తృతమైన భారతదేశ చరిత్రను పునర్నిర్మించడానికి, అప్పటి వరకు ఉన్న అభిప్రాయాలను నిర్ధారణ (Affirm) చేయడానికి, తిరగ రాయడానికి (Re-write), చరిత్రను పునర్విమర్శ (Revision) చేయడానికి ఆధారాలుగా నిలిచాయి. ఈ శాసనాలు ఆయా కాలాలనాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక విశేషాలను మాత్రమే కాక, భాష, లిపి (Linguistic), పదపరిణామానికి (Etymological) సంబంధించిన ఎన్నెన్నో అంశాలను కూడా వెల్లడి చేసాయి.

ఈ విధంగా భారతదేశంలో శాసనాలను వేయడం క్రీ. పూ. 3వ శతాబ్దం నుంచే అమలులోకి వచ్చి ఆ తర్వాత గుప్తులు, శాతవాహనాలు, కుషానులు, రాజపుత్రులు, పుష్య భూతి పాలకుల కాలంలో కూడా కొనసాగాయి. ఆ తర్వాత భారతదేశాన్ని పాలించిన ముస్లిం పాలకులు మధ్య యుగ కాలంలో వేసిన శాసనాలు కూడా చరిత్ర రచన (Historiography)కు ఆధారాలుగా నిలిచాయి. అయితే మధ్య యుగ కాలంలోని శాసనాలు పాలకుల అధికార భాషలుగా చలామణి అయిన అరబిక్, పర్షియన్, ఉర్దు భాషలలోనే కాక సంస్కృతం, ఇతర దేశీయ భాషలలో కూడా లభించడం విశేషం అని చెప్పాలి.

**భారత దేశంలో ముస్లింల పాలన...**

భారతదేశంలో ముస్లింల పరిచయం, పరిపాలనకు క్రీ.శ.712లో మహ్మద్ బిన్



ఖాసిమ్ (695-715) దండయాత్రలతో అంకురార్పణ జరిగింది. ఉత్తర భారతంలోని ఖైబర్, బోలాన్ కనుమల గుండా వచ్చిన వీరు మొదట్లో భారతదేశ సంపదను దోచుకోవడమే ప్రధానాంశంగా దాడులు చేసారు. ఆ తర్వాత క్రీ.శ.1026 లో సోమనాథ్ దేవాలయంపై మహ్మద్ గజని దండయాత్రల వరకు ఇదే పరిస్థితి కొనసాగింది. (గజనీ ఆనాటి భారత భూభాగంపై 17 సార్లు దండయాత్రలు చేశారు).

కానీ 1192-93 ప్రాంతాలలో జరిగిన మొదటి, రెండవ తరైన్ (స్థానేశ్వర్) యుద్ధాలలో భారతీయ చక్రవర్తులు మహ్మద్ ఘోరీ చేతులలో పరాజితులు కావడంతో మొదటిసారిగా ముస్లిం



ఫిరోజ్ షా బహమనీ తెల్లాపూర్ శాసనం

పాలకుల పరిపాలన ఆరంభమయింది. తదనంతరం ఢిల్లీ సింహాసనంపై బానిస వంశ చక్రవర్తుల ఆగమనంతో దీనికి మరింత బలం చేకూరింది. అలా 1215లో ప్రారంభమైన ఢిల్లీ సుల్తానుల పాలన 1526 వరకు అంటే మొఘల్ సామ్రాజ్య స్థాపన దాకా కొనసాగింది. ఈ కాలంలో ఢిల్లీ సల్తనత్ ను పాలించిన బానిస, ఖిల్జీ, తుఘ్లక్, సయ్యద్, లోడీ వంశ పాలకులందరు దేశంలో ఇస్లాం తరహా పాలనా రీతులకు బలమైన పునాదులు వేసారు. వీరి పాలన 311 ఏళ్ళపాటు సుదీర్ఘంగా సాగడంతో భారతీయ రాజకీయ పాలనా, సాంస్కృతిక ముఖచిత్రం ఇస్లాం తరహాతో ప్రభావితం అయింది.

ఆ తర్వాత 1526లో జరిగిన పానిపట్ యుద్ధం ఢిల్లీ పీఠంపై లోడీ చక్రవర్తుల పాలనను అంతం చేసి, మొఘల్‌ల పాలనను ఆరంభించింది. అలా 1526లో బాబర్ నుండి, 1857లో బహదూర్ షా జఫర్ వరకు దాదాపు 321 ఏళ్ళపాటు భారతదేశం ఇస్లాం పాలకుల పరిపాలనలోనే కొనసాగింది.

ఆ లెక్కన భారతదేశంలో ఢిల్లీ రాజధానిగా ముస్లిం రాజుల పాలన మొత్తం 642 సంవత్సరాల పాటు (క్రీ.శ.1215 నుండి 1857 వరకు) కొనసాగింది. ఇంత సుదీర్ఘ కాలపు పాలన వల్ల సహజంగానే భారతీయ సాంస్కృతిక, సాహిత్య, కళారంగాలలో, ఆర్థిక, రాజకీయ రంగాలలో పరిణామాలు, ఆదాన ప్రదానాలు జరిగి ఇండో - ఇస్లామిక్ సంస్కృతుల సంగమం

వ్యాసం

భారతీయ జీవన శైలిలో రూపొంది భారతీయతలో అంతర్భాగం అయింది.

**తెలంగాణలో ముస్లిం పాలకులు...**

ఈ నేపథ్యంలోనే భారతదేశంలో ఒకటిగా తెలంగాణ ప్రాంతం కూడా అనివార్యంగా ముస్లిం రాజుల ఏలుబడిని చవిచూసింది. అయితే తెలంగాణా ప్రాంతంలో మాత్రం ముస్లిం పాలకుల పాలన ఢిల్లీ కన్నా 110 ఏళ్ళ తర్వాత ప్రారంభమైనప్పటికీ (దేశం ముస్లిం పాలకుల పాలన అంతమై బ్రిటిష్ వారి పాలన ప్రారంభమైన తర్వాత కూడా తెలంగాణా ముస్లిం పాలకులే కొనసాగడం వల్ల) మొత్తం 624 సంవత్సరాలు కొనసాగింది (క్రీ .శ. 1324వ నుండి 1948 వరకు). అలా తెలంగాణా ప్రాంతం ఢిల్లీ సుల్తానులకాలంలో (1324 -1347) 23 సంవత్సరాలు, బహమనీ సుల్తానుల పాలనలో (1347-1512) 165 సంవత్స రాలు, కుతుబ్ షాహీల ఏలుబడిలో (1512-1687) 175 సంవత్సరాలు, మొఘల్ సామ్రాజ్యంలో భాగంగా (1687-1723) 36 సంవత్సరాలు, అసఫ్ జాహీ నిజాంల పాలనలో (1724-1948) 224 సంవత్సరాలు కొనసాగింది.

దీనివల్ల తెలంగాణా ప్రాంతంలో ఎన్నెన్నో సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, ఆర్థిక, చారిత్రక, సాహిత్య, భాష, కళాత్మక, వాస్తుశిల్ప రీతులలో పరిణామాలు సంభవించాయి. వాటిలో ఆయా ప్రభుత్వాలు, రాజులు తీసుకున్న నిర్ణయాలు కట్టించిన నిర్మాణాలు, కట్టడాలు మొదలయినవి ఎన్నో ఉన్నాయి. అలాంటి సందర్భాలలో ఆనాటి ముస్లిం పాలకులు తమ మనోగతాన్ని, ఉద్దేశాలను ప్రజలకు తెలియజేయడం కోసం వివిధ శాసనాలను వేయడం, ఆ శాసనాలు తెలుగు భాషలో కూడా వేయడం విశేషం. దీనిని బట్టి ఆయా పాలకులకు ప్రజల భాష పట్ల, ప్రజల సంస్కృతి పట్ల ఒకింత గౌరవం ఉందనే విషయం స్పష్టమవడమే కాక, తాము తీసుకున్న విధాన నిర్ణయాలు ప్రజలందరికీ తెలియాలని, అలా తెలియడానికి అత్యధిక ప్రజల భాష అయిన తెలుగు అయితేనే సరైనదని భావించడం వల్లనే ఇది జరిగిందని అనుకోవచ్చు.

**బహమనీ పాలన...**

ప్రస్తుత తెలంగాణా ప్రాంతం బహమనీ చక్రవర్తుల పాలనలో 165 సంవత్సరాలు కొనసాగింది. ఈ కాలంలో బహమనీ వంశ స్థాపకుడైన అల్లా ఉద్దీన్ హాసన్ గంగు బహమన్ షా (1347-58ని), నుంచి మహ్మద్ షా (1358-75), ముజాహిద్ షా (1375-78), రెండవ మహ్మద్ షా (1378-97), ఫిరోజ్ షా (1397-1422), అహమ్మద్ షా వలీ (1422-36), రెండవ అల్లాఉద్దీన్ షా (1436-57), నిజాంషా (1461-63), మూడవ మహ్మద్ షా (1463-82), మహ్మద్ షా బహమనీ (1482-1518) వరకు పాలించారు.

వీరి కాలంలో ఎన్నో శాసనాలు వేసినప్పటికి, తెలుగులో వేసిన శాసనాలలో ఇప్పటివరకు లభిస్తున్న వాటిలో తెల్లాపూర్, దర్పల్లి, చరిగొండ శాసనాలు ప్రముఖమైనవిగా చెప్పవచ్చు.

వీరిలో ఫిరోజ్ షా బహమనీ కాలంలో వేసిన తెల్లాపూర్ శాసనం తొలిసారిగా 'తెలుంగనా' (తెలంగాణ) ప్రస్తావనను చేయడమే కాక, శాసనం అంతా తెలుగు పదాలతో నిండి ఉండటం విశేషం. ఆ తర్వాత అల్లావుద్దీన్ కాలంలో వేసిన దర్పల్లి శాసనంలో మొత్తం132 పంక్తులు ఉండగా, అందులో 126 పంక్తులు సంస్కృతంలోనూ 6 పంక్తులు తెలుగులోనూ రాయబడ్డాయి. అలాగే చరిగొండలో లభ్యమైన శాసనం మొత్తం తెలుగులో ఉండటం విశేషం.

**కుతుబ్ షాహీల పాలన (1512 -1687)...**

1512లో బహమనీ రాజ్యం ఐదు స్వతంత్ర రాజ్యాలుగా విడిపోయిన తర్వాత, తెలంగాణా ప్రాంతం సుల్తాన్ కులీ కుతుబ్ షాహీ స్థాపించిన గోల్కొండ రాజ్యంలో భాగమయింది. అయితే పూర్తి స్థాయిలో మాత్రం 1518 నుండే కుతుబ్ షాల ఏలుబడి మొదలయింది. అలా తెలంగాణా ప్రాంతం కులీ కుతుబ్ ఉల్ ముల్క్ (1518-1543), జంషీద్ కులీ (1843-50), సుభాన్ కులీ (1550), ఇబ్రాహీం కులీ (1550-1580), మహ్మద్ కులీ (1580-1612), మహ్మద్ కుతుబ్ షా (1612 -26), అబ్దుల్లా కుతుబ్ షా (1626-1672), అబుల్ హాసన్ తానిషా (1672-1687)ల పాలనలో కొనసాగింది. వీరు ఈ ప్రాంతాన్ని 175 ఏళ్ళపాటు పాలించారు. ఈ కాలంలో వీరు వివిధ సందర్భాలలో వేసిన శాసనాలలో 57 తెలుగు శాసనాలు బయల్పడ్డాయి. వాటిలో ఘన్ పూర్, కొండపల్లి, కోయలకొండ, పానగల్లు, వల్మిడి, వరంగల్లుకోట, మల్కాపురం, నాగర్ కర్నూల్, రాచకొండ, కందుకూరు వంటి వివిధ ప్రాంతాలలో వేసిన శాసనాలు ముఖ్యమైనవి.



ఇబ్రాహీం కుతుబ్ షా కోయల కొండ శాసనం (క్రీ.శ 1550)

కుతుబ్ షా కాలంలో వేసిన ఘనపూర్ శాసనంలో తెలుగుతోపాటు పారశీ పదాలు ఉండటం, శాసన లిఖిత సంప్రదాయానికి భిన్నంగా శాసనం విడుదల చేసిన సంవత్సరాన్ని శాసనం చివరన పేర్కొనడం విశేషం. మహమ్మద్

వ్యాసం

కులీఖుతుబ్ షా కాలంలో వేయించిన రాచపేట శాసన ప్రారంభంలో 'బౌద్ధావతారమందు' అని బుద్ధుని ప్రస్తావన ఉండటం చిత్రంగా అనిపిస్తుంది. అలాగే కుతుబ్ షా పాలకులు వేసిన శాసనాలలో అత్యధిక శాసనాలు సాధారణంగా 'స్వస్తిశ్రీ' తో మొదలై చివరన శాసనం రాసిన వారి సంతకంతో ముగుస్తాయి, అలా వీరు వేసిన శాసనాలలో పారశీ, తెలుగు భాషా పదాల జమిలి వాడుక వింతగా కనిపించడమే కాక, తెలుగు శాసనాలలో పారశీ భాషా పదాలు ప్రయోగించడాన్ని బట్టి అనాటి సమాజంలో భాషా పరమైన ఆదానప్రదానాలు ఎంతగా కలిసి పోయాయో అర్థమవుతుంది.

ఇవే కాకుండా మరెన్నో అనాటి కాలపు చారిత్రక అంశాలను శ్రీ బి.ఎన్. శాస్త్రి గారు 1989లో ప్రచురించిన "గోలకొండ చరిత్ర - సంస్కృతి, శాసనములు" అనే గ్రంథంలో సవివరంగా తెలియజేశారు.

**మొఘలుల కాలం...**

తెలంగాణా ప్రాంతం ఆనాటి రాజకీయ పరిణామాల వల్ల 1687 నుండి 1723 వరకు 36 ఏళ్ళపాటు మొఘల్ ల ఏలుబడిలో కూడా కొనసాగింది. ఆ కాలంలో ఢిల్లీ సింహాసనాన్ని ఔరంగజేబ్ (1658-1707), కడపటి మొఘల్ లైన షా ఆలమ్, ఫరూఖ్ సియర్, రోషన్ అక్తర్ బహదూర్ (1719-1748) వంటివారు పాలించారు.

ఈ కాలంలో మొఘలులు తమ పాలనాతీరును తెలియజేప్పడానికి వేసిన శాసనాలలో 14 తెలుగు శాసనాలు లభించగా, అందులో గడికోట, బొల్లవరం, దేవరకొండ, పుత్తేరి, చిన్నపసుపుల, బసినికొండ వంటి శాసనాలు ప్రసిద్ధమైనవి. ఈ శాసనాలలో తెలుగు పదాలు అధికంగా ఉండటం గమనించదగింది.

**ఆసఫ్ జాహీల కాలం...**

మొఘల్‌ల సైన్యంలో అనేక యుద్ధాల్లో పనిచేసి విజయాలు సాధించిన ఒక సేనాని మీర్ ఖమ్రొద్దీన్. ఆయన ధైర్య సాహసాలను మెచ్చిన ఔరంగజేబ్ ఆయనకు 'చిన్ ఖిలీచ్ ఖాన్' అనే బిరుదునిచ్చి



మహమ్మద్ కుతుబ్ షా కొండపల్లి శాసనం (క్రీ.శ.1530)

దక్కన్ ప్రాంతానికి సుబేదార్‌గా నియమించాడు. ఆ తర్వాత జరిగిన పరిణామాలలో మొఘల్ సామ్రాజ్యం, బహమనీ రాజ్యాలు కూడా పతనం కావడంతో ఆయన తనను 1724లో స్వతంత్ర రాజుగా ప్రకటించుకున్నాడు. అప్పట్నించీ ఆసఫ్ జాహీ వంశం, నిజాం ఉల్ ముల్క్ ప్రభుత్వం, దక్కన్ - తెలంగాణా ప్రాంతంపై పాలనా పగ్గాలు కైవసం చేసుకుంది. మొదట ఔరంగబాద్, ఆ తర్వాత హైదరాబాద్ రాజధానిగా ఆసఫ్ జాహీవంశం 1724 నుండి 1948 వరకు మొత్తం 224 ఏళ్ళపాటు తెలంగాణా ప్రాంతాన్ని పాలించింది.

ఈ కాలంలో మీర్ ఖమ్రొద్దీన్ చిన్ ఖిలీచ్ ఖాన్ ఉల్ ముల్క్(1724-48)తో మొదలుపెట్టి, నాసర్ జంగ్ (1748-50), ముజాఫర్ జంగ్ (1750-51), సయ్యద్ మహ్మద్ ఖాన్ సలాబత్ జంగ్ (1751-62), మీర్ నిజాం ఆలీఖాన్ (1762-1803), మీర్ అక్బర్ ఆలీఖాన్ సికిందర్ జా (1803-29), నాసిరుద్దేలా (1829-57), అప్జలుద్దేలా (1857-69), మీర్ మహబూబ్ అలీఖాన్(1869-1911), మీర్ ఉస్మాన్ అలీఖాన్ (1911-1948) లు హైదరాబాద్ నిజాం రాజ్యాన్ని పాలించారు.

కాగా, నిజాం చక్రవర్తులు కూడా తమ పాలనారీతులను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వెల్లడి చేయడానికి కొన్ని శాసనాలను వేయించారు. వాటిలో లభ్యమైన తెలుగు శాసనాలు 8 కాగా, కోసిగి, కొనకండ్ల, కోయలకొండ, అరగిద్ద వంటి ప్రాంతాలలో వేసిన శాసనాలు ముఖ్యమైనవి.

ఈ శాసనాలను 'డీకోడ్' చేయడం ద్వారా ఆయా కాలాలనాటి ముస్లిం పాలకులు ప్రజల పట్ల, ప్రగతి పట్ల ఎలాంటి వైఖరిని కలిగి ఉన్నారు? ఎలాంటి శిస్తు విధానాలు, ఆర్థిక ఆంక్షలూ, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసారు? వారి రాజ్య విస్తరణ, సరిహద్దులు ఏ మేరకు ఉండేవి? వారిలో మత, ఆధ్యాత్మిక, భక్తి పరమైన ధోరణులు ఎలా ఉండేవి? శాసనాలలో ఉపయోగించిన పదాలు, భాష, అన్య భాషా పదాల వాడకం, ఎలా ఉంది ? తెలుగు భాషతో ఉర్దూ, అరబిక్, పర్షియన్, భాషా పదాల సమ్మేళనం ఏమేరకు జరిగింది? సాధారణంగా ముస్లిం రాజులు పట్ల ప్రజలలో ఏర్పడ్డ అభిప్రాయాలు, లేదా ఏర్పరిచిన అభిప్రాయాలు సరైనవేనా? ఆ అభిప్రాయాలలోని వాస్తవికత ఎంత? లాంటి ఎన్నో ప్రశ్నలు, సందేహాలకు ఈ శాసనాలు కొంత వరకు సమాధానాన్ని ఇవ్వగలుగుతాయి.

ఇలా తెలంగాణా ప్రాంతాన్ని పాలించిన ముస్లిం పాలకులు తమ పాలనా విధానాలను తెలియజేయడానికి అత్యధిక ప్రజలు మాట్లాడే తెలుగు భాషలోనే శాసనాలు వేయడం వెనుక ప్రజలకు 'ఎరుక' చేయాలనే అవసరమే మనకు కనిపిస్తుంది. అంతేగాక, తెలుగులో లభ్యమైన ఈ శాసనాలను అధ్యయనం చేయడం ద్వారా ఆనాటి భాష, సాహిత్య, సాంస్కృతిక, చారిత్రక, సామాజిక, ఆర్థిక స్థితిగతులను తెల్సుకోవడం సాధ్యమై తెలంగాణా చరిత్రలోని ఎన్నెన్నో విస్మృత కోణాలను (Forgotten), ఇప్పటిదాకా తెలియని (Unknown) సత్యాలను ప్రపంచానికి వెల్లడి చేయడానికి మార్గం సుగమం అవుతుంది.

# దళితుల వెతలకు దర్పణం "దగ్ధం" కథలు

దళిత కథలలో సమాజం...



డాక్టర్ మండల స్వామి
91776 07603

భూతం ముత్యాలు అంటే తెలుగు సాహిత్యంలో పరిచయం అవసరంలేని పేరు. వారు ఉపాధ్యాయుడుగా సేవలందిస్తూనే కవిగా, రచయితగా, అనువాదకుడిగా విభిన్న ప్రక్రియల్లో విశేషమైన కృషి చేస్తున్నారు. కవిగా దుగిలి అనే దళిత కవిత్వం అందించారు. నవలాకారుడుగా సూర, ఇగురం, మొగిలి, పురుడు, మాలచ్చువమ్మ వంటి ప్రతిష్టాత్మక నవలలు అందించగా కథకుడిగా బేగరి కథలు, బుగాడ కథలు, దగ్ధం కథలు, మాలపల్లి కథలు వంటి రచనలెన్నో తెలంగాణలోని పల్లెల్లో మాలల, మాదిగల బ్రతుకులను చిత్రిస్తూ, దళిత, బహుజన స్పృహను తనదైన శిల్పాన్ని కంట్రిబ్యూట్ చేసి, రికార్డ్ చేసి శాశ్వతత్వాన్ని ఆపాదించి పెట్టారు. అంతే కాకుండా మాండలికం అను పేరుతో తెలంగాణ కులవృత్తి పదకోశం అందించారు. నియతి అనే ఆటోబయోగ్రఫీ రాసినారు. కులాటకం నాటకం, దస్తూరి అనే వ్యాససంపుటి, మాల వారి చరిత్ర రాసి వారి విభిన్నతను చాటుకుని అలుపెరుగని బహుముఖ ప్రజ్ఞాశాలిగా, అక్షర సేద్యం చేస్తూ చెరగని ముద్ర వేసుకున్న నిరంతర సాహితీ కృషీవలుడు.

వారు రాసిన దగ్ధం దళిత కథలను సమీక్షించినప్పుడు అనేక విషయాలు స్పష్టమవుతాయి. ముఖ్యంగా నల్గొండ



జిల్లాలోని జీవద్భాషను తన రచనలకు వాహికగా ఎంచుకున్నాడు. దళితుల జీవితాలను చాలా దగ్గరగా చూసిన అనుభవంతో, వారి కష్టాలను, కన్నీళ్లను కథలుగా అల్లినాడు. ఈ కథలన్నీ ఎక్కువగా దళితుల దైన్యంతో నిండి ఉన్నప్పటికీ తిరుగుబాటును, ప్రశ్నించే తత్వాన్ని, సాటి సమాజం నిష్క్రియా పరత్వం గురించి బాగా ఆలోచింప జేస్తాయి.

రచయిత తను స్వయంగా చూసిన అనేకానేక అనుభవాలు కథలుగా అల్లి పాఠకుడిని ఎంతగానో ఆలోచింప చేస్తాడు. వ్యవస్థలో స్వయంగా సాంస్కృతిక అణిచివేతను ప్రత్యక్షంగా అనుభవించిన వారికే పూర్తిగా అర్థమవుతుంది. బయట నుంచి చూసేవారు కేవలం సిద్ధాంతీకరించవచ్చు కానీ ఈ రచయిత ప్రాక్టికల్ అనుభవంతో వివక్షను, విస్మరణను మనసు నిండా నింపుకున్నాడు కాబట్టి ఆ నేపథ్యంలోనే అనేక కథలు రావడం విశేషం. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భావజాలంతో ఈ సమాజానికి అనేక ప్రశ్నలు సంధించి ఎందరినో ఆలోచింప చేస్తాడు.

దగ్ధం దళిత కథల్లో ఒక పాఠకుడిగా నన్ను బాగా ఆకట్టుకున్న కథ మీనా. ఈ కథ ఉత్తమ పురుషలో సాగుతుంది. అమ్మ శాంత. నాన్నకి తాగుడు అలవాటు. పక్కింటి పోషవ్వ ధైర్యంతో అమ్మమ్మ ఇంటికి వెళ్తారు. నాన్న మందేసుకుని చనిపోతాడు. ఆ వార్త తెలిసిన అమ్మ కూడా చనిపోతుంది. చివరికి అమ్మమ్మనే లోకమని నమ్ముకున్న మీనా ఒంటరవుతుంది. కన్నీరు తెప్పించే ముగింపుతో హృదయాలను మెలిపెట్టే కథా కథనం పాఠకుడిని ఎంతో ఆకట్టుకుంటుంది.

ఈదురుగాలి కథలో బక్కయ్య రుక్కమ్మ దంపతులకు పెళ్ళీడుకు వచ్చిన కూతురు (సుజన) ఉంటుంది. ఈ కథ మొత్తం ఆసక్తిగా సాగుతూ చివరికి ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠతో బాగా ఆలోచింపచేస్తుంది. బక్కయ్యకు ఈదురుగాలికి పంటకొచ్చిన సేను ఏమై పోతుందోనన్న భయం ఒక వైపు,

పెళ్ళీడుకొచ్చిన బిడ్డ ఏమైపోతుందోనన్న భయంతో వణికి పోతూ ఉండడంతో భార్య రుక్కమ్మ కొండంత ధైర్యాన్ని నింపే అత్యంత ఆత్మ విశ్వాసం కలిగిఉన్న పాత్రగా మలిచిన తీరు గొప్ప సందేశాత్మక, విషయాత్మక కథగా మిగులుతుంది. హృద్యమైన ముగింపు ప్రత్యేక ఆకర్షణ.

దగ్ధం కథలో పాపయ్యకు అక్రమ సంబంధం ఉండటం వల్ల భార్య సుగుణమ్మ నిలదీస్తుంది. ఇద్దరు పిల్లలు ఉన్నా కూడా ఆ పిల్లలు చూస్తు ఉన్నప్పుడే పాపయ్య తన తల్లితండ్రుల సహకారంతో భార్యను చంపుతాడు. జంగయ్య సాయంతో ఓ పాత బావిలో పడేసి వస్తాడు. ఏమీ ఎరుగనట్లు బంధువులు అందరకీ చెప్పి వెతికిస్తాడు. భార్య బావిలో పడి ఆత్మహత్య చేసుకున్నదని అందరినీ నమ్మిస్తాడు. ఇదంతా చూసిన పాపయ్య కొడుకు దొర సమక్షంలోనే గొడ్డలితో మెడ నరికి చంపేస్తాడు. ఈ కథలో పాపయ్య కుటుంబం ఎట్లా దగ్ధం అయ్యిందో రచయిత కథనాత్మకంగా చిత్రించిన రచనాశైలి పాఠకుడిని బాగా ఆకట్టుకుంటుంది. కథ చివరలో పాపయ్య తనను తానుగా పశ్చాత్తాపం చెందినట్లుగా కథను మారిస్తే బాగుండునని నా అభిప్రాయం.

కన్నపేగు కథలో సుశీలకు ముగ్గురు బిడ్డల తర్వాత మళ్ళీ బిడ్డ పుడితే భర్త తాగుడుకు బానిసైతడు. చివరికి భార్య, అత్తా మామలు, బామ్మర్ది ఎవరు చెప్పినా వినకుండా నెలలు నిండని పసికందుని అమ్మడానికే పూనుకుంటాడు. కథ ముగింపులో "నెల నిండని పసిగుడ్డు సిరిమంతుల గడప తొక్కింది. సిరిలేని ఆ ఇల్లు మూగవోయి చీకట్లు అలుముకున్నది. కొన్న వారిల్లు చిట్టిపాప చిరునవ్వుతో కళకళలాడింది."ఈ వాక్యాల ద్వారా రచయిత తప్పకుండా మహిళా బాలికా పక్షపాతిగా దర్శమిస్తాడు.

కేన్సర్ గౌరమ్మ కథలో పొగాకు ఎంకులు గౌరమ్మలకు నలుగురు బిడ్డలు. ఆ నలుగురు బిడ్డలను నాలుగూర్ల




కిస్తారు. ఆ తర్వాత గౌరమ్మకు కేన్సర్ వచ్చిందని తెలిస్తే పెద్ద బిడ్డలు అసలే రారు. చిన్న బిడ్డలు ఇద్దరూ వచ్చి చూచి పోతారు. అంతే కాని ఎవరూ ఆదుకోరు. చివరికి ఎంకులు తన తాగుడు వల్లనే భార్యకీ గతి పట్టిందని తెలుసుకొని పశ్చాత్తాపపడ్డాడు. చివర్లో భార్య గౌరమ్మ తాను చావుకు దగ్గరైందని తెలుసుకున్నా భర్తకు మాత్రం ధైర్యం నూరిపోసే చక్కని మనో ధైర్యం అందించిన కథగా మిగులుతుంది అనడంలో అతిశయోక్తి లేదు.

ఆశయ్యకల అనే కథలో ఆశన్న పేరుకు తగ్గట్టుగానే ఆశాజీవి. తన చిన్ననాడే కుల వివక్ష, అవహేళనకు గురైనా ఏవీ లెక్క చేయలేదు. అంబేడ్కర్ ఆలోచనా విధానంతో చదువు కొనసాగించాడు. ఉన్నతమైన ఆశలసౌధం నిర్మించాలని కల గన్నాడు. అందుకోసం ఎన్ని అవాంతరాలైనా ఓర్చుకున్నాడు. ఎన్ని కష్టాలనైనా ఎదురీది తట్టుకుని నిలవడగలిగేడు. ఆ తర్వాత యూనివర్సిటీ స్థాయికి ఎదిగిన విద్యార్థి ఈ సమాజం చేస్తున్న అవమానాలను భరించ లేక చివరికి ఆత్మ హత్య చేసుకుంటాడు. కథానాయకుడి పాత్రను విషాదాంతంతో ముగించారు.

జాలి కథలో బిచ్చం అడుక్కునే వాళ్ళు కూడా మనుషులేనని, వాళ్లలో మానవత్వం ఉంటుందని, వారిపట్ల ఈసడింపులు కాకుండా ఏ విధంగా జాలి చూపవచ్చునో చెబుతూ జాలి హృదయాన్ని చాటిన కథ ఇది. ప్రారంభంలో అద్భుతమైన వర్ణన ఉన్నది. "మలిసంజె మొగులు మస్క మస్కగా ఊరంతా పర్సుకుంది. మాగిన పండులాంటిపొద్దు పడమటి కొండల మాటున దిగింది. సిన్నగ ఊరంతా సీకటి పరచుకుంటూ మెల్లెమెల్లెగా సీకటి ఆవహించుకుంటుంది. పచ్చులు కిచకిచలాడుతూ చెట్ల కొమ్మల మీది గూట్లకు జేర్కుంటున్నయ్. ఊరపసులు, జీవాలు దొడ్లల్లకు జేర్నయ్. సందవాకిలి ఊకిన మల్లవ్వ నిప్పు రాజేయనికి పొయ్యికాడ కూలవడ్డది. అలవాటు పడ్డ పొయ్యితాన ఎప్పటి లెక్కనే నిప్పురాజేసి దీపం బుడ్డి ముట్టించి గూట్ల పెట్టింది. ఆ దీపం ఎలుగు గుడిసె నిండుగా పర్సుకుని బంగారమోలె దగదగలాడ్తుంది గుడిసె". ఇట్లాంటి మరిన్ని వర్ణనలున్నవి. పాలగుమ్మి పద్మరాజు రాసిన ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గాలివాన కథను గుర్తుకు తెస్తుంది ఈ జాలి కథ. అందుకు కొన్ని నిదర్శనాలున్నాయి. గాలివాన కథలో ముసలి బిచ్చగత్తె, అహంకారి రావుగారి పాత్రలు ఉన్నట్లే జాలి కథలోనూ ముసలి బిచ్చగత్తె అహంకారి అయిన భర్త పాత్రలున్నవి. ఆ కథలో జోరుగా వర్షం ఉంటే ఈ కథలో ఎండాకాలం కనబడుతుంది. ఆ కథలో బిచ్చగత్తె రావుగారిని కౌగిలిచ్చి బతికిస్తే ఈ కథలో ముసలి బిచ్చగత్తె అవ్వ భర్తకు నీళ్ళిచ్చి బతికిస్తుంది. ఇలా ఒకటి రెండు పోలికలు కనిపిస్తాయి అంతే కాదు ఈ కథనిండా సహజమైన భాషా సౌందర్యం కనబడుతుంది. గాలివాన కథను ఈ రచయిత మోడల్ గా తీసుకున్నా రనిపిస్తుంది. అయినా ఇక్కడి భౌగోళిక పరిస్థితుల అంచనా ప్రకారం తనదైన శిల్పాన్ని ప్రకటిస్తూ భిన్నంగా జాలి కథను రాసారు. అందుకు అనుగుణంగా, సమర్థవంతమైన సృజనకారుడిగా ఆలోచించి భూతం ముత్యాలు గారు కథా

రచయితగా సఫలీకృతులయ్యారనడంలో ఏ మాత్రం సందేహం లేదు.

గుడిసెలంటుకున్నయ్ కథలో నగరంలో గుడిసెలు వేసుకొని జీవిస్తున్న పేదవాళ్ళు ఎన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందో భూకబ్జా లీడర్లు ఏం చేసింర్రో ఈ కథలో చెప్పారు. పల్లె అయినా, పట్నమయినా అంటరాని వారంటే అందరికీ అలుసే అని చాటిన కథ ఇది.

ఈ కథల నిండా పాఠకుడిని ఆసక్తి కరంగా చదివించే అనేక తెలంగాణ ప్రాంతీయ సామెతలు కనబడతవి. వాటిలో కొన్ని "కూట్ల రాయి తీయలే నోడు ఏట్ల రాయి లేప బోయిండంట, కోటి ఇద్యలు కూటికేనాయే, వాన రాకడ పానం పోకడ ఎవనికెర్క, నమ్మి నానవోస్తే పుచ్చి పుండ్లాయే, యాడ సెల్లనోడు పొయ్యికాడ పొందిండంట, చెవిటోని ముంగట శంకమూదినట్లయింది, ఏను గడ్డముంటే ఏడు గండాలు తప్తయంట, ఎడ్లెనుకనే ముడ్లు ముడ్లెనుకనే ఎడ్లు, తేలు మంత్రం రానోడు పాము నోట్లబెడ్తే, ఇంత పొడుగా అంత పొడుగా సస్తే బొందపొడుగా, తంతె లేవలేనోడు గోకితె లేస్తాడు, కాకిపిల్ల కాకికి ముద్దు, కుడుమంటె పండుగంటుంర్రే, నాగలి మంచిది కాకుంటే ఎడ్లేం జేస్తయ్''... ఇట్లాంటి సామెతలు పుస్తకం నిండా కోకొల్లలుగా కనిపిస్తూ ఆయా కథల్లో సందర్భానుసారంగా పాఠకుడికి కొత్త ఉత్తేజాన్ని నింపుతాయి అనడంలో అతిశయోక్తి లేదు. రచయిత అన్ని కథల్లో కథకుడి భాష మాండలికం ప్రయోగిం చాడు కథా కథన భాష పాత్రల భాష కూడా నల్లగొండ జీవద్భాషనే ఉపయోగిం చాడు. ప్రత్యేకమైన మాండలిక పదాలు లడాయి, కష, తువ్వర, సినుకు, సంగాడబట్టిండు, బుగాడ, నాస్పెట్టుకొని, ఉరాన ఊరెడు, లోత, పన్నెండంత్రాలు, ఇసును, గోలిచ్చి, మస్కూరి, ఆలటోల, మంకనాలు వంటి ఎన్నో పదాలు పాఠకులకు ఎంతో ఆసక్తిని కలిగిస్తాయి.

ఇంకా ఈ కథా సంపుటిలో గుప్పెడుగూడు, బలి, వెలి, కర్రోడు, ఈడుజోరు, సదువు, ఆశిర్కం, ఆరోజు' వంటి విభిన్నతను చాటే కథలున్నవి. కథలన్నీ రచయిత తన స్వీయానుభవం నుండి వచ్చినవి. ఆతని అనుభవాలు, జ్ఞాపకాలు, కన్నీటి జలపాతాల కలబోతతో పాఠకుడిని కథలతో మమేకం చేస్తాడు. కంట తడిపెట్టిస్తాడు. ఊహ కల్పితాలు చాలా చాలా తక్కువగా కనిపిస్తవి. అభ్యుదయ దృక్పథంతో దళిత స్పృహతో కథలు రాసినారు. ప్రధానంగా మహిళల వ్యథార్థ జీవిత గాధల గురించి, పల్లెలు మరియు పట్టణాల్లో నివసించే నిమ్న వర్గాల గురించి, దొరల దౌర్జన్యం వంటి ఎన్నో అంశాలు స్పృశించిన దార్శనికుడిగా కథా సాహిత్య చరిత్రకు చక్కని కథలు అందించిన రచయిత భూతం ముత్యాలు అభినందనీయులు.

## రచయితలకు సూచనలు

- ✓ సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు విధిగా రెండు కాపీలు పంపాలి.
- ✓ పత్రిక కోసం రచనలు పంపించే వారు యునికోడ్‌లో ఉంటే ఓపెన్ ఫైల్ మరియు పిడిఎఫ్‌లో మెయిల్ చేయండి.
- ✓ మా పత్రికకు రచనలు పంపినవారు ఇక్కడ అచ్చయాకనే ఫేస్ బుక్‌లో బ్లాగ్‌లో పెట్టండి.
- ✓ ప్రతి రచనకు ఇది ఎక్కడా ప్రచురణ కాలేదని, ఏ బ్లాగ్‌లో పోస్ట్ చేయలేదని, ప్రచురణ ప్రసారం కోసం ఎవరికీ పంపి ఉండలేదని హామీ పత్రం జత చేయండి.
- ✓ పత్రికలో ఒక కథ లేదా వ్యాసానికి నాలుగు పేజీలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన పదమూడు వందల పదాలకు మించకుండా వ్యాసం, కథ పంపించండి.
- ✓ కవితలు 15 పాదాలకు మించకుండా పంపించండి.
- ✓ వ్యాసాలు, కథలు, కవితలు ఏవైనా పోస్ట్‌లో కూడా ఈ క్రింది చిరునామాకు లేదా ఇ-మెయిల్‌కు పంపవచ్చు.
- ✓ ప్రచురణకు స్వీకరించిన రచనల్ని పత్రికననుగుణంగా మార్పు చేసుకునే హక్కు సంపాదకవర్గం కలిగి ఉంటుంది.

**తెలంగాణ జాగృతి**

పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 3వ అంతస్థు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర,
అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in

## "సత్యారాధేయం" ఎంతో ప్రత్యేకం...

**- నాళేశ్వరం శంకరం**



స్మృతికావ్యం సాహితీ ప్రపంచంలో విస్తృతంగా వ్యాపించడం కవి ప్రతిభను బట్టి ఉంటుందని, స్మృతి కావ్యాలలో డాక్టర్ రాధేయ రాసిన "సత్య రాధేయం" కావ్యం ఎంతో ప్రత్యేకమైనదని, ఆకావ్యంపై లబ్ధ ప్రతిష్టులైన కవులు 64 వ్యాసాలు రాయడం వాటిని "సాంత్వనం" అనే పేరుతో పుస్తకంగా ప్రకటించడం సాహిత్య చరిత్రలో అరుదైన విషయమని తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షులు డాక్టర్ నాళేశ్వరం శంకరం అన్నారు. ఆయన మార్చి 5న నిజామాబాద్ కేర్ డిగ్రీ కళాశాలలో జరిగిన సాహిత్య సభలో పాల్గొన్నారు. ఈ సభలో రాధేయ రాసిన స్వాంతనం పుస్తకాన్ని డాక్టర్ నాళేశ్వరం శంకరం ఆవిష్కరించగా, ప్రముఖ కవి పేరు శెట్టి శివకుమార్ రాసిన మొలగొలుసు, చేను, కవితా సంపుటిని తెలంగాణ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ వి శంకర్ ఆవిష్కరించారు. తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఘనపురం దేవేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి జి. నరసింహస్వామి గ్రంథాల పరిచయం చేశారు.

## మానవీయ విలువలను శతకాలు ముందు తరాలకు అందిస్తాయి...

**- కసిరెడ్డి వెంకట్ రెడ్డి**



మానవీయ విలువలను శతకాలు ముందు తరాలకు అందించడం ద్వారా సమాజానికి ఎంతో మేలు చేస్తాయని ఉస్మానియా విశ్వవిద్యాలయ పూర్వ ఆచార్యులు కసిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ మరియు తెలుగు భాషా చైతన్య సమితి వారి సంయుక్త ఆధ్వర్యంలో మండల గురునాథం రచించిన ధరణి వాస శతకం పుస్తకావిష్కరణ సభ ఫిబ్రవరి 26 ఆదివారం నాడు రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్లో జరిగింది. దోరవేటి సభాధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కసిరెడ్డి వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ధరణి వాస శతకం పుస్తకాన్ని ఆవిష్కరించారు. కసిరెడ్డి మాట్లాడుతూ ధరణి వాస శతకం ప్రకృతిలో పంచభూతాలను గురించి మానవుల విలువలను గురించి మానవుల్లో ప్రేమ తత్వాన్ని ఆవిష్కరించిందన్నారు. డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ శతక ప్రక్రియ అనేక శాఖలుగా విస్తరించి తెలుగు సాహిత్యం సుసంపన్నం చేసిందన్నారు.

## తెలంగాణ సారస్వత పరిషత్తు ఆహ్వానం

తెలంగాణ సారస్వత పరిషత్తు 2023 సంవత్సరానికి ఉత్తమ గ్రంథ పురస్కారాలకు రచనలు ఆహ్వానిస్తున్నట్లు పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె. చెన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31వ తేదీలోగా రచనలు పంపాలి. పద్య కవిత్వం, గేయ కవిత్వం, వచన కవిత్వం, కథ, విమర్శ, నవల తో పాటు యువ పురస్కారం అనే ఏడు పురస్కారాలు ఉంటాయి. యువ పురస్కారాలకు 35 ఏళ్లలోపు యువ రచయితలు రచయితలు మాత్రమే అర్హులు. వాళ్ల రచనలు పంపాలి. ఇతర పురస్కారాలకు వయోపరిమితి లేదు. గ్రంథ రచయితలు జన్మత తెలంగాణ వారై ఉండాలని, ఇతర ప్రాంతాల వారు అర్హులు కారని చెన్నయ్య ఆ ప్రకటనలో పేర్కొన్నారు. 2021, 2022 సంవత్సరాల్లో తొలిముద్రణ పొందిన పుస్తకాలు పంపాలి. కవిత్వం అయితే కనీసం 60 పుటలు, కథ, విమర్శ, నవల, ఇతర ప్రక్రియలైతే 100 పూటలకు తక్కువ ఉండరాదు. పుస్తకం మూడుప్రతులను తెలంగాణ సారస్వత పరిషత్తు, తిలక్ రోడ్డు, అబిడ్స్, హైదరాబాదు 500 001' చిరునామాకు పంపాలి అని జె. చెన్నయ్య తెలియజేశారు.

## ప్రతాపరెడ్డి నిఖార్సైన సాహితీ విమర్శకుడు...

**- డా॥ సుమతీ నరేంద్ర**



కాసుల ప్రతాపరెడ్డి నిఖార్సైన సాహితీ విమర్శకుడని ఉస్మానియా విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులు డా. సుమతీ నరేంద్ర అన్నారు. మార్చ్ 5వ తేదీ ఆదివారం నల్లగొండలోని టీఎన్జీవో భవనంలో బహుళ సాహితీ నల్లగొండ ఆధ్వర్యంలో డా॥ మద్దిరాల సత్యనారాయణ రెడ్డి రాసిన 'కాసుల ప్రతాపరెడ్డి సమగ్ర సాహిత్యం - విశ్లేషణ' అనే సిద్ధాంత గ్రంథాన్ని ఆవిష్కరించిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్క్సిజం ప్రాసంగికతని గుర్తిస్తూనే అస్తిత్వ ఉద్యమాల ద్వారా ప్రత్యామ్నాయ రాజకీయ ఉద్యమాల నిర్మాణం జరగాలని ప్రతాపరెడ్డి ఆకాంక్షించాడని ఆమె అన్నారు. కవి రచయిత డా. సుంకిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతాపరెడ్డి సాహిత్యాన్ని చాలా చక్కగా విశ్లేషించి సమగ్ర గ్రంథంగా తీర్చిదిద్దడంలో సత్యనారాయణ రెడ్డి కృషి ఎంతో ఉందన్నారు. కాసుల ప్రతాపరెడ్డి మాట్లాడుతూ అనేక ఏళ్లుగా తాను రాసిన రచనలను సేకరించి, పరిశీలించి సమగ్ర విశ్లేషణ జరిపిన సత్య నారాయణ రెడ్డిని అభినందించారు.




## ఎద్దు ఎవుసం సరుకుల వైద్యం

గులాబీల మల్లారెడ్డి

పాలపిట్ట పబ్లికేషన్స్
హైదరాబాద్
వెల : రూ. 100/-



## దేహ నాగర లిపి

బి.ఎస్.ఎమ్. కుమార్

పాలపిట్ట పబ్లికేషన్స్
హైదరాబాద్
వెల : రూ. 300/-




## కొత్త వేకువ

పద్మావతి రాంభక్త

పాలపిట్ట పబ్లికేషన్స్
హైదరాబాద్
వెల : రూ. 300/-




## అభ్యుదయ కవిత్వం మధ్యతరగతి జీవితం

డా॥ సుంకిరెడ్డి నారాయణ రెడ్డి

ఛాయా రిసోర్స్ సెంటర్




## కతల చెట్టు

రాగులపాటి (రాగినేని) లక్ష్మీ పిల్లల పండుగ రంగినేని పిఎంఆసి ట్రస్టు, సిరిసిల్లా
సెల్ : 98490 12459, 929906 87853

వెల : రూ. 100/-




## కొత్త ఊపిరి

బి. కళాగోపాల్
సెల్ : 94416 31029

వెల : రూ. 200/-



## లేంబాళ వాటిక కథలు

పిన్నంశెట్టి కిషన్

పాలపిట్ట పబ్లికేషన్స్
హైదరాబాద్
వెల : రూ. 200/-



## ఆకాశంలో ఒక నక్షత్రం

డా॥ ఎం. సుగుణరావు

పాలపిట్ట పబ్లికేషన్స్
హైదరాబాద్
వెల : రూ. 200/-




## ద్వాదశి

బుర్రా లక్ష్మీనారాయణ

పాలపిట్ట పబ్లికేషన్స్
హైదరాబాద్
వెల : రూ. 200/-



వికాసోద్యమ స్ఫూర్తి....

# సురమౌళి

వర్ధంతి : మార్చి 20